ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-9-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 224 పేజీలు: 12 వెల: 8.00

భారీగా ఐపిఎస్‌ల బదిలీలు 2లో

భారత్‌పై సుంకాలకు జి-7 దేశాలు సిద్ధం 9లో

## వైషమ్యాలు సృష్టించే ఉచ్చులో పడొద్దు



### కుట్రలు చేసేవారిని పదేళ్లుగా చూస్తున్నాం
### వారిపై చట్టప్రకారం చర్యలు: డిసిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 13.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అభివృద్ధి దిశగా సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్న ఈ తరుణంలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే విధంగా కుట్రలు మొదలయ్యాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సోషల్ మీడియా 'ఎక్స్' ట్వీట్‌లో పిలుపునిచ్చారు. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. సామాజిక మాధ్యమాల ముసుగు మార్గంలోనో, యూట్యూబ్ ఛానెళ్ల పేరుతోనో, మరో విధంగానో కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారు. ఇలా కుయుక్తులతో సమాజంలో అశాంతి, అభద్రత కలిగించే వ్యక్తుల నైజాన్ని పదేళ్లుగా చూస్తున్నారు. వారి ఉచ్చులోపడి, ఆవేశాలకులోనై, ఘర్షణ వాతావరణానికి తావియ్యవద్దు. అలా ఆవేశాలు చూపిస్తే కుట్రదారుల ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయి..ఖీ అని పవన్ కళ్యాణ్ తెలియజేశారు. ఇటీవల మచిలీపట్నంలో చోటు చేసుకున్న ఘటనలు ఇందుకు ఉదాహరణ. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో ఒక వ్యక్తి అభ్యంతరకర భాష ఉపయోగించి మాట్లాడాడు. అతను ఆ విధంగా మాట్లాడేలా సిద్ధం చేసి, ప్రచారం చేయడం వెనక ఉన్న కుత్సిత ఆలోచనను పసిగట్టాలి. చట్ట ప్రకారం కేసులుపెట్టి దానిపై ముందుకు వెళ్ళాలి. తొందరపడి మరో మార్గంలో ఘర్షణ పడటం వల్ల సమస్య జటిలం అవుతుంది. ప్రజల మధ్య సామరస్య వాతావరణం చెడగొట్టి రెచ్చగొట్టే నాయకులు బయటకు వస్తారు. ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాలి కులాలు, మతాల మధ్య విభేదాలు తీసుకొచ్చే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదు >>2

# శాంతిభద్రతలే ప్రభుత్వ లక్ష్యం

### పెట్టుబడులకు అదే కీలకం
### వివేకా హత్య, సింగయ్య మృతిని కేస్ స్టడీలుగా చూడండి
### రియాక్ట్, రీచ్, రెస్పాండ్, రిజల్ట్ విధానం పాటించండి
### బదలీ అయిన ఎస్పీలతో విసిలో మాట్లాడిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ తనకు అత్యంత ప్రాధాన్యమైన అంశమని..ఈ విషయంలో రాజీ అనేది లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.లా అండ్ ఆర్డర్ బాగుంటేనే పెట్టుబడులు వస్తాయి. ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయి. రాష్ట్ర గ్రోత్ రేట్ పెరుగుతుంది. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇదే నా విధానం అని సీఎం అన్నారు. జిల్లాల ఎస్పీల బదిలీ నేపథ్యంలో వారితో సీఎం సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలు సహా పలు అంశాలపై ఎస్పీలకు దిశా నిర్ధేశం చేశారు. కొందరు ఎస్పీలు నేరుగా సమావేశానికి హాజరు కాగా మరికొన్ని జిల్లాల ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 'రాజకీయ ముసుగులో నేరాలను ఉపేక్షించకండి. నేరాల తీరు మారింది. కొత్త తరహా నేరాలు, నేరస్తులు వచ్చారు. ఈ విషయంలో పోలీసులు కూడా అప్ డేట్ కావాలి. అప్పుడే శాంతి భద్రతలను పటిష్టంగా కొనసాగించగలం' అని సీఎం అన్నారు.

**ఫ్యాక్షన్‌ను అంతం చేశాం... రౌడీయిజాన్ని రూపుమాపాం:** అన్ని కోణాల్లో ఆలోచించి మీకు ఎస్పీలుగా అవకాశం ఇచ్చాను. బెస్ట్ ఫెర్మామెన్స్‌తో ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి. తొలిసారి సీఎం అయినప్పటి నుంచి నా ఫోకస్ లా అండ్ ఆర్డర్ మీదే ఉండేది. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజం, మత ఘర్షణలు వంటి వాటి విషయంలో చాలా కఠినంగా ఉండేవాడిని. ఫ్యాక్షన్ అణిచివేత కోసం మా పార్టీ ప్రజా ప్రతినిధులను కూడా అరెస్టు చేసిన సందర్భాలు రాయలసీమలో ఉన్నాయి. అంత కఠినంగా ఉండడం వల్లనే నాడు ఫ్యాక్షన్‌ను దూరం చేయగలిగాం. ఫ్యాక్షన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారి పిల్లలను ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్‌లో చదివించాను. వారు మళ్లీ ఫ్యాక్షన్ వైపు వెళ్లకుండా చర్యలు తీసుకున్నాను. నాడు తెలంగాణలో నక్సల్ విషయంలో చాలా భయంకరమైన పరిస్థితులు ఉండేవి. తెలంగాణ పల్లెల నుంచి హైదరాబాద్ సరిహద్దు జిల్లాల వరకు నక్సలైట్లు ఉండేవాళ్లు. దీంతో చాలా మంది తెలంగాణ నేతలు ఎన్నికల సమయంలో తప్ప గ్రామాలకు వెళ్లే వాళ్లు కాదు. ఒకసారి పోలీస్ స్టేషన్ పేల్చివేస్తే పోలీసులు వెళ్లడానికి భయపడ్డారు. నేను స్వయంగా వెళ్లి పోలీసుల్లో స్థైర్యం నింపాను. తరువాత గ్రేహౌండ్స్ వంటి విభాగాలను తెచ్చాం. దీంతో నక్సలిజాన్ని అణిచి వేశాం. నాడు ఉప ప్రధానిగా ఉన్న అద్వానీని ఆహ్వానించి ఈ కార్యక్రమాలు వివరించాను. అని సీఎం చంద్రబాబు అన్నారు.

నాడు చాలా కఠినంగా ఉన్నాను కాబట్టే అలిపిరిలో నాపై దాడి చేశారు. నాపై దాడి సమయంలో ముందు అది ప్రమాదం అనుకున్నాను. కానీ బాంబు దాడి అని అక్కడకు వచ్చిన ఎస్పీ చెప్పారు. నాతో ఆసుపత్రికి ఎందుకు వచ్చారు? వెంటనే ఆ ఏరియాను బ్లాక్ చేసి సెర్చ్ ఆపరేషన్ చేయండని ఆదేశించాను. ఇంకా ఏమైనా క్లైమోర్ మైన్లు ఉంటే తొలగించాలని వేరే వాళ్లకు వాటితో ప్రమాదం వాటిల్లకుండా చూడాలని పోలీసులకు చెప్పాను. దొరికిపోతాం అనే భయం ఉంటే నేరాలు తగ్గించవచ్చు. బెజవాడలో రౌడీ వ్యవహారాలు ఎక్కువగా ఉండేవి. సమర్థులైన అధికారులతో ఇక్కడ రౌడీయిజం లేకుండా చేశాం. నాడు కఠినంగా >>2



శనివారం జిల్లా ఎస్పీలతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత, సిఎస్ విజయానంద్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తదితర అధికారులు

# ఆరిన సెగల నుంచి శాంతికపోతాలు..



### మణిపూర్ వాసులకు అండగా ఉంటా
### ఘర్షణల అనంతరం తొలిసారి రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోడీ

**ఇంపాల్, సెప్టెంబరు 13:** ఈశాన్యరాష్ట్రంలో ప్రత్యేకించి మణిపూర్ ధైర్యవంతులు, సాహసవంతుల భూమి అని రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధిపథంలోకి తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. పేరులో ఉన్న మణికి ఈశాన్యరత్నం అని అర్థమని ఇలాంటి అందమైన ప్రాంతంలో హింస చెలరేగిందని ఆందోళన వ్యక్తంచేసిన ప్రధాని ఇపుడు మళ్లీ ఉషస్సు ప్రారంభం అవుతున్నదని, ప్రజలు శాంతిమార్గం ఎంచుకున్నారని, శాంతిచర్చలు షురూ అయ్యాయని నేను ఎప్పటికీ మీతోనే ఉంటానని, కేంద్రం మీ వెంటనే ఉంటుందని తాను హామీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ రాష్ట్రం శాంతికి చిహ్నంగా మారాలని తాను అభిలషిస్తున్నట్లు మోడీ చెప్పారు. వర్షంసైతం లెక్కచేయకుండాసభకు వచ్చిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మణిపూర్‌లో చెలరేగిన హింసవల్ల శరణార్థులుగా మారిన వారిని శిబిరాల్లో మోడీ పరామర్శించారు. 2023లో ప్రారంభంఅయిన ఈఘర్షణలు రెండేళ్ల తర్వాత ప్రధాని తొలిసారి రాష్ట్రంలో పర్యటించారు. ఈసందర్భంగా 9వేల కోట్ల విలువైనప్రాజెక్టులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేసారు. ఈసభలో మోడీ మాట్లాడుతూ ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనే భారత ఆర్థిక వ్యవస్థ 7.8శాతం వృద్ధిని నమోదుచేసిందన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధిచెందుతున్న ఆర్థికవ్యవస్థగా భారత్ఇపుడు ప్రపంచాన్ని ఆకర్షిస్తోందన్నారు. మేకిన్ ఇండియాతో ఎగుమతుల్లో వృద్ధిని నమోదు చేసామని,కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపైనా అధికపన్నులు వేసారన్నారు.

# అమరావతి అభివృద్ధిని అడ్డుకోలేరు..

### విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం
### పోలవరం -బనకచర్ల లింక్ నిర్మిస్తాం: సిఎం చంద్రబాబు

**విజయవాడ సెప్టెంబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి అభివృద్ధిని ఎవ్వరు ఆపలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.సముద్రంలో కలిసి పోయే మిగుల జలాలను వృధాగా సముద్రంలోకి పోకుండా ఒడిసి పట్టి రాయలసీమకు నీరందించాలన్నదే పోలవరం -బనచర్ల లింక్ ప్రాజెక్టు అన్నారు.నిర్దిష్ట లక్ష్యం రూపొందించుకుని,అన్ని అనుమతులతో ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ కల్పన చేయటంతో పాటు దాన్ని సుసాధ్యం చేసే దిశగా పనిచేయాల్సి ఉందని . భవిష్యత్ తరాల కోసమే విజన్‌ను రూపొందించి అమలు చేస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇది తన బాధ్యత అని స్పష్టం చేశారు.రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ కల్పన చేయటంతో పాటు దాన్ని సుసాధ్యం చేసే దిశగా పనిచేయాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ తరాల కోసమే విజన్‌ను రూపొందించి అమలు చేస్తున్నామని.. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్2047 అమలు చేస్తుంటే రాష్ట్రంలో స్వర్ణాంధ్ర2047 విజన్ సిద్ధం చేసి అమలు చేస్తున్నామని వెల్లడించారు. శరీరానికి పోషకాలు ఎంత అవసరమో సమాజానికి మంచి పాలసీల అవసరం అంతే ఉందని సీఎం అన్నారు. వచ్చే 22 ఏళ్లలో మన రాష్ట్రం ఎక్కడ ఉండాలన్న అంశాన్ని నిర్దేశించేందుకే విజన్ రూపొందించి అమలు చేస్తున్నట్టు వివరించారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వ విధానాలపై సమగ్రమైన సమాచార పత్రాన్ని రూపొందించారు.సీఎంవో కార్యాలయం ఈ పత్రాన్ని నేడు సమాచార శాఖ ద్వారా విడుదల చేసింది.వచ్చే దశాబ్ద కాలంలో ఏపీ ఎలా ఉండబోతోందన్న అంశాన్ని వెల్లడించారు.రాష్ట్రంలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం. 25 ఏళ్ల క్రితం భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా మారింది. 2038 నాటికి భారత దేశం నెంబర్1 అవుతుంది. ఇందులో తెలుగు వారి పాత్ర ప్రధానంగా ఉండాలని భావిస్తున్నాను. ఈ ఏడాది గతేడాది డబుల్ డిజిట్ గ్రోత్ సాధించగలిగాం. 2028-29 నాటికి రూ. 29,29,402 కోట్ల మేర జీఎస్డీపీ సాధించగలమని సీఎం పునరుద్ఘాటించారు.. 2029-2034 నాటికి రూ. 57,21,610 కోట్ల జీఎస్డీపీ సాధించేలా ప్రణాళికలు రూపొందించాం. దీన్ని సాధించే బాధ్యత ఎన్డీఏ కూటమి తీసుకుంటుంది. 2028-29 నాటికి తలసరి ఆదాయాన్ని రూ. 5,42,985 సాధిస్తాం. 2029- 2034 నాటికి తలసరి ఆదాయం రూ.10.55 లక్షల కోట్లు సాధించగలం. ఇదేమీ అసాధ్యం కాదు. నిర్దిష్టమైన ఆలోచనతోనే ప్రణాళికలు వేశాం. దీనికి సంకల్పంతో పాటు మెగా డ్రీమ్స్ ఉండాలి. విజన్ 2020 సాకారం అయ్యాక కూడా విజన్ డాక్యుమెంట్లపై ఇంకా అనుమానాలు సరికాదు. భారత్ లాంటి దేశాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాతరంగా అమలు చేయాలి.సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం చేస్తున్నామని తెలిపారు.అభివృద్ధికి అదే తరహాలో నిధులిస్తున్నాం. రాజకీయాలు అవసరమే కానీ...సమాజం గురించే ఆలోచించాలి. రాజకీయాలే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి జరిగేది కాదు.. విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావు. సీఎంగా భావితరాల కోసం ఆలోచన చేయాలి. 1994లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నాను. ఇప్పుడు సంపద సృష్టిస్తున్నాం..పేదలకు అందిస్తున్నాం. ప్రజలందరికీ ప్రయోజనం కలిగేలా మంచి పబ్లిక్ పాలసీలు తీసుకువచ్చాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

విశాఖ, అమరావతి, విజయవాడ, తిరుపతి వంటి నగరాల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం. అమరావతిలో ప్రారంభించిన ప్రతి పని రాబోయే మూడేళ్లల్లో పూర్తి అవుతుంది. రూ.50 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు పూర్తిఅవుతాయి. ప్రధాని చేతుల మీదుగా ఇవి ప్రారంభం అవుతాయి. 2019లో గెలిచి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి అయ్యేది. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల డయాఫ్రం వాల్ దెబ్బతింది. అధికారంలోకి వచ్చాక పోలవరంపై దృష్టి పెట్టాం. 2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేస్తాం. కియా ఫ్యాక్టరీ కోసం గొల్లపల్లి రిజర్వాయరును ఒక్క ఏడాదిలో పూర్తి చేసి నీరిచ్చాం. హంద్రీనీవా ప్రాజెక్టు కాల్వల విస్తరణ పనులు కేవలం 100రోజుల్లో పూర్తి చేసి నీరు ఇచ్చాం." అని సీఎం వివరించారు. అడవితల్లి బాటల్లో కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టిన మారుమూల గిరిజన ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేస్తున్నామని వెల్లడించారు. ఇమామ్‌లకు 10,000, మోజన్లకు 5,000 చొప్పున గౌరవవేతనం ఇస్తున్నామన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామని చెప్పారు. ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించటమే కూటమి ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

### సిబిఐ చార్జిషీటు ఇవ్వకుండా
# కోర్టుకు హాజరు కాలేం
### అయేషామీరా తల్లిదండ్రులు

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణాజిల్లా(ఇప్పటిఎన్టీఆర్) జిల్లా ఇబ్రహీంపట్నంలోని మహిళల వసతిగృహంలో జరిగిన బి.ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో మళ్ళీ సంచలనం సృష్టిస్తుంది. ఈ కేసును పునర్విచారించిన సీబీఐ సత్యంబాబుపై పెట్టిన ఐపీసీ 376, 302 సెక్షన్లపై ఈ నెల 19న విజయవాడలోని సీబీఐ న్యాయస్థానానికి హాజరై ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని ఆయేషామీరా తల్లిదండ్రులు షంషాద్‌బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషాలకు సనోటీసులు పంపింది. ఈ కేసులో సీబీఐ నివేదిక వివరాలు తమకు ఇవ్వలేదని, కోర్టు విచారణకు హాజరు కాలేమంటూ ఆయేషా తల్లిదండ్రులు సమాధానం ఇచ్చారు. 2007 డిసెంబరు 27న రాత్రి ఇబ్రహీంపట్నంలోని మహిళల వసతిగృహంలో విద్యార్థిని ఆయేషా మీరా హత్యకు గురయ్యారు.ఈ క్రమంలోనే నందిగామలో ఎస్సీ హస్టల్ వాచ్‌ఉమెన్ వరలక్ష్మి హత్యకు గురయ్యారు.అంతకు ముందు నంది గామలో ఓవిద్యార్థినీల వసతగృహంలోను,ఎస్సీ బాలిక సంక్షేమ పాఠశాలల్లో ఆ గంతకుడు ప్రవేశించిన ఆరోపణలు ఉన్నాయి. తరువాత కొద్దినెలలు ఇటువంటి ఘటనలు సద్దుమణిగినా, నంది గామ మహిళా పాలిటెక్నికల్ కళాశాలల్లో ఓ యువకుడుప్రవేశించిన ఘటన చోటు చేసుకుంది. ఆశోక్‌నగర్‌లో రమాదేవి అనే గృహిణిపై హత్యాయత్నం జరిగింది.ఈ కేసుల్లో నందిగామకు చెందిన పిడతల సత్యంబాబు అనే భవన నిర్మాణ కార్మికున్ని 2008 ఆగస్టులో అరెస్టు చేశారు. ఆ సంద˘ర్భంలో సత్యంబాబు తనకు తానుగా అయేషా మీరాను హత్య చేసినట్లు అంగీకరించాడని పోలీసులు వెల్లడించారు.దీనిని దళిత సంఘాలు వ్యతిరేకిస్తూ ఆందోళన చేసాయి.ఈ క్రమంలో విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు అతడికి జీవితఖైదు విధించింది.దీనిపై సత్యంబాబు తల్లి మరియమ్మ, ప్రజా సంఘాలు ఏపీ హైకోర్టును ఆశ్రయించాయి.2017మార్చి 31న ఉమ్మడి హైకోర్టు ఈ కేసును కొట్టివేసి సత్యంబాబుని నిర్దోషి అంటూ తీర్పు ఇచ్చింది.సత్యంబాబు నేరస్తుడని కేవలం డిఎన్ఏ పరీక్షలు ఆధారంగా నిర్ధారించలేమని, పోలీసు చార్జిషీటులో ఏ అంశాన్ని పోలీసు నిరూపించలేకపోయిందని హైకో ర్టు వ్యాఖ్యానించినట్లు సమాచారం.ఈ క్రమంలో ఆయేషా తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించగా కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించారు. 2018లో పునఃదర్యాప్తు బాధ్యతలు తీసుకున్న సీబీఐ 3 నెలల క్రితం నివేదికను హైకోర్టుకు అందజేసింది.అయితే ఆ నివేదికను తమకు ఇవ్వాలంటూ ఆయేషా మీరా తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు.ఈ విషయాన్ని దిగువ కోర్టులో తేల్చుకోవాలన్న హైకోర్టు సూ చన మేరకు విజయవాడలోని సీబీఐ న్యాయస్థానంలో పిటిషన్ వేసినా వారికి ఇంతవరకు నివేదిక ఇవ్వలేదు.

### కత్తితో పొడిచి
# ప్రియురాలి హత్య
### ప్రేమోన్మాది ఘాతుకం, నెల్లూరులో సంచలనం



సాహితి(ఫైల్)

**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** శనివారం తెల్లవారుజామున నగరంలోని పోస్టల్ కాలనీలో చోటు చేసుకున్న సంఘటన సం చలనంగా మారింది. పోలీసుల కథనం, సేకరించిన సమాచారం మేరకు బుచ్చిరెడ్డిపాలెం మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన గిరిబాబు, శ్రీలక్ష్మి దంపతులకు మైధిలి ప్రియ(23), సాహితిలు ఇద్దరు సంతానం. సాహితి గూడూరులోని విద్యాసంస్థలో ఇంజనీరింగ్ చదువుతూ స్థానిక పోస్టల్ కాలనీలో రూములో అద్దెకు ఉంటున్నారు. అదే గదికి ఎదురుగా అద్దెకు ఉంటున్న బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లు గ్రామానికి చెందిన నిఖిల్, మైథిలి ప్రియలు ఒకే కళాశాలలో చదువుతున్న సమయంలో ఒకరినొకరు ఇష్టపడి ప్రేమించుకున్నారు. ఈనెల ఆరో తేదీ మైథిలి పుట్టినరోజు కావడంతో నెల్లూరు లోని తన చెల్లెలి గదికి వచ్చారు. అక్కడే కుటుంబ సభ్యులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరు పుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీ చెల్లెలు సాహితితో కలిసి నిద్రపోయారు. మధ్య రాత్రి మెలకువ వచ్చిన చూడగా అక్క లేకపోవడంతో ఫోన్‌కు కాల్ చేసి ఎక్క దున్నావని అడిగారు. వేరే స్నేహితులతో మాట్లాడుతున్నాను వెంటనే వస్తానని ఆమె చెప్పడంతో సాహితి నిద్రపోయారు. తెల్లవారుజాము సమయంలో నిఖిల్ నుండి ఫోను రావడంతో సాహితిఫోను తీసి అడగగా మీ అక్క పడిపోయి ఉన్నారు, తీసుకెళ్లమని చెప్పి ఫోన్ కట్ చేశాడు. నిఖిల్ గది మెట్ల పైన చలనం లేకుండా రక్త గాయాలతో పడి ఉన్న మైథిలిని చూసి ఏమైందని నిఖిల్‌ను ప్రశ్నించారు. ఇద్దరి మధ్య కొన్ని విషయాలలో వాదోపవాదాలు రావడంతో తానే కోపంతో మైథిలిని కత్తితో పొడి చినట్లు తెలిపాడు. వెంటనే సాహితి తన తల్లిదండ్రులతో పాటు పోలీసులకు సమాచారం అందిం చారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

### 24న విజయవాడలో
# దళిత రణభేరి

**చిత్తూరుహెల్త్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** దళితులపై దాడులను అరికట్టాలని, సామాజికంగా, ఆర్థికంగా దళితులకు జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ ఈ నెల 24వ తేదీన విజయవాడలోని గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించతలపెట్టిన 'దళిత రణభేరి' కార్యక్రమంను విజయవంతం చేయాలని రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ కార్యదర్శి కె.ప్రభాకర్ పిలుపునిచ్చారు. చిత్తూరులో శనివారం రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ కార్యదర్శి కె.ప్రభాకర్ దళిత రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు అగ్రకులాలు దళితులకు వ్యతిరేకంగా అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. సంబం ధిత ఉన్మాదుల దాహానికి సామాన్యులైన బహు జన కులాలు ఆహుతి అవుతున్నాయని ఆరోపించారు. డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సైతం దళితులపై దాడులు ఆగడం లేదని ఆరోపించారు.

# మరో 2రోజులు భారీ వర్షాలు

### పశ్చిమమధ్య, వాయవ్యబంగాళాఖాతం, ఉత్తరాంధ్రతీరంలో అల్పపీడనం
### శ్రీకాకుళం, కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పలు జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి.అల్పపీడన ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నాయి.పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్రదక్షిణ ఒడిశా తీరాల్లో అల్పపీడనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది 48 గంటల్లో దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని వెల్లడించారు. దీనికి అనుబంధంగా ఛత్తీస్‌గఢ్, విదర్భ మీదుగా దక్షిణ మహారాష్ట్ర వరకు ద్రోణి కొనసాగుతోందన్నారు. వీటి ప్రభావంతో రాష్ట్రంలో ఆదివారం అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద నిలబడరాదని సూచించారు. ఆదివారం శ్రీకాకుళం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.పార్వతీపురం మన్యం జిల్లాలో ఏఎన్ఎం, ఆశ వర్కర్ తమ వృత్తి పట్ల నిబద్ధతను చాటుకున్నారు. సాలూరు మండలం తోనాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజన గ్రామాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అక్కడి పెద్ద ఏరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ఏరుకు అవతలి వైపు గ్రామాలకు వెళ్లడం కష్టంగా మారింది. ఆశా వర్కర్‌తో కలిసి ఏఎన్ఎం సావిత్రి వరద ఉధృతిని చూసి వెనకడుగు వేయకుండా గర్భిణీలకు టీకాలు వేసేందుకు ఏరు దాటి వెళ్లారు. మహిళలైనా భయపడకుండా సమయానికి వెళ్లి గర్భిణీలకు టీకాలు వేసినందుకు వారిని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అజయ్ అభినందించారు.అల్పపీడనం కారణంగా విజయవాడలో మోస్తరు వర్షం కురిసింది. దీంతో రాకపోకలు సాగించేందుకు పడుతున్న వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతపురం నగరంలో గంటపాటు మోస్తారు భారీ వర్షం కురిసింది. ప్రధాన కూడళ్లు సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ సమీపంలో నీరు పెద్ద ఎత్తున నిలిచి వాహన రాకపోగాలకు ఇబ్బంది ఎదుర్కొంది.గుంటూరు నగరంలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. బ్రాడిపేట, అరండల్ పేట, లక్ష్మీపురం ప్రాంతాల్లో రోడ్లపైకి వరద చేరింది. మూడు వంతెనలు, కంకరగుంట అండర్ పాస్ వద్ద వాన నీరునిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మహానందిలో భారీ వర్షం కురిసింది. నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న ఆలయ పరిసరాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ఆలయంలోని కోనేరులు పొంగిపొర్లాయి. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులు వర్షంలోనే కోనేట్లో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. సాధారణ భక్తులు ఇబ్బందులు పడ్డారు.



శనివారం తిరుపతికి విచ్చేసిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు స్వాగతం పలుకుతున్న బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి

## తిరుమలలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా

**తిరుమల,సెప్టెంబరు 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొనేందుకు శనివారం రాత్రి లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలో బిర్లాకు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, డిప్యూటీ ఇఒ భాస్కర్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. నేటి ఉదయం నైవేద్య విరామసమయంలో స్వామివారిని దర్శించుకుని తిరుపతికి వెళతారు.

## భారీగా ఐపిఎస్‌ల బదిలీలు

### 14 జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో భారీ స్థాయిలో ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి.రాష్ట్రంలో 14 జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమిస్తూ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. 7 జిల్లాలకు కొత్త అధికారులను నియమించగా మరో 7 జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి బదిలీ చేశారు. 12 జిల్లాల్లో ప్రస్తుతం ఉన్నవారినే ఎస్పీలుగా కొనసాగిస్తూ ఆదేశాల్లో పేర్కొన్నారు. పాలనపై పట్టు సాధించేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఇటీవలే పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేసింది.తాజాగా ఎస్పీల బదిలీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు పూర్తి చేశారు. 14 జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించారు. వీరిలో 7 జిల్లాలకు ఎస్పీలుగా కొత్త అధికారులకు అవకాశమిచ్చారు. మరో 7 జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి బదిలీ అయ్యారు. మిగిలిన 12 జిల్లాలకు ఇప్పుడు ఉన్నవారినే కొనసాగించాలని నిర్ణయించారు. ఎస్పీల బదిలీలను పరిశీలిస్తే బీఆర్ అంబేడ్కర్ కోనసీమకు రాహుల్ మీనా, బాపట్లకు ఉమామహేశ్వర్, నెల్లూరుకు అజితా వేజెండ్ల నియమితులయ్యారు. తిరుపతికి సుబ్బారాయుడు, అన్నమయ్య జిల్లాకు ధీరజ్ కునుగిలి, కడప జిల్లాకు నచికేత్, నంద్యాల్ జిల్లాకు సునీల్ షెరాన్ కొత్తగా నియమితులయ్యారు. వీరంతా కొత్తగా జిల్లాలకు ఎస్పీలుగా బాధ్యతలు చేపట్టనున్నారు.ఇప్పటికే ఎస్పీలుగా కొనసాగుతున్న వారిలో ఎఆర్ దామోదర్‌ను విజయనగరం జిల్లాకు, విద్యాసాగర్ నాయుడును కృష్ణాజిల్లాకు, వకుల్ జిందాల్ ను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. డి. కృష్ణారావును పల్నాడు జిల్లాకు, హర్షవర్ధన్ రాజును ప్రకాశం జిల్లాకు, తుషార్ దూడిని చిత్తూరు జిల్లాకు,సతీష్ కుమార్ ను శ్రీ సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం,విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, అనంతపురం, కర్నూలు జిల్లాల ఎస్పీలు యథాతథంగా కొనసాగనున్నారు.

## 15 యేళ్ల పెన్షన్ కమ్యుటేషన్ రికవరీ రూల్స్‌పై ఎపి ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగి పదవీ విరమణ చేసిన తర్వాత ఇచ్చే పెన్షన్ నుంచి కమ్యుటేషన్ భాగాన్ని తప్పనిసరిగా 15 ఏళ్ళలో రికవరీ చేయాలన్న నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన కేసులో సుప్రీం కోర్టు ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఏపీ హైకోర్టు ఈ ఏడాది ఏప్రిల్ 28న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బి.అప్పారావు అనే రిటైర్డ్ తహసీల్దార్ దాఖలు చేసిన ఎస్ఎల్‌పీపై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ జేకే మహేశ్వరి,జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.పెన్షన్ కమ్యుటేషన్ కింద తనకు చెల్లించిన రూ.7.55 లక్షల మొత్తాన్ని 8%వార్షిక వడ్డీ కింద రికవరీ చేస్తే 11 ఏళ్ళ 3 నెలల్లో మొత్తం తీరిపోయిందని వివరించారు. అయినప్పటికీ ఏపీ సివిల్ పెన్షన్స్(కమ్యుటేషన్ రూల్స్) 1944 లోని సెక్షన్ 18 కింద 15 ఏళ్ళ పాటు రికవరీ చేయాలన్న నిబంధన పేరుతో మరో 3 ఏళ్ళ 7 నెలల పాటు రికవరీ కొనసాగించడం వల్ల తనకు నష్టం జరిగిందని తెలిపారు. ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధం కాబట్టి దాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆయన పిటీషన్ దాఖలు చేయడంతో ఏపీ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలో కోర్టు ఈ సెక్షన్ లోని అంశాలను పరిశీలిస్తుంది.

## చర్లపల్లి నుంచి అనకాపల్లికి ఎనిమిది ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, సెప్టెంబరు13, ప్రభాతవార్త:** పండుగ సీజన్ దృష్టిలో పెట్టుకొని సౌత్ సెంట్రల్ రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని చర్లపల్లి నుంచి అనకాపల్లి వరకు ఎనిమిది ప్రత్యేక సర్వీసులను నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. సెప్టెంబరు 13 నుంచి అక్టోబరు 5వరకు ప్రతి శని, ఆదివారాల్లో రాకపోకలు సాగించనున్నాయి. చర్లపల్లి -అనకాపల్లి రైలు (07035), అనకాపల్లి నుంచి చర్లపల్లికి (07036) తిరుగు ప్రయాణ రైళ్లు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.ఈ రైళ్లు ఇరువైపుల జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం.నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి స్టేషన్లలో ఆగుతాయి. అలాగే వీటిలో ఫస్ట్ ఏసి, సెకండ్ ఏసి, థర్డ్ ఏసితో పాటు స్లీపర్, జనరల్,సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని వివరించింది.

## దసరా నేపథ్యంలో కాచిగూడ నుంచి రైళ్లు

**హైదరాబాద్, సెప్టెంబరు13, ప్రభాతవార్త:** దసరా పండుగ నేపథ్యంలో కుటుంబంతో కలిసి సొంతూర్లకు వెళ్తుండడంతో ప్రయాణీకులు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ఈ నెల 20 నుంచి అక్టోబరు 5వరకు నడపనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే మధురై ఎక్స్‌ప్రెస్ రైలు ఉందని, మరిన్ని సర్వీసులు అందుబాటులో ఉంటాయని వివరించారు. కాచిగూడ నుంచి రైళ్లు ఆయా జిల్లాలు, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు,ఆంధ్రప్రదేశ్‌కు అనేక రైళ్లను నడుపుతున్నారు.వీటికి అదనంగా దసరా, దీపావళి, ఛత్ పండుగల కోసం మరిన్ని రైళ్లను ప్రత్యేకంగా ప్రకటించారు. ప్రయాణీకుల డిమాండ్‌కు అనుగుణంగా రానున్న రోజుల్లో మరిన్ని రైళ్లను నడపనున్నట్లు అధికారులు చెబుతున్నారు.పాత వాటికి అదనం కాచిగూడ నుంచి బికనేర్ (07053), కాచిగూడ నుంచి మురుదేశ్వర్ (07191), కాచిగూడ నుంచి నాగర్‌సోల్ (07055) ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 20 ప్రారంభమవుతాయని వెల్లడించారు.ప్రతి శనివారం కాచిగూడ నుంచి మధురై ఎక్స్‌ప్రెస్ రైలును నడుపుతున్నారు. అది ఈరోడ్, సేలం(తమిళనాడు) మీదుగా వెళుతుంది. పండుగకు ప్రకటించిన కాచిగూడ నుంచి మధురై (07191/07192) ఈనెల 20 నుంచి నవంబరు 26 వరకు అరుణాచలం మీదుగా సేవలు అందిస్తోంది.గోమతినగర్ నుంచి మహబూబ్‌నగర్ (05314/05313)కు ప్రత్యేక రైళ్లను ఈ నెల 28 నుంచి నవంబర్ 3 రాకపోకలు సాగించనున్నాయి. రోజువారీ రైళ్లు 100 కు పైగా నడపనున్నట్లు తెలిపారు.నిత్యం ప్రయాణికులు 47వేల మంది ఉంటారని అంచనా వేస్తున్నారు. పండుగ కోసం ప్రత్యేకంగా 4 రైళ్లు ఉన్నాయని రైల్వేశాఖ పేర్కొంది.

## తిరుచ్చినుంచే టివికెఅధినేత విజయ్ జైత్రయాత్ర!

**తిరుచ్చి, సెప్టెంబరు 13:** తమిళనాడు రాజకీయాల్లో నటుడు టివికె అధినేత విజయ్ తనదైన శైలిలో రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని, ఆయన స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' టీవీకే పార్టీ తొలి ప్రచార యాత్రను నేడు ప్రారంభించారు. ఈ యాత్ర కోసం ద్రవిడ రాజకీయాల్లో చారిత్రక ప్రాధాన్యమున్న తిరుచ్చి నగరాన్ని వేదికగా ఎంచుకోవడం ఇప్పుడు సర్వత్ర ఆసక్తి రేపుతోంది. తిరుచ్చి నుంచి ప్రత్యేక ప్రచార వాహనంలో బయలుదేరిన విజయ్ అరియలూరులో జరగనున్న భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ పర్యటన కోసం అత్యాధునిక కెమెరాలు, లౌడ్ స్పీకర్లతో పాటు ఎవరూ బస్సుపైకి ఎక్కకుండా ఇనుప రెయిలింగ్‌లతో కూడిన ప్రత్యేక వాహనాన్ని సిద్ధం చేశారు. 'మీ విజయ్, నేను విఫలం కాను', 'తమిళనాడు, విజయ్ వారసత్వం తిరిగొస్తుంది' వంటి నినాదాలతో కూడిన పార్టీ ప్రచార లోగోను కూడా ఆవిష్కరించారు. విజయ్ యాత్రకు పోలీసులు 25 కఠిన నిబంధనలతో కూడిన షరతులతో పోలీసులు అనుమతులు మంజూరు చేశారు. రోడ్‌షోలు, సన్మానాలు, భారీ వాహన కాన్వాయ్‌లపై ఆంక్షలు విధించారు. విజయ్ ప్రచార బస్సును కేవలం ఐదు వాహనాలు మాత్రమే అనుసరించాలని, పార్టీ కార్యకర్తలు ఉదయం 11:25 గంటల కల్లా అరియలూరు పాత బస్టాండ్ వద్దకు చేరుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రత కోసం పార్టీయే బారికేడ్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే యాత్రను నిలిపివేసే అధికారం తమకు ఉంటుందని పోలీసులు హెచ్చరించారు. ద్రవిడ రాజకీయాల్లో కీలక నిర్ణయాలకు తిరుచ్చి చారిత్రకంగా ఓ వేదికగా నిలిచింది. గతంలో ఏఐఏడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) తన చారిత్రాత్మక మధ్యాహ్న భోజన పథకాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. అంతేకాకుండా, తిరుచ్చిని తమిళనాడుకు రెండో రాజధానిగా ప్రకటించారు. అలాగే, డీఎంకే వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురై కూడా తన పార్టీ ఎన్నికల్లో పోటీ చేయాలా, వద్దా అనే కీలక నిర్ణయాన్ని తిరుచ్చిలోనే తీసుకున్నారు.

# శాంతిభద్రతలే ప్రభుత్వ లక్ష్యం

>> వ్యవహరించడం వల్లనే హైదరాబాద్‌కు పెట్టుబడులు వచ్చాయి. నేడు బ్రాండ్ అయ్యింది. మనం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో అనేక మార్పులకు కారణం అవుతాయి." అని చంద్రబాబు అన్నారు.

ఒకప్పుడు రాజకీయ నాయకులు అవసరానికి రౌడీలను, క్రిమినల్స్‌ను వాడుకునే వాళ్లు. అయితే నేడు రాజకీయాల ముసుగులో నేరాలు చేస్తున్నారు. పాలిటిక్స్‌ను క్రిమినలైజ్ చేశారు. వివేకా హత్య విషయంలో ఏం జరిగిందో ప్రతి పోలీసు అధికారి స్టడీ చేయాలి. ఒక దారుణ హత్యను గుండెపోటు అన్నారు. తరువాత హత్య అన్నారు. తరువాత నాపై నెట్టారు.సీబీఐ కావాలి అన్నారు...తర్వాత వద్దు అన్నారు... ఇలా ఒక్కటి కాదు దేశంలో మరే కేసులోనూ ఇన్ని మలుపులు ఉండవు. పోలీసు అధికారులకు ఇదొక పెద్ద కేస్ స్టడీ. ఇదొక్కటే కాదు మొన్న మన ప్రభుత్వంలో సింగయ్య మృతి ఉదంతాన్ని గమనించే ఉంటారు. వాళ్ల కారు కింద పడి వాళ్ల కార్యకర్త చనిపోతే కూడా పట్టించుకోలేదు. దాన్ని దాచి పెట్టారు. రెండు రోజుల తరువాత వీడియో బయటపడకపోతే ఘటన ఎలా జరిగిందో కూడా తెలిసేదికాదు. ఈ విషయంలో పోలీసు అధికారులు తప్పుడు ప్రచారాన్ని నమ్మారు. చివరికి విషయం బయట పడ్డాక కార్యకర్తపై కారు ఎక్కించిన పార్టీ నేతలే బాధిత కుటుంబంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడించారు. అంబులెన్స్‌లో ఏదో జరిగిందని చెప్పే ప్రయత్నం చేశారు. అంటే వాళ్ల క్రిమినల్ పాలిటిక్స్ ఎలా ఉంటాయో మీరు అర్థం చేసుకోవాలి. అలాంటి వాళ్లు ఉన్న రోజుల్లో మనం ప్రభుత్వాలు నడుపుతున్నా మనేదిమీరంతా గుర్తుంచుకోవాలి." అని ముఖ్యమంత్రి వివరించారు.

నేడు నేరాల తీరు మారింది. అంటే మీ దర్యాప్తు తీరు కూడా మారాలి. టెక్నాలజీని 100 శాతం ఉపయోగించుకోండి. ఇన్వెస్టిగేషన్‌లో టెక్నాలజీతో బెస్ట్ రిజల్ట్ ఇస్తుంది. సీసీ టీవీలు లేకపోతే పాస్టర్ ప్రవీణ్ మృతిని ప్రభుత్వానికి చుట్టేవాళ్లు. ప్రవీణ్ మృతి విషయంలో వాస్తవాలను టెక్నాలజీతో స్పష్టంగా చెప్పగలిగాం. సోషల్ మీడియా ఫేక్ ప్రచారాలు, సైబర్ క్రైం, క్రిమినల్ పాలిటిక్స్ బిగ్ ఛాలెంజ్‌గా మారాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలి క్రిమినల్స్ కు భయం ఉండాలి. తప్పు చేస్తే దొరుకుతాం అనే ఆలోచన వస్తే నేరాలు తగ్గుతాయి. ప్రజా ప్రతినిధులతో సామరస్యంగా, సమన్వయంతో పని చేయండి. తప్పు చేస్తే మాత్రం ఏ పార్టీ వాళ్లను అయినా శిక్షించండి. ఈ విషయంలో రాజీలేదు. మా ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పేదానిలో మంచి ఉంటే పాటించండి. తప్పు ఉంటే చేయమని చెప్పను. మా పార్టీ వాళ్లు చెప్పరు. ఇది కూటమి విధానం." అని సీఎం అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది రియాక్ట్ రీచ్, రెస్పాండ్, రిజల్ట్ అనే విధానంలో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "ఏదైనా తీవ్రమైన ఘటన జరిగిన వెంటనే కిందిస్థాయి సిబ్బందిపై వదిలేయకుండా వెంటనే రియాక్ట్ అవ్వండి. అవసరమైన మేరకు క్రైమ్ స్పాట్‌కు రీచ్ అయ్యి సాక్ష్యాధారాల సేకరణ, దర్యాప్తులో అవసరమైన చర్యలు చేపట్టండి. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా లేక సమాచార లోపంతో జరిగే ప్రచారంపై వెంటనే రెస్పాండ్ అవ్వండి. ముఖ్యంగా ఫేక్ ప్రచారాలని తేలితే కఠిన చర్యలకు వెనుకాడకండి ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే ఈ సమయంలో రాజకీయ ముసుగులో కొందరు అలజడులు చేయాలని చూస్తున్నారు. ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదు. ప్రతిపక్షాలు పర్యటనలు చేసుకోవచ్చు... కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. నేను వాటికి వ్యతిరేకం కాదు. అయితే చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తామంటే అంగీకరించేది లేదు. ఈ విషయంలో జిల్లా అధికారులు కూడా స్పష్టంగా ఉండాలి. నేడు దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2029లో ఎన్డీఏ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. మోదీ 4వ సారి ప్రధాని అవుతారు. 2047 నాటికి దేశం ప్రపంచంలో నెంబర్ 1 అవుతుంది అనడంలో సందేహం లేదు. అయితే ఈ సమయంలో వచ్చే ప్రతి అవకాశాన్ని మనం అందిపుచ్చుకోవాలి అనేదే నా తపన, ఆలోచన. దీనికి అవసరమైన సహకారం అధికార యంత్రాంగం అందించాలి. రాష్ట్రం బాగుంటే మనం అంతా బాగుంటాం. ఈ క్రమంలో అత్యంత ముఖ్యమైనది లా అండ్ ఆర్డర్. అందుకే సుదీర్ఘ కసరత్తు తరువాత అన్ని అంశాలు చూసి మీకు అవకాశం ఇచ్చాను. ప్రూవ్ చేసుకోండి. బెస్ట్ ఫెర్ఫామెన్స్ చూపించండి. ఆల్ ది బెస్ట్. అని సీఎం చంద్రబాబు అన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత,.సీఎస్ కె.విజయానంద్,డీజీపీ హరీస్‌కుమార్ గుప్తా తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## వచ్చే యేడాది జూన్‌కు భోగాపురం విమానాశ్రయం పూర్తి

### డిసెంబర్‌లో వేలిడేషన్ ఫ్లైట్

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శనివారం భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయనగరం, సెప్టెంబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** భోగాపురంలో నిర్మాణ దశలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయ పనులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం పరిశీలించారు. భోగాపురం చేరుకున్న రామ్మోహన్ నాయుడుకు జి.ఎం.ఆర్ అధికారులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న నిర్మాణ పనుల వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా విమానాశ్రయం అంతా కలియతిరిగి పనులన్నీ సక్రమంగా సాగుతున్నాయి అన్న సంతృప్తిని రామ్మోహన్ నాయుడు వ్యక్తపరిచారు. అనంతరం నిర్మాణం దశను పూర్తి చేసుకున్న రన్ వేను సైతం పరిశీలించారు. ముందుగా నిర్ణయించుకున్న డి.పి.ఆర్ మేరకు నిర్మాణాలు సక్రమంగా జరుగుతున్నాయని, దేశంలోనే మిన్నగా భోగాపురం ఎయిర్ పోర్ట్ నిలుస్తుందన్న ఆశాభావాన్ని రామ్మోహన్ నాయుడు వ్యక్తం చేశారు. తర్వాత విమానాశ్రయ నిర్మాణ పనులు చేపడుతున్న జీఎంఆర్ అధికారులతో సమీక్ష సమావేశంలో రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పనులు ఎక్కడ వరకు జరుగుతున్నాయి. ఏ దశలో ఉన్నాయన్న విషయాలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు జీఎంఆర్ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా తనకున్న సందేహాలను సైతం సమీక్షలో చెప్పి వాటి నుంచి వివరణ తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు జూన్ 2026 నాటికల్లా విమానాశ్రయ నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమవుతామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గడిచిన 14 నెలలుగా నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఇప్పటికే ఏడుసార్లు ప్రత్యేకంగా ఈ విమానాశ్రయ నిర్మాణ పనులపై క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మెన్ కర్రోతు బంగారురాజు, ఆర్డీవో డి.కీర్తి, డీఎస్పీ శ్రీనివాసరావు, జీఎంఆర్ సీఈవో కన్వర్ బీర్ సింగ్ కలరా, సిడిఓ కోటేశ్వరరావు, ప్రాజెక్ట్ హెడ్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## రష్యాపై నాటోదేశాలు కూడా ఆంక్షలు విధిస్తేనే ముందుకు

### నాటో దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ లేఖలు

**వాషింగ్టన్,సెప్టెంబరు 13:** రష్యాపై కఠినమైన ఆంక్షలు విధించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు నాటో మిత్రదేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి కొన్ని షరతులను అంగీకరించాల్సి ఉంటుందని ట్రంప్ అల్టిమేటమ్ ఇచ్చారు.

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయడంతో పాటు, నాటో దేశాలు కూడా సొంతంగా ఆంక్షలు అమలు చేస్తేనే తాను ముందుకు వెళతానని తేల్చిచెప్పారు. అంతటితో ఆగకుండా నాటో దేశాలన్నింటికీ ట్రంప్ ఒక లేఖ రాశారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా, చైనాలకు వ్యతిరేకంగా ఉమ్మడి చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లేఖ వివరాలను తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్ చేశారు. "రష్యాపై కఠిన ఆంక్షలు విధించడానికి నేను సిద్ధం. కానీ నాటో దేశాలన్నీ కూడా అదే పని చేయాలి. మాస్కో నుంచి చమురు కొనడం పూర్తిగా ఆపేయాలి. మీరు సిద్ధమని చెబితే చాలు, నేను రంగంలోకి దిగుతానని ట్రంప్ తన లేఖలో పేర్కొన్నారు. కొన్ని నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని ఆయన "దిగ్భ్రాంతికరం" అని అభివర్ణించారు.

ఈ చర్య మాస్కోపై బేరసారాల శక్తిని తీవ్రంగా బలహీనపరుస్తుందని ఆయన విమర్శించారు. ఇదే సమయంలో చైనాను లక్ష్యంగా చేసుకుని మరో సంచలన ప్రతిపాదన చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగిసే వరకు నాటో దేశాలన్నీ కలిసి చైనాపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలని సూచించారు.

ఇలా చేయడం ద్వారా రష్యాపై చైనాకున్న బలమైన పట్టును విచ్ఛిన్నం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బైడెన్ పరిపాలనపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఇది ట్రంప్ యుద్ధం కాదు. అప్పుడు నేను అధ్యక్షుడిగా ఉంటే ఇది మొదలయ్యేదే కాదని ఇది బైడెన్, జెలెన్‌స్కీల యుద్ధం. నేను కేవలం దీన్ని ఆపడానికి, వేలాది మంది రష్యన్, ఉక్రెనియన్ల ప్రాణాలను కాపాడటా నికి మాత్రమే ఉన్నానని ఆయన స్పష్టంచేసారు. తాను ప్రతిపాదించిన చర్యలు తీసుకుంటే యుద్ధం త్వరగా ముగుస్తుందని, లేదంటే తన సమయాన్ని, అమెరికా సమయాన్ని, శక్తిని, డబ్బును వృథా చేయవద్దని ట్రంప్ పేర్కొన్నారు.

### మరో 114 రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు

## మొత్తం అంచనా విలువ రూ.2 లక్షలకోట్లు

### హైదరాబాద్‌లో రాఫెల్ జెట్‌ల ఎం88 ఇంజన్లు, ఓవర్‌హాలింగ్ ఏర్పాటుకు యోచన



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** భారత వైమానిక దళం (ఐఎఎఫ్) మరో 114 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలుకోసం రక్షణశాఖకు ప్రతిపాదనలు అందించింది. ఈ జెట్‌లను ఫ్రాన్స్‌కు చెందిన డసాల్ట్ ఏవియేషన్, టాటా వంటి భారతీయ అంతరిక్ష సంస్థలు తయారు చేస్తాయి.ఈ ప్రతిపాదన అంచనాలు రూ. 2లక్షల కోట్ల వరకు ఉంటుంది. రాబోయే రోజుల్లో రక్షణ కార్యదర్శి నేతృత్వంలోని డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ బోర్డు ఈ విషయంపై చర్చించనున్నది. విమానాల భాగాల్లో 60 శాతం భారతదేశంలోనే తయారు చేయనున్నట్లు పేర్కొంది. తెలంగాణలోని హైదరాబాద్‌లో రాఫెల్ జెట్‌ల ఎం88 ఇంజిన్‌ల నిర్వహణ, మరమ్మతుల ఓవర్‌హాల్ ఫెసిలిటీని సైతం ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు వార్తాసంస్థ కథనం ప్రచురించింది.తెలిపింది. భారత వైమానిక దళం తయారుచేసిన 114 రాఫెల్ జెట్‌ల ప్రతిపాదన, స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ కొద్దిరోజుల క్రితం రక్షణ మంత్రిత్వ శాఖకు అందింది. ఈ ప్రతిపాదన డిఫెన్స్ ఫైనాన్స్ సహా దాని కింద ఉన్న వివిధ విభాగాల పరిశీలనలో ఉంది. చర్చల తర్వాత ఈ ప్రతిపాదనను డీపీబీకి ఆ తర్వాత డిఫెన్స్ ఆక్విజిషన్ కౌన్సిల్‌కు పంపుతారని రక్షణశాఖ అధికారులను ఉటంకిస్తూ వార్తాసంస్థ నివేదిక తెలిపింది. ఆపరేషన్ సింధూర్‌లో రఫేల్ యుద్ధ విమానాలను వినియోగించిన విషయం విధితమే. ఈ క్రమంలో తాజాగా వాయుసేన ఈ ప్రతిపాదనను తీసుకువచ్చింది. రఫేల్ యుద్ధ విమానాలు స్పెక్ట్రా ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్‌ను ఉపయోగించి.. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ ఉపయోగించిన చైనీస్ పీఎల్15 ఎయిర్‌టుఎయిర్ మిస్సైల్స్‌ను విజయవంతంగా ఓడించాయని రక్షణ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఎయిర్‌ఫోర్స్ వద్ద 36 రఫేల్ జెట్స్ ఉన్నాయి. మరోవైపు, ఇండియన్ నేవి 26 రాఫెల్‌లను కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చింది. అయితే, కొత్త ఆర్డర్ నేపథ్యంలో భారత డిఫెన్స్‌లోకి రఫేల్ జెట్ల సంఖ్య 176కి పెరగనున్నది. ప్రస్తుతం ఐఏఎఫ్ 4.5 జెనరేషన్ విమానాలు అయిన రాఫెల్స్, సుఖోయ్ , హెచ్‌ఏఎల్ తేజస్‌లను ఉపయోగిస్తోంది. నాల్గవ తరం యుద్ధ విమానాలు అయిన డస్సాల్ట్ మిరాజ్ 2000, మిగ్29లను కూడా వాడుతోంది.

## 23న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2లో బలమైన వాదనలు వినిపిస్తాం

### తెలంగాణనీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి జలసౌధలో సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** కృష్ణా జలాల వివాద-2 విచారణలో తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందాల్సిన నీటివాటలో చుక్క నీరు కుడా వదులుకునే ప్రసక్తేలేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ నెల 23 నుండి 25 వరకు దేశరాజధాని ఢిల్లీలో జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తాను స్వయంగా పాల్గొన బోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో 23 నుండి 25 వరకు జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2 విచారణలో తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన అంశంపై శనివారం రోజున ఆయన నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయం జలసౌధలో న్యాయనిపుణులు, నీటిపారుదల రంగ నిపుణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

## వారం - వర్జ్యం

14-09-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
అష్టమి రా.3.07
రోహిణి ఉ.8.42
వర్జ్యం : మ.2.02-3.33
దు.సా.4.29-5.18
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** మీ ప్రమేయం లేకపోయినా తగాదాలలోనికి లాగడానికి మీ ఓర్పును రెచ్చగొట్టేవారు అధికమవుతారు.

**వృషభం:** నూతన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. మిత్రులనుండి శుభవార్తలు అందుకుంటారు.

**మిథునం:** సంతాన క్షేమం కోసం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెద్దమొత్తాలను డిపాజిట్ చేస్తారు.

**కర్కాటకం :**రాజకీయ, కళారంగాల వారు గౌరవ సత్కారాలు అందుకుంటారు.

**సింహం:**డబ్బు కన్నా మానవత్వాన్ని విలువనిచ్చి కొన్ని మంచి పనులు చేస్తారు.

**కన్య :** ఉద్యోగస్తులకు కార్యాలయంలో అనుకూల వాతావరణం ఉంటుంది. వస్తులాభం.

**తుల :** మోకాళ్ళ నొప్పులు, పాదాలనొప్పులు బాధించవచ్చు. తనఖా వస్తువులు విడిపిస్తారు.

**వృశ్చికం:** నూతన వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మిత్రబృందాలను పెంచుకుంటారు.

**ధనుస్సు:** జీవితభాగస్వామి సలహాతో వ్యాపార విస్తరణ చేస్తారు. వాహన సౌఖ్యం.

**మకరం:** ప్రముఖులను కలుసుకొని కీలక విషయాలపై చర్చిస్తారు. వస్తువులు కొనుగోలు.

**కుంభం:**ఇంటిలో శుభకార్యాలు జరుగుతాయి. నూతన విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**మీనం :** మాటల చాతుర్యంతో కార్యాలయంలో ఉన్నతాధికారుల మెప్పు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఉచ్చులో పడొద్దు

>> చేయాలి. ఈ దిశగా ముందుకు వెళ్లాలని జనసేన నాయకులు, శ్రేణులతోపాటు కూటమి నాయకులకు సూచిస్తున్నాను. సోషల్ మీడియా, యూట్యూబ్ చానెల్స్ రూపంలోనో, విశ్లేషకుల ముసుగులోనో రెచ్చగొట్టే వారినీ, అభ్యంతరకర రీతిలో మాట్లాడేవారినీ భారత న్యాయ సంహిత ప్రకారం చట్టం ముందు నిలపాలి. వీరి వెనక ఉండి వ్యవస్థీకృతంగా రెచ్చగొట్టి కుట్రలు చేసేవారిపైనా ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయాలి. మచిలీపట్నం వివాదంపై అంతర్గత విచారణ నాయకులకు ఆదేశాలు ఇచ్చాను. ఈ ఘటనలో పాలుపంచుకున్న వారికి నోటీసులు ఇచ్చి వివరణ ఇవ్వాలని స్పష్టం చేశాం. కుట్రలు చేసేవారి కుత్సిత నైజం కలిగిన పార్టీ, ఆ పార్టీ నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వారు చేసే దుష్ప్రచారాన్ని ప్రజాస్వామ్యయుతంగా, చట్ట ప్రకారమే తిప్పికొడదామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

### వరదలలో కొట్టుకుపోయిన మహిళలు

## ఇద్దరు గల్లంతు, ఇద్దరు క్షేమం,

**జీలుగుమిల్లి, సెప్టెంబరు13, ప్రభాతవార్త:** మండలంలోని పూచికపాడులో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాలడుగుల చెన్నమ్మ (50), పచ్చిశాల వరలక్ష్మి (55) మరో ఇద్దరు మహిళలు తెలంగాణ రాష్ట్రం అశ్వరావుపేట మండలం పెదవాగు ప్రాజెక్టు వరదలో కొట్టుకుపోయారు. వీరిలో చెన్నమ్మ, వరలక్ష్మి గల్లంతు కాగా, మరో ఇద్దరు మహిళలు వరద నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. వీరంతా కూలి పనులు కోసం అశ్వరావుపేట మండలం చిన్నాపురం వెళ్లి వెనక్కి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గల్లంతైన ఇద్దరు మహిళలు కూడా మృతి చెందినట్లు సమాచారం.

## తిరుపతికి నేడు సిఎం చంద్రబాబు

### మహిళా సాధికారతపై జాతీయసదస్సు ప్రారంభం

**తిరుపతి,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం ఉదయం (నేడు)తిరుపతికి వస్తున్నారు. తిరుపతిలో రెండు రోజులపాటు ప్రతిష్టాత్మకంగా మహిళా సాధికారతపై పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిధిగా విచ్చేస్తున్నారు. ఆదివారం ఉదయం విజయవాడ నుండి హెలికాప్టర్‌లో తాజ్‌హోటల్ సమీపంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుండి శ్రీకన్వెన్షన్ హాల్‌లో జరిగే ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని అనంతరం రాహుల్ కన్వెన్షన్‌లో జాతీయ సదస్సులో ముఖ్యఅతిదిగా హాజరవుతారు. ప్రసంగించిన తరువాత తిరిగి హెలికాప్టర్‌లో విజయవాడకు వెళతారు.తిరుపతిలో దాదాపు ఐదుగంటలు సిఎం గడపనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం,భద్రతపై తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు భద్రత ఏర్పాట్లుపై అదికారులతో సమీక్షించారు.

# అమరావతిపై జగన్ రివర్స్ డ్రామాలు

**బిసి సంక్షేమ మంత్రి సవిత**



**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిపై జగన్ రివర్స్ డ్రామాకు తెరతీశారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో పెట్టుకుని అమరా వతిపై మరో జగన్నాటకానికి తెర తీశాడన్నారు. ఒక ప్రకటన విడుదల చేశారు. ఏరు దాటాక తెప్ప తగలేసే రకం జగన్ దన్నారు. 2019 ఎన్నికల సమ యంలో అమరావతే రాజధాని అని, తన నివాసం ఇక్కడే ఉందని ప్రజలను నమ్మబలి కాడన్నారు. అధికారంలోకి రాగానే, మాట మార్చేసి మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెర తీశాడన్నారు. అయి దేళ్లలో ఏ ఒక్క ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా, రాజ ధాని లేని రాష్ట్రానిగా ఏపీని భ్రష్టు పట్టించా డరన్నారు. అమరా వతిని స్మశాన మని, మునిగిపోయే ప్రాంత మని చులకన చేసి జగన్ సహా వైసీపీ నాయకులంతా మాట్లాడార న్నారు. ఆంధ్రుల చిరకాల కలయిన అమరావతి కోసం భూములిచ్చిన రైతులను, మహిళలను పెయిడ్ ఆర్టిస్టులంటూ హేళన చేశార న్నారు. వారిని నిర్బం ధాలకు గురి చేస్తూ, పోలీసు లతో కొట్టించారన్నారు. జగన్ అరాచక పాలనతో విసిగిపోయిన యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఛీ కొట్టి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. నిన్నగాక మొన్న తన నీలి మీడియాలో అమరావతి వేశ్యల నగరమంటూ సభ్య సమాజం సిగ్గుపడేలా తప్పుడు మాటలు ఆడించారన్నారు. ఇన్ని విధాలా అమరావతిపై విషంకక్కిన జగన్..ఇపుడు రాజధానికి అనుకూల మంటూ చెప్పడం మరో జగన్నాటకానికి తెర తీయడమేనన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికిని కాపాడుకోడానికి జగన్ రెడ్డి ఆడుతున్న రివర్స్ డ్రామా అని మంత్రి సవిత మండిపడ్డారు. అయితే కాళ్లు పట్టుకోవడం, లేకుంటే జుట్టు పట్టుకోవడం జగన్ కు అలవాటేనన్నారు. జగన్ ఎన్ని రివర్స్ డ్రామాలు ఆడినా ప్రజలు పట్టించుకునే పరిస్థితుల్లో లేరన్నారు. సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

### జ్యోతిర్లింగ యాత్రకు
# ప్రత్యేక రైలు

**విజయవాడ, సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్య క్షేత్రాల సందర్శనకు వెళ్ళే యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ జ్యోతిర్లింగ సహిత దక్షిణ యాత్ర' పేఉరుతో భారత్ గౌరవ్ టూరిస్ట్ ప్రత్యేక రైలును నడపనుంది. ఈ నెల 23న రైలు సికింద్రాబాద్‌లో ప్రారంభమై జనగా, వరంగల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా వెళ్ళూ తిరువణ్ణామలై లోని అరుణాచలేశ్వర ఆలయం, రామేశ్వరం లోని రామనాథస్వామి దేవాలయం, మధురై మీనాక్షి అమ్మ దేవస్థానం, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరులోని ఆలయాల సందర్శన కల్పించనుంది. టిఫిన్, భోజన ం, రవాణా, హోటల్ గదులతో కలిపి ఒక్కొక్కరికి టికెట్ ధర స్లీపర్ తరగతిలో రూ.14,10, థర్డ్ ఏసీలో రూ.22,500, సెకెండ్ ఏసీలో రూ.29,500గా నిర్ణయించారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 9701360701, 9281030726లో సంప్రదించవచ్చు.

# తిరుమల సమాచారం

## భక్తులకు సంతృప్తికరంగా సేవలందిస్తాం

- బోర్డుసభ్యులుగా హరిజవహర్‌లాల్, సుదర్శన్‌వేణు ప్రమాణం



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ వచ్చే భక్తులకు సేవకులుగా తాము సేవలందిస్తామని ఇద్దరు బోర్డు సభ్యులు తెలిపారు. టిటిడి బోర్డుతో కలసి సామాన్యభక్తులకు మరింత సంతృప్తి కరంగా శ్రీవారి దర్శనం చేయించడానికే ప్రాధాన్యతనిస్తామని అన్నారు. తిరుమలతిరుపతిదేవస్థానం ధర్మకర్తల మండలిలో సభ్యుడుగా నియమితులైన పారిశ్రామికవేత్త సుదర్శన్‌వేణు, ఎక్స్ అఫిషియోసభ్యుడిగా నియమితులైన దేవాదాయశాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్ శనివారం తిరుమలకు చేరుకున్నారు. ఈ ఇద్దరితో టిటిడి అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, జెఈఒ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ వీరికి స్వామివారి తీర్థప్రసాదాలను, చిత్రపటం అందజేశారు. ఇంతటి అదృష్టం ఇచ్చిన స్వామివారికి, మరోసారి పనిచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

# త్వరలో తిరుమలలో ముఖగుర్తింపు సాంకేతికత

- సేవకుడిగా భక్తులతో మమేకమైన టిటిడి ఇఒ సింఘాల్



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాత వార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలకు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కోసం ప్రపంచనలుమూలల నుండి విచే ్చసే ప్రతి యాత్రికుని ముఖ గుర్తింపు వ్యవస్థను అందుబాటు లోకి తీసుకురావాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ ఆదేశించారు. రియల్ టైమ్‌లో వ్యక్తుల గుర్తింపు, వారి కదలికలపై నిఘా కోసం ఇది ఎంతగానో దోహదపడు తుందన్నారు. టిటిడి ఇఒగా రెండవసారి బాధ్యతలు చేపట్టిన సింఘాల్ శనివారం ఉదయం తిరుమలలో వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లు, లగేజీ కౌంటర్‌లను, శ్రీవారిసేవకుల సేవలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సేవకుడిగా క్యూలైన్లో భక్తులతో మమేకమై అందుతున్న సేవలు, సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. దర్శన టోకెన్లు పొందిన భక్తులు ఎన్ని గంటలకు క్యూలోకి వచ్చారు, టోకెన్ తీసుకున్న సమయం వారికి సేవకులు అందించిన సేవలను తెలుసుకుని భక్తుల సంతృప్తి చెందడం గమనించారు. టిటిడి సేవలు, స్వామివారి దర్శనం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, మహారాష్ట్ర నాందేడ్ ప్రాంతాల శ్రీవారిసేవకులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. శ్రీవారి సేవకులకు మరింత నాణ్యమైన శిక్షణనిచ్చి తద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సిపిఆర్ఒ డాక్టర్‌తలారి రవికి సూచించారు. శ్రీవారి దర్శనానికి వచ్చి క్యూలైన్లలో, ఆలయం వెలుపల, అఖిలాండం వద్ద తప్పిపోతున్న భక్తులను గుర్తించే ప్రక్రియ మరింత వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమీపిస్తుండటంతో ఆయన భద్రత అంశంపై అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌కుచేరుకుని కొండపై సిసి కెమెరాల పనితీరు, భద్రత సిబ్బంది విధులు గమనించారు.

ఈ తనిఖీల్లో టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విఎస్ఒలు ఎస్వీవి రామ్‌కుమార్, సురేంద్ర, ఆరోగ్యఅధికారి డాక్టర్ మధుసూదన్, పిఆర్ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాల సూచిక ఫలకాలు తెలుగులో కూడా ఉండేలా సిద్ధం చేయండి

- గుంటూరు వాణిజ్యమండలికి డా.గజల్ శ్రీనివాస్ వినతి పత్రం



**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాత వార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో, తెలుగు భాషా సంస్క ృతి పరిరక్షణ, అభివృద్ధి, విశ్వవ్యాప్తి లక్ష్యంగా వచ్చే ఏడాది జనవరి 3, 4, 5 తేదీలలో గుంటూరులోని శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ (నేషనల్ హైవే) ప్రాంగణంలో, 3వ ప్రపంచ తెలుగు మహా సభలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ గుంటూరు వాణిజ్యమండలి( ఛాంబర్ ఆఫ్ కామర్స్ )అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు, ఏల్చూరి వెంకటేశ్వరావు, నాగిరెడ్డి తదితరులను కలసారు. 3 వ ప్రపంచ తెలుగు మహా సభలకు గుంటూరులోని "దుకాణాల సూచిక ఫలకాలు" తెలుగులో కూడా వుండేలా చూడమని కోరారు. ప్రతి వ్యాపార సంస్థ తమ ప్రకటనలు తెలుగు భాషలో ప్రచురించేలా, తమ ఫ్లెక్సీలు, బోర్డులు, సైను బోర్డ్స్ మొదలైనవి తెలుగు అక్షరాలతో , తెలుగు లిపిలో తెలుగు తోరణాల వలె ఉండేలా ప్రోత్సహించగలరని కోరారు. గుంటూరు నగరానికి వచ్చే లక్షలాది తెలుగు భాషాభిమానులకు మన "వ్యాపార సంస్క ృతిలో మాతృ భాషకు ఇచ్చే గౌరవం" స్పష్టంగా కనపడేలా చేయాలని మా ఆకాంక్ష అని డా.గజల్ శ్రీనివాస్ అభ్యర్థించారు. ఛాంబర్ ఆధ్వర్యంలో నగరమంతటా స్వాగత తోరణాలు, తెలుగు ప్రచార పదబంధాలు , తెలుగు వెలుగుల ప్రముఖుల చిత్రాల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయమని ప్రార్థిస్తున్నామని, ఈ ప్రయత్నం ఇతర నగరాలకు కూడా స్ఫూర్తి అవుతుందని మేము విశ్వసిస్తున్నామని ఆయన విన్నవించారు గుంటూరు ఛాంబర్ సభ్యులు డా.గజల్ శ్రీనివాస్ అభ్యర్థనను మన్నించి గుంటూరు ను పూర్తి స్థాయిలో వ్యాపార సూచిక ఫలకాలను తెలుగు లిపిలో ఉంచుతామని డా.గజల్ శ్రీనివాస్ కు హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి పరిషత్ సభ్యులుఅన్నాప్రగడ రవి శ్రీనివాస్ , మనోజ్ కమల్ , ఆంధ్ర ప్రదేశ్ తెలుగు సంఘం పూర్వ సభ్యులు డా. కత్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మహిళా సాధికారత సదస్సుకు ఏర్పాట్లు పూర్తి : మంత్రి సవిత



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినగరంలో తొలిసారిగా జాతీయ మహిళా సాధికారత సదస్సు ను నిర్వహించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ చూపారని, ఈ సదస్సు కు దేశంలోని పార్లమెంటరీ, అసెంబ్లీల్లోని మహిళ ప్రజాప్రతినిదులు, అధికారులు విచ్చేస్తున్నట్లు రాష్ట్రమంత్రి సవిత తెలిపారు. ఈసదస్సు కు అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం పూర్తిచేసిందని, ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా శ్రీవారి ఆశీస్సు లు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని, మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి పలు పథకాలు అమలుచేస్తున్నారని చెప్పారు. శనివారం ఉదయం నైవేద్యాల విరామసమయంలో తిరుమలకు వచ్చిన మంత్రి సవిత శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆమెకు రిసెప్షన్ ఓఎస్‌డి సత్రానాయక్, ఆలయ పేష్కార్ రామకృష్ణ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో తెలంగాణ జడ్జి నగేశ్



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని శనివారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ నగేశ్ బీమపాక కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. కుటుంబంతో కలసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండ పంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అన్నప్రసాదాలకు రూ.44 లక్షలు విరాళమిచ్చిన తమిళ మంత్రి



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తులకు ఒకరోజు అన్నప్రసాదం వడ్డనకు అయ్యే 44లక్షలు రూపాయలు విరాళాన్ని తమిళనాడుమంత్రి కెఎన్ నెహ్రూ అందించారు. నవంబర్ 9వతేదీ తన పుట్టినరోజున పూర్తిగా భక్తులకు తనపేరున అన్నప్రసాదాలు వడ్డించాలని కోరుతూ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు శనివారం రాత్రి అందజేశారు.

# అమరావతిపై వైఎస్సార్సీ నేతల దొంగ నాటకాలు: మంత్రి అనగాని



**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజా రాజధాని అమరావతిపై మళ్ళీ వైసిపి నేతలు దొంగ నాటకాలు ఆడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఈ విషయంలో మూడు ముక్కలాట ఆడిన జగన్‌ను ప్రజలు ఛీదరించుకునానరని మండిప డ్డారు. అమరావతి రాజధాని నిర్మాణం అక్కర్లేదంటూనే గుంటూరు ,విజయవాడ మధ్య నిర్మిస్తామని కబుర్లు చెబుతున్నారని దుయ్యబట్టారు. ఇక్కడి రైతులు, మహిళలపై జగన్ వేధింపులు, పెట్టిన కేసులు ఇంకా మర్చిపోలేదన్నారు. ఆయన గోడ మీద పిల్లి వైఖరిని ప్రజలు గమనిస్తునే ఉన్నారని చెప్పారు. ఐదేళ్ళ పాటు అమరావతిని నిర్లక్ష్యం చేసిన జగన్‌ను వచ్చే ఎన్నికల్లోనూ రాష్ట్ర ప్రజలు ఓడిస్తారని పేర్కొన్నారు. అబద్దాలతో జగన్ ప్రజలను నమ్మించలేరన్నారు. జగన్ వచ్చే ఎన్నికల్లో పులివెందుల్లో గెలిచేపరిస్థితి లేదన్నారు. చంద్రబాబ ఒక విజన్‌తో ముందుకు వెళ్తున్నారన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతారన్నారు.

# ఆత్మకూరు గురుకుల పాఠశాలలో విషజ్వరాలపై తక్షణ చర్యలకు మంత్రి ఆదేశం



హాస్టల్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

**ఆత్మకూరు (నెల్లూరు), సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** ఆత్మకూరులోని బాలికల గురుకుల పాఠశాలలో విషజ్వరాల కలకలంపై రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తక్షణమే స్పందించారు. విషజ్వరాల సమాచారం తెలియాగానే మంత్రి అధికారులను అప్రమత్తం చేసి విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఆత్మకూరు గురుకుల పాఠశాల ఘటనలపై నెల్లూరులోని క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్ని స్థాయిల అధికారులతో మంత్రి అత్యవసరంగా గ్రూప్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై సూచనలకు ఆదేశాలిచ్చారు. మంత్రి ఆదేశాలతో సమాయత్తమైన వైద్యఆరోగ్య, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆత్మకూరు గురుకుల పాఠశాలకు వెళ్ళి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఏ ఒక్క విద్యార్థికి కూడా ఇబ్బంది కలగకఉండా చూడాలని మంత్రి ఆనం అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రస్తుతం జ్వరాల బారినపడిన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, హాస్టల్స్ లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా జాయింట్‌కలెక్టర్ కార్తీక్, డిఎంఅండ్‌హెచ్ఒ సుజాత, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ ఖాదర్‌వలి, ఆర్‌డిఒ పావని, తహసిల్దార్ పద్మజాకుమారి, జిల్లా బిసికార్పోరేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యాశాఖ, ఐటిడిఎ, గురుకుల పాఠశాలల అధికారులు, జిల్లా ఆసుపత్రి సూపర్నెంట్ డాక్టర్ శేషారత్నం, మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపవరం వెంకటరమణమ్మ, టిడిపి నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పులిమి శైలజారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ శివకోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో డయేరియా మూలాలు పరిశీలిస్తున్నాం: మంత్రి నారాయణ



**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** నగరం లోని న్యూరాజరాజేశ్వరీపేటలో డయేరియా మూలాలు ఎక్కడున్నాయో కనుక్కొనేందుకు దృష్టి పెట్టామని తెలిపారు. ఆర్‌ఆర్ పేటలో శనివారం ఆయన పర్యటించారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డయేరియా మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. నూతన ప్రభుత్వాసుపత్రిలో భాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ...ఈ సాయంత్రం లేదా సోమవారం ఉదయానికి నీటి పరీక్షల నివేదికలు వస్తాయన్నారు. రిపోర్టులు వచ్చాక అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డయేరియా కారణం తాగునీరా లేదా ఫుడ్ పాయిజన్ అన్నది స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే 15 వేల వాటర్ క్యాన్ల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 150 మంది చికిత్స తీసుకొని ఇంటికెళ్ళారని వివరించారు. డయేరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు. ప్రజలెవరూ వదంతులు నమ్మవద్దని సూచించారు.

# ఆకట్టుకుంటున్న రాయలసీమ నృత్యకళోత్సవాలు




**తిరుపతి,సెప్టెంబర్ 13ప్రభాత వార్తప్రతినిధి:** తిరుపతి మహతి కళాక్షేత్రంలో జరుగుతున్న రాయలసీమ రంగస్థలి నృత్యకళోత్స వాలు కళాకారులను, ఆహుతులను ఆకట్టుకుంటున్నాయి. నృత్యోత్స వాల్లో రెండవరోజు శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు భీమవరం కళాకారులు ప్రదర్శించిన బుడబుక్కలు జానపదనృత్యం విశేషంగా ఆకట్టుకుంది. గుడివాడ, హైదరాబాద్, విజయనగరం, ఒంగోలు ప్రాంతాల నుండి వచ్చిన నృత్యకళాకారులు ప్రదర్శించిన నృత్యోత్స వాలు జనరంజకంగా నిలిచాయి. కళాకారులకు శ్రీకృష్ణదేవరాయ పురస్కారాలను నిర్వాహకులు రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, ,కళాకారులు కెఎన్ రాజ, విజయభాస్కర్‌రెడ్డి, కోండే చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరావు ,మల్లారపు వాసు ప్రదానం చేశారు.

## తిరుపతి జిల్లాకు కొత్త ఎస్పీగా సుబ్బారాయుడు

**తిరుపతి,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** అంతా ఊహించినట్లే ఐపిఎస్ అధికారుల బదిలీల్లో తిరుపతి జిల్లాకు నూతన ఎస్పీగా మళ్ళీ లంకెల సుబ్బరాయుడు నియమితులయ్యారు. 14 మంది ఐపిఎస్ అధికారుల బదిలీల్లో సుబ్బరాయుడు తిరుపతికి నియమితుల య్యారు. తెలంగాణారాష్ట్రం నుండి ఇంటర్‌కేడర్‌లో మూడేళ్ళ డిప్యూటేషన్‌పై గత ఏడాది వచ్చిన సుబ్బరాయుడు 2013 పోలీసు బ్యాచ్ అధికారి. గత ఏడాది జూలై 16వ తేదీ తొలిసారిగా తిరుపతి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు భద్రత కల్పించే విషయంలో ,పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చారు. 2025జనవరి 8వతేదీ రాత్రి జరిగిన తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంతో ఉన్నతాధికారుల బదిలీల్లో జిల్లా ఎస్పీ బదిలీ తప్పలేదు. సుబ్బరాయుడును బదిలీ చేస్తూ ,డిజిపి కార్యాలయంలో రిపోర్టుచేయాలని ఈ ఏడాది జనవరి 9న ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ తరువాత ఆయన్ను ఎర్రచందనం అక్రమరవాణా టాస్క్‌ఫోర్స్ చీఫ్‌గా ప్రభుత్వం నియమించినా ఆయన పెద్దగా సుముఖత చూపలేదు. ముఖ్యమంత్రిచంద్రబాబుకు విశ్వాసమున్న అధికారి.

## ఆలయాల్లో జరిగే వివాహాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆలయాల్లో జరిగే వివాహాలపై ఆయా ఆలయాల అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని.. ప్రతి వివాహం తప్పనిసరిగా రిజిస్టర్ కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో వాసవ్య మహిళా మండలి, జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మత పెద్దలు.. పేరిట ప్రత్యేక సమావేశం జరిగింది. విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని వివిధ దేవాలయాల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి సమష్టి భాగస్వామ్యం అవసరమన్నారు. బాల్య వివాహ రహిత జిల్లాగా ఎన్టీఆర్ జిల్లాను తీర్చిదిద్ది, ఆదర్శంగా నిలపడంలో ప్రతిఒక్కరూ చేయిచేయి కలపాలని పేర్కొన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు నిబద్ధతతో కృషిచేయాల్సి ఉందన్నారు.


SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) ప్రకారం జారీ చేయడమైనది.

టు,

ఋణగ్రహీత చిరునామా: మెస్సర్స్ శ్రీ సాయి నమిత భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్, ఆర్.ఎస్.నెం. 479/3, బైపాస్ రోడ్డు, మైలవరం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్. శ్రీ దొంతిరెడ్డి శ్రీరామ్ రెడ్డి (ప్రొప్రయిటర్), తండ్రి : చంద్రశేఖర్ రెడ్డి, ఫ్లాట్ నెం.304, వైష్ణవి ఎలైట్, సున్నపుబట్టీలు సెంటర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్. శ్రీమతి పల్నాటి శ్రీలక్ష్మి (హామీదారు), భర్త: పి. శ్రీనివాసరెడ్డి, ఫ్లాట్ నెం.304, వైష్ణవి ఎలైట్, సున్నపుబట్టీలు సెంటర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.

సర్ / మేడమ్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (2002 యొక్క 54) లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి తేది.04-08-2023న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా తేది.04-08-2023 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.84,47,471/- (అక్షరాల ఎనభై నాలుగు లక్షల నలభై ఏడు వేల నాలుగు వందల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే) + తేది.05.08.2023 నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.

మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని తేది.25.10.2023న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును తేది. 31-10-2023న (సాక్షి: విజయవాడ సిటీ ఎడిషన్ (తెలుగు) మరియు హాన్స్ ఇండియా: విజయవాడ ఎడిషన్ (ఇంగ్లీష్)) దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.

తేది.04-08-2023 నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేదీ నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల బ్యాంక్‌నకు తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించుటకు ఇ-వేలం/బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు**

1. కృష్ణాజిల్లా, పామర్రు సబ్ రిజిస్ట్రీ, పామర్రు గ్రామ పంచాయితీ ఏరియా, పామర్రు ఆర్.ఎస్.నెం. 141/7 లోని ఎ.0.44 సెంట్లు విస్తీర్ణం గల ఆస్తి. **హద్దులు : తూర్పు :** దొంతిరెడ్డి వీరారెడ్డి గారి భూమి, **పడమర :** దొంతిరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి గారి భూమి, **ఉత్తరం :** బొల్లారెడ్డి ఉదయలక్ష్మి గారి భూమి, **దక్షిణం :** డొంక.
2. కృష్ణాజిల్లా, పామర్రు సబ్ రిజిస్ట్రీ, పామర్రు గ్రామ పంచాయితీ ఏరియా, పామర్రు ఆర్.ఎస్.నెం. 141/7 లోని ఎ.0.24 సెంట్లు విస్తీర్ణం గల ఆస్తి. **హద్దులు : తూర్పు :** దొంతిరెడ్డి వీరారెడ్డి గారి భూమి, **పడమర :** దొంతిరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి గారి భూమి, **ఉత్తరం :** బొల్లారెడ్డి ఉదయలక్ష్మి గారి భూమి, **దక్షిణం :** డొంక,
3. కృష్ణాజిల్లా, పామర్రు సబ్ రిజిస్ట్రీ, పామర్రు గ్రామ పంచాయితీ ఏరియా, పామర్రు ఆర్.ఎస్.నెం. 141/7 లోని ఎ.0.40 సెంట్లు విస్తీర్ణం గల ఆస్తి. **హద్దులు : తూర్పు :** దొంతిరెడ్డి కోటిరెడ్డి గారి భూమి, **పడమర :** పూర్ణచంద్ర రెడ్డి గారి భూమి, **ఉత్తరం :** చంద్రశేఖర్ రెడ్డి గారి భూమి, **దక్షిణం :** డొంక.
4. కృష్ణాజిల్లా, పామర్రు సబ్ రిజిస్ట్రీ, పామర్రు గ్రామ పంచాయితీ ఏరియా, పామర్రు ఆర్.ఎస్.నెం. 141/7 లోని ఎ.0.29 సెంట్లు విస్తీర్ణం గల ఆస్తి. **హద్దులు : తూర్పు :** దొంతిరెడ్డి కోటిరెడ్డి గారి భూమి, **పడమర :** పూర్ణచంద్ర రెడ్డి గారి భూమి, **ఉత్తరం :** చంద్రశేఖర్ రెడ్డి గారి భూమి, **దక్షిణం :** డొంక.

పైన తెలిపిన మూడు డాక్యుంమెంట్లలోని మొత్తం విస్తీర్ణం ఎ.1.37 సెంట్ల మాగాణి భూమి వ్యవసాయేతర భూమిగా మార్చబడినది, చంద్రశేఖర్ రెడ్డి గారి కుమారుడు దొంతిరెడ్డి శ్రీరామ్ రెడ్డి మరియు శ్రీనివాసరెడ్డి గారి భార్య పల్నాటి శ్రీలక్ష్మి ఆమె జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దొంతిరెడ్డి శ్రీరామ్‌రెడ్డి గారిచే ప్రాతినిధ్యం వహించారు.

తేది: 11-09-2025
ప్రదేశం: విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రస్తుత ఖరీఫ్ సీజను చివరి దశకు చేరింది. అయినా రైతులకు కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఖరీఫ్ సాగు ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఈ సీజన్లో వరి సాగుతో పాటు పత్తి, మొక్కజొన్న వంటి పంటలసాగు గణనీయంగా జరిగింది. ఈనెలాఖరు నాటికి సాగు టార్గెట్ దాటే అవకాశం ఉంది. సకాలంలో వర్షాలు రాక నాట్లు జాప్యం జరిగినా, తదుపరి కురిసిన వానలతో ఖరీఫ్‌సాగు జోరందుకుంది. అయితే మళ్లీ భారీవర్షాలు, వరదలతో వేసిన పంట దెబ్బతినడంతో కొందరురైతులు మళ్లీ రెండోసారి విత్తులు నాటారు. వానాకాలం ప్రారంభంలో మే నెలలో వర్షాలు కురిసినప్పటికీ, ఆ తర్వాత నెలన్నర రోజుల పాటు వానలు ముఖం చాటేయడంతో సాగు మందగించింది. జూన్లో వర్షాలు సరిగా కురువక పంటల సాగుకు ప్రతికూలంగా మారాయి. జులై నెలాఖరు, ఆగస్టు ప్రారంభం నుంచి కురుస్తున్న వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి.ఈనేపథ్యంలో ఖరీఫ్ సీజను గాను కొన్ని పంటల సాగు ఆశాజనకంగా సాగుతుండగా, మరికొన్ని పంటల పరిస్థితి నిరాశను కలిగిస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లో అతివృష్టి, మరి కొన్నిప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ పంటల సాగు అనుకున్నంత మేర ఫలితాలను ఇస్తాయాలేదా అనేది సందిగ్ధమే అవుతోంది. దీనికి తగినట్లుగా ఇటీవల కాలంలో లేనటువంటి సమస్య ఖరీఫ్ రైతులను వెంటాడుతోంది. ప్రధానంగా యూరియా కొరత రైతులను వేధిస్తోంది.సకాలంలో పంటలకు అవసరమైన యూరియా లభ్యం కాక అన్నదాతల పరిస్థితి ఇప్పటికీ దయనీయంగా ఉంది.కొన్నిచోట్ల ఒక్కోబస్తా, రెండేసి బస్తాలు యూరియా సరఫరా చేస్తున్నా, అది సాగు చేసిన పంటలకు సరిపోక రైతుల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.రాత్రి,పగలుయూరియా కోసం సహకార సంఘాలు, ఫెర్టిలైజర్ షాపులు, ఇతర విక్రయ కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు.

# సగటు రైతును వీడని ఖరీఫ్ కష్టాలు

**సిహెచ్ వి వి రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారు. వర్షా భావ పరిస్థితులు,భారీ వర్షాలకు తోడు, యూరియా కొరతతో ఖరీఫ్ కష్టాలు అన్నదాతలను వెంటాడుతున్నాయి. తెలంగాణలో ఈ వానాకాలంలో సాగు 1.27 కోట్ల ఎకరాలకు చేరింది. ఈ సీజన్లో సాధారణ సాగులక్ష్యం 1.34కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటికే 96శాతం లక్ష్యం సాధించిందని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో స్పష్టం చేసింది. ఈ వానాకాలం సీజన్ లో సాగైన పంటల్లో వరి 62.27 లక్షల ఎకరాలతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తరువాత పత్తి పంట 45.47 లక్షల ఎకరాలతో రెండో స్థానంలో ఉంది. రికార్డు స్థాయిలో మక్కలు 6.27లక్షల ఎకరాలు, కంది 4.78 లక్షల ఎకరాలు, సోయా 3.62 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. పెసర 61వేల ఎకరాలు, జొన్న 34,611ఎకరాల్లో సాగు కాగా, మినుములు 23వేల ఎకరాలు, ఇతర పంటలు 30వేల ఎకరాల్లో సాగయ్యాయి. ఇక వానకాలం సాగులో రాష్ట్రంలో 10.50 లక్షల ఎకరాలతో నల్గొండ టాప్‌లో నిలిచింది. ఈ జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో పత్తి, 4.84 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. అలాగే, 7.28 లక్షల ఎకరాలతో సంగారెడ్డి రెండో స్థానంలో, 6.27లక్షల ఎకరాలతో ఖమ్మంజిల్లా మూడో స్థానంలో ఉంది. ఆ తరువాత ఆదిలాబాద్ 5.79 లక్షల ఎకరాలతో నాలుగో స్థానంలోఉండగా ఆ తరవాత స్థానాల్లో నిజామాబాద్ (5.52 లక్షల ఎకరాలు), సూర్యాపేట (5.43 లక్షల ఎకరాలు), కామారెడ్డి (5.43 లక్షల ఎకరాలు), 5.37 లక్షల ఎకరాలతో వికారాబాద్ జిల్లాలు వరుస స్థానాల్లో నిలిచింది. కాగా ఈ ఖరీఫ్ సీజనులో రాష్ట్రంలోని 21 జిల్లాల్లో ఎక్సెస్ వర్షపాతం చూస్తే జులై 20 వరకు 25 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదవడంతో సాగు వెనకబడింది. విత్తనాలు, మొలకలు ఎండిపోవడంతో రైతులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అయితే, జులై నెలాఖరు నుంచి కురిసిన వానలు సాగు పుంజుకునేలా చేశాయి. గత నెల రోజుల్లోనే పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.రాష్ట్రంలోని పంటలు సాగయ్యే 32 జిల్లాల్లో 21 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, మరో 11 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఫలితంగా దాదాపు అన్ని జిల్లాల్లో పంటల సాగు 100 శాతానికి చేరువయ్యాయి. 10 జిల్లాల్లో వందశాతం సాగును దాటేశాయి.అయితే ఇటీవల కురిసిన వర్షాలు రైతుల్లో ఆశలు రేకెత్తించగా, సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందనేది వ్యవసాయశాఖ అంచనా. మరోపక్క ఈ ఖరీఫ్ సేద్యానికి 9.80లక్షల టన్నుల యూరియా అవసరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా వేసింది.



కేంద్రం 9.8లక్షల యూరియా కేటాయించింది. ఈ ఖరీఫ్‌లో ఆగస్టు నాటికి కేంద్రం నుంచి 8.32 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 5.12 లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. అలాగే ఏప్రిల్ 1.70 లక్షల టన్నులు, మే 1.60 లక్షలు, జూన్‌1.70లక్షలు, జులైలో 1.60లక్షలు, ఆగస్టులో 1.70 లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీనుంచి రాష్ట్రానికి అత్యధిక శాతం యూరియా రావాల్సి ఉంది.సాంకేతిక కారణాలు, రిపేర్లతో మూడు సార్లు షట్‌డౌన్ అయింది. దీంతో ఆగస్టు వరకు 1.69లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 1.06లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. రామగుండం ఫ్యాక్టరీ సక్రమంగా పనిచేయక పోవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమనేభావన ఉంది. మరోపక్క ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 8.21 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. ఈ సీజనుకు రాష్ట్రానికి 6.22 లక్షల టన్నుల యూరియాను కేంద్రం కేటాయించింది. ఇది గతసంవత్సరం కన్నా 10,138 టన్నుల తక్కువ. గత సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 4,69,297 టన్నులు సరఫరా కాగా, ఈ ఏడాది 3,72,246 టన్నుల మాత్రమే కేంద్రం నుండి సరఫరా జరిగింది. రాష్ట్రానికి యూరియా కోత 96 వేల టన్నులకు పైగా ఉంది. ఆగస్టుకి 1 లక్షా 30 వేల టన్నుల యూరియా కేంద్రం సర ఫరా చేయాల్సి ఉండగా, అందింది మాత్రం 49, 485 టన్నులు మాత్రమే. ఆగస్టు నెల కోటాలో ఇంకా కేంద్రం నుంచి 81 వేల టన్నులు రావాల్సిన దానిలో 53 వేల టన్నులు కేంద్రం విడుదల చేసినా ఇంకా 28వేల టన్నులు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. దీన్ని గమనిస్తే అదనంగా కేంద్రం యూరియా కేటాయింపు ఎక్కడా కనిపించడం లేదు. 53వేల కేటా యింపుల్లో కూడా కాకినాడ పోర్టు నుండి 17,293 టన్నులు దిగుమతి చేసుకోవటానికి మాత్రమే కేంద్రం జిఓ విడుదల చేసింది. ఇక యూరియా సరఫరాలో ప్రభుత్వాల నిర్లక్ష్య పంట దిగుబడులపై ప్రభావం చూపిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న యూరియా కొరత కారణంగా పత్తి, వరి దిగుబడి 20 నుంచి 30 శాతం తగ్గే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. యూరియా కొరత ఇలాగే కొనసాగితే దిగుబడులు 40 శాతం తగ్గినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని చెప్తున్నారు. ఈ రెండు పంటలకు సకాలంలో యూరియా వేస్తే పంట ఏపుగా పెరిగి దిగుబడికూడా పెరుగుతుంది. లేదంటే సమ స్యలు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పైరు ఎర్రబారడంతో పాటు చీడపీడలు పీడిస్తాయని చెప్తున్నారు. దీనికి తోడు యూరియా కొరతతో ఒకవైపు దిగుబడి తగ్గే ప్రమాదం ఉండగా,మరోవైపు రైతులకు చీడపీడల నివారణ ఖర్చు పెరుగుతున్నది. రెండురాష్ట్రాల్లో ఎకరానికి 23నుంచి 25 క్వింటాళ్ల ధాన్యం ఉత్పత్తి అవుతున్నది. యూరియా కొరత కారణంగా దిగుబడి 30 శాతం తగ్గితే దాదాపు ఏడు క్వింటాళ్ల దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అదే జరిగితే ఒక్కో రైతు ఎకరాకు సగటున రూ.17 వేల వరకు నష్టపోతాడు. దిగుబడి తగ్గితే రైతు ఆదాయంలోనూ కోత పడుతుంది. దీనికి తగినట్లుగా చీడపీడల నివారణకు గాను రైతులు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి.ఇదే సమయంలో ఇటీవల రెండు రాష్ట్రాల్లో వర్షబీభత్సం అన్నదాతలకు అపారనష్టాన్ని మిగిల్చింది. ఎక్కడికక్కడ వరదనీటిలో పంటలు కొట్టుకుపోయాయి.పలుచోట్ల పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయి.వరి,పత్తి,మొక్కజొన్న పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా సుమారు 4.10 లక్షల ఎకరాల్లోని పంటలకు నష్టంజరగ్గా నిబంధనల ప్రకారం ప్రభుత్వం 2.50 లక్షల ఎకరాలే దెబ్బతిన్నట్లు గుర్తించింది. దీంతో వేలాది మంది రైతులకు తీరని నష్టం మిగిలింది. దెబ్బతిన్న పంటల్లో 1.80 లక్షల ఎకరాల్లోని పత్తి చేలు నీట మునిగాయి. అలాగే మరో 1.30 లక్షల ఎకరాల్లో వరిచేలు వరద ముంపునకు గురైంది. ప్రధానంగా రాష్ట్రంలోని మెదక్,సంగారెడ్డి, నల్లగొండ, కొత్తగూడెం, జనగాం,మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట్, ములుగు, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, హన్మకొండ తదితరజిల్లాల్లో అత్యధికంగా పంటలు నీట మునిగాయి. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 5లక్షలకుపైగా ఎకరాల్లో పంట నీట మునిగింది. వాగులు, వంకలు,చెరువులు,కాల్వలు పొంగిపొర్లడంతో పొలాల్లోకి భారీగా నీరు వచ్చిచేరింది.పత్తి,మిరప,వరి, మొక్కజొన్న,కూరగాయల తోటలకు వర్షాలు, వరదలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా వరి, పత్తి, చెరుకు, మొక్కజొన్న వంటి పంటలకు గణనీయమైన నష్టంజరిగింది. పశ్చిమగోదావరి, కృష్ణా,గుంటూరు,కర్నూలు జిల్లాల్లోని లోతట్టుప్రాంతాలు నీట మునగడంతో పాటు, కొన్ని చోట్ల పంట పొలాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ఆగస్టు 18, 19 తేదీల్లో కురిసిన భారీ వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ●

రాష్ట్రం
తమిళనాడు

# కలిసొచ్చే కాలానికి..

**ఎ.వి.వి ప్రసాద్**

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లలు పుడతారంటారు. తమిళనాట బిజెపి ప్రస్తుతం అదే అభిప్రాయంతో కనిపిస్తోంది. సిపి రాధాకృష్ణన్ గతవారం ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత నుంచి బిజెపిలో ధీమా మరింతపెరిగింది. రాష్ట్రానికి చెందిన బిజెపి సీనియర్ నేత అయిన రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఉండడం వల్ల విజయావకాశాలు మెరుగుపడ్డాయని పార్టీ నేతలంతా భావిస్తున్నారు. యేడాదిలోగా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రానికి చెందిన నేత ఉపరాష్ట్రపతిగా ఉంటే పార్టీకి ఆ భరోసాయే వేరు. ఆ ప్రభావం అనేక విధాలుగా కనిపిస్తుంది. రాష్ట్రంలో బిజెపి పరిస్థితి ప్రస్తుతం అంతంత మాత్రంగానే ఉంది. సీనియర్ లీడర్లు చాలా కొద్దిమందే ఉన్నారు.అన్నాడిఎంకెతో పొత్తు కొనసాగిస్తున్నది కానీ 2021, 24 ఎన్నికల్లో ఆ పొత్తు వల్ల ఎలాంటి ప్రయోజనం లభించక పోవడంతో ప్రస్తుతం డోలాయమానంలో పడింది. అందుకు ప్రధాన కారణం అన్నాడిఎంకె పరిస్థితి కూడా క్షీణ దశలో ఉండడమే. గతంలో ఎమ్జీఆర్, జయలలిత వంటి కీలకనేతలెందరో ముఖ్యమంత్రులైన అన్నాడిఎంకెలో ప్రస్తుతం ఓ పది సీట్లు గెలిపించగల నేతలు కూడా కరవవడంతో ఆ పార్టీతో పొత్తువల్ల తమకు ఎలాంటి ప్రయోజనం ఉండదనే భావిస్తున్నా పొత్తు మాత్రం కొనసాగుతోంది. బిజెపి అధిష్టానం తమిళనాడుపై దృష్టిని కేంద్రీకరించి అధికారంలోకి రావడానికి అవసరమైన ప్రాతిపదికలు కూడా నిర్మించడానికి ప్రయత్నిస్తోంది. ప్రధాని మోడీ కూడా తనదృష్టిని, శక్తిని తమిళనాడుపైనే ఎక్కువ కేంద్రీకరించారని ఆయన ఇటీవల రాష్ట్రానికి చేసిన పర్యటనలు, ప్రకటించిన నిధులను చూస్తే స్పష్టమవుతుంది. దక్షిణాదిలో ప్రధానంగా ఏపిలో ఎన్డీయే ప్రభుత్వం ఉంది. అయితే అక్కడ టిడిపి,జనసేన తర్వాత నిలబడవలసిందే. తెలంగాణలో అంతర్గతంగా విపక్ష బిఆర్‌ఎస్ తో సాన్నిహిత్యం పెంచుకున్నదని,అందుకే సీట్లు పెరిగాయనీ అంటారు. ఇక మెరుగుపడవలసింది తమిళనాడు లోనే. అధికారంలోకి వచ్చినా రాకపోయినా వచ్చేయేడు జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో కీలక రాజకీయ శక్తిగా మారాలని మాత్రం బిజెపి భావిస్తున్నదనడానికి రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి చేయడమే బలమైన ఉదాహరణగా చెప్పవచ్చు.

ఆయన గెలుపు ఫలితం వెలువడగానే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడైన కె అణ్ణామలై చేసిన ప్రకటన చూస్తే ఎలాంటి వ్యూహంతో వారు కదులుతున్నారో అర్థమవుతుంది. రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఉండగా బిజెపి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనే ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. తమనాయకుడు ఉపరాష్ట్రపతి అయ్యారనే ఆనందంలో ఆయన అలాంటి ప్రకటనచేసిఉండవచ్చు కానీ బిజెపికి అంతటి 'శక్తి సామర్థ్యాలు' ఉన్నాయా? అనే సందేహం కూడా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆ పార్టీకి రాష్ట్రంలో 2.6 శాతం ఓట్లు మాత్రమే ఉన్నాయి.2021 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన సీట్లు కూడా 4మాత్రమే. అన్నాడిఎంకె 66సీట్లు సాధించడంతో, పిఎంకె వంటి పార్టీలతో కలుపుకొని



సిపి రాధాకృష్ణన్

ఎన్డీయె కూటమి మొత్తం 76సీట్లు సాధించగలిగింది. అదే సమయంలో 133 సీట్ల డిఎంకె తో కలిపి ఆ కూటమికి మొత్తం 162సీట్లు లభించాయి.అంటే డిఎంకె కూటమి సమీపంలోకి కూడా ఎన్డీయే కూటమి రాలేకపోయింది. డిఎంకె కూటమిలో కాంగ్రెస్,ఎండిఎంకె, వామపక్షాలు ఉండడంతో సీట్లుకూడా వారికి అధికంగానే వచ్చాయి. అయితే చీలికలు పీలికలుగా ఉన్న అన్నాడిఎంకెతో పొత్తు వల్ల వాస్తవానికి గత ఎన్నికల సీట్లు కూడా ఈసారి వచ్చే అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది. అందుకే కొత్తపార్టీ, ప్రజల్లో విశేష ఆదరణ గల సినీనటుడు విజయ్ సారథ్యంలోని టివికెను తమ కూటమి లోకి ఆకర్షించేందుకు బిజెపి గట్టిగా ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నం ఫలిస్తే ఎన్డీయే విజయావకాశాలు మరింత మెరుగుపడతాయని చెప్పవచ్చు. కానీ ఒంటరిగానే బరిలోకి దిగుతామని విజయ్ అంటున్నారు.

ఎన్నికల వాతావరణం ఏర్పడేసరికి ఆయన అభిప్రాయం మారినా మారవచ్చు. ప్రత్యక్షంగాపొత్తు ఉన్నాలేకపోయినా పరోక్ష మద్దతు అయినాటివికె నుంచి బిజెపికి లభించగలదని పరిశీలకులు భావిస్తున్నారు. అలా విజయ్‌తో చేతులు కలిపితే బిజెపికి అధికార అవకాశాలు కూడా పెరుగుతాయి.అది విఫలమైతే బిజెపివద్ద 'ప్లాన్ బి' కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మొదటి నుంచి ఆరెస్సెస్‌లో బలమైన నేతగా ఎదిగిన రాధాకృష్ణన్‌కు తమిళనాడులోని గౌండర్ కమ్యూనిటీలో చాలా ఆదరణ ఉంది.ఇంతకుముందు గవర్నర్‌గా బిజెపి రాష్ట్రాల మధ్య సమన్వయకర్తగా కూడా ఆయన ఉన్నారు. మంచి వాగ్ధాటి ఉన్న రాధాకృష్ణన్ పిలుపు ఇస్తే గౌండర్ కమ్యూనిటీతోపాటు ఇతర ఒబిసి వర్గాల్లోకూడా ఎక్కువ ప్రభావమే ఉంటుందనీ, తద్వారా ఓట్లశాతం బాగా పెరుగుతుందనీ బిజెపి భావిస్తోంది. కనీసం 10, 15 శాతానికి ఓట్లు పెంచుకోగలిగితే సీట్లసంఖ్య బాగా పెరుగుతుంది గనుక అధికారానికి దగ్గరవుతుంది. అప్పుడు విజయ్ వంటి పార్టీల మద్దతుతోనైనా అధికారంలోకి వచ్చేఅవకాశం ఉంటుంది. అన్నాడిఎంకెలోని చీలిక వర్గంనేత,మాజీముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం సొంతపార్టీ పెట్టేఆలోచన చేస్తుండటంతో ఆయన మద్దతు కూడా ఉపయోగించుకొని చక్రం తిప్పేందుకు బిజెపి వ్యూహరచన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.ఏదిఏమైనా ఈ ఎత్తుగడలన్నీ ఫలించడానికి రాధాకృష్ణన్ సహకారం పూర్తిగాఉంటుందని, ఆయనను ఉపరాష్ట్రపతిని చేయడానికి అది ఒకబలమైన కారణమని అంటున్నారు. అన్నాడిఎంకె మాజీనేత టిటివి దినకరన్ నాయకత్వంలోని ఎఎంఎంకె పార్టీని తిరిగి కూటమిలోకి రప్పించే యత్నాలను కూడా బిజెపిచేస్తోంది.దానికి కూడా రాధాకృష్ణన్ సహకారం ఉంటుందనుకొంటున్నారు.శశికళసహా అన్నాడిఎంకెలోనిమాజీ నేతలందరినీ తిరిగి రప్పిస్తే విజయావకాశాలు బాగా పెరుగుతాయని బిజెపి భావిస్తోంది. ఈ సమీకరణలన్నిటికీ రాధాకృష్ణన్ చాలా ఉపయోగపడతారని వారిఉద్దేశం. రాధాకృష్ణన్‌సేవలువారికి ఏమేరకు ఉపయోగపడతాయో చూడాలి. ●

దేశం
నేపాల్

# అవినీతిరహిత పాలనకు అడుగులు!

**గన్ని మోహన్**


ప్రపంచంలోని కొన్ని దేశాల్లో స్థానికతపై ఉద్వేగం, మా ఉపాధి మాకే కావాలంటూ నిరసనలు, స్థానికులకే ప్రాధాన్యం అన్న చందాన మరోదేశం ఇలా ఎవరి సమస్యలతో వారు సతమతం అవుతూ భూగోళాన్ని హింసాత్మకంగా మార్చేసారు. మూడేళ్లుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం ఇప్పటికీ కొలిక్కిరాలేదు. పొరుగననే ఉన్న చైనా, పాక్‌లు సందు దొరికితేచాలు ఎక్కడ చొరబడదామా అన్న ఆలోచనలే.వీటికి భిన్నంగా ఇప్పుడు చిన్న హిమాలయ దేశం నేపాల్‌లో ఉవ్వెత్తున ఎగిసి పడిన జెన్‌జడ్ ఉద్యమం చివరకు ప్రభుత్వాన్నే కూలదోసింది. ప్రధాని కెపిశర్మ ఓలి రాజీనామా చేయడంతోపాటు పార్లమెంటురద్దుకు సైతం దారితీసింది. సామాన్య మధ్యతరగతి జీవనప్రమాణాలు మెరుగుకోసం శ్రమిస్తుంటే పాలకుల వారసులు మాత్రం అవినీతి సొమ్ముతో విలాసజీవితాలు అనుభవిస్తున్నారంటూ ఉద్యమకారులు ఆందోళన లేవనెత్తారు. నెపోకిడ్‌పేరిట లేచిన ఈఉద్యమం చివరకు పార్లమెంటు,మంత్రులు ప్రభుత్వ కార్యాలయాలను సైతం దగ్ధం చేసింది. సైన్యం రంగంలోకి దిగినా పట్టువిడవని విద్యార్థి,యువలోకం కొత్తప్రభుత్వం రావాలని, ఎన్నికలు జరగాలన్న పట్టుదలతోనే నిరసన కొనసాగించారు. మొత్తం 51మందివరకూ చనిపోగా 1300 మందికిపైగా తీవ్ర గాయాలపాలై వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. అయినా కూడా ఈ జెన్‌జెడ్ నెపోకిడ్ వ్యతిరేక ఉద్యమాన్ని కొనసాగించింది. నేపాల్‌లోని వివిధజైళ్ల నుంచి పదివేలమందికిపైగా ఖైదీలు కూడా పరారయ్యారు. వారిని అదుపుచేసేందుకు సరిహద్దుల్లో అప్రమత్తం అయిన దేశాల భద్రతా దళాలు కొందరిని పట్టుకుని అప్పగించాయి. సైన్యంపై తిరగబడిన కొందరిపై నేపాల్ సైన్యం కాల్పులు జరపక తప్పలేదు. వీరిలో రాజకీయ ఖైదీలతో పాటు ప్రమాదకరమైన నేరాలు చేసిన ఖైదీలు కూడా ఉన్నారు. ఇది దేశానికి ముప్పు అని భావించడంతోనే సైన్యం రంగంలోకి దిగి ఎక్కడికక్కడ కట్టడి కార్యాచరణ అమలుచేసింది. రాను రాను ఉద్యమం తారస్థాయికి చేరుకుంటుండటంతో పాలకులు మెట్టుదిగి జెన్‌జడ్ సూచించిన సుశీలా కర్కినే ప్రధానిని చేయాలన్న డిమాండ్‌కు తలొగ్గడం వంటి పరిణామాలు చకచకా జరిగాయి. అవినీతి మరకలులేని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కర్కిని ఎంపికచేసి ఆమె ఆధ్వర్యంలోనే తాత్కాలిక ప్రభుత్వం కొనసాగించాలని పట్టుబట్టారు. యువత డిమాండ్లకు దిగివచ్చిన ప్రభుత్వం అప్పటికప్పుడు రాత్రిపొద్దుపోయాక రాష్ట్ర పతిభవన్‌లో కర్కిచేత ప్రమాణ స్వీకారం చేయించింది. పరిమిత కేబినెట్‌తో అత్యవసర సమా వేశం నిర్వహించి ముందు పార్లమెంటును రద్దుచేయడం ఆతర్వాత వచ్చే ఏడాది మార్చిలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని ప్రకటించడం చకచకా జరిగిపోయాయి. దీనితో ఉవ్వెత్తున ప్రజ్వరిల్లిన హింస ఒక్కసారిగా శాంతించింది. దీనికంతటికీ ప్రధాన మూలం సుశీల కర్కిని ఎంపిక



సుశీలా కర్కి

చేయడమే. అభిశంసన తీర్మానాన్ని సైతం అధిగమించి పదవీ విరమణ వరకూ కొనసాగిన ఏకైక మహిళా ప్రధాన న్యాయమూర్తిగా పేరున్నసుశీల కర్కి ఆనాటి నేపాల్ సమాచార మంత్రినిసైతం జైలుకు పం పించేందుకు వెనుకాడలేదు. ఆమె చీఫ్‌జస్టిస్‌గా కొనసాగిన కాలంలో నేపాల్‌లో అవినీతి రాజ్యమేలింది. అవకతవకల పాలనలతో అట్టుడికిన నేపాల్‌లో అవినీతిపై ఆమె రాజీలేని వైఖరిని కొనసాగించారు. పాలక నేతలతో సన్నిహిత సంబంధంఉన్న కుటుంబం నుంచే వచ్చినప్పటికీ కర్కికి రాజకీయ నేపథ్యం ఏమీలేదు. న్యాయ వ్యవస్థలో ఆమె అవలంభించిన వైఖరే ఆమెకు పేరుప్రతిష్టలు తెచ్చిపెట్టింది. ఆనాడు అధికారం లోని నేపాలి కాంగ్రెస్ సిపిఎన్ మావోయిస్టు సెంటర్ ఆధ్వర్యంలో ఆమెపై పదవీచ్యుతి తీర్మా నం ప్రవేశపెట్టారు. అవినీతినిరోధకశాఖ చీఫ్‌ను అవినీతి ఆరోపణలపై ఆమె తొలగించాలని తీర్పుచెప్పడం పాలకులకు సుతరాము రుచించ లేదు. ఈప్రతిపాదన ఏకపక్షంగానే సాగి ఆమెను సస్పెండ్ చేసేంతవరకూ దారితీసింది. అయితే ప్రభుత్వ చర్యలు కొరివితో తలగోక్కున్నట్లయింది. పెద్దఎత్తున దేశవ్యాప్తంగా నిరసనలు ఎగిసిపడ్డాయి.న్యాయవ్యవస్థ స్వతంత్రత,స్వయం ప్రతిపత్తిని పరిరక్షించుకోవాలంటూ పెద్దఎత్తున ఆందోళన సాగడంతో సుప్రీంకోర్టు సైతం జోక్యం చేసుకోక తప్పలేదు. ఫలితంగా ఆమెపై చేపట్టిన అభిశంసన చర్యలు వెనక్కుపోయాయి. ఆమె సస్పెన్షన్ కూడా కొద్దివారాల్లోనే రద్దయి కర్కి తిరిగిసుప్రీం కోర్టు చీఫ్‌జస్టిస్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఆ తర్వాత నెలరోజులకు అంటే 2017 జూన్‌లో ఆమె పదవీ విరమణ చేసారు. ఆమె వెలువరించిన కీలక తీర్పులు పాలకప్రతినిధులకు నిద్ర లేకుండాచేసాయి. ఆనాటి సమాచారమంత్రి జయప్రకాష్ ప్రసాద్ గుప్తాను ఒక అవినీతికేసులో శిక్ష విధించడం అప్పట్లో సంచలనం కలిగించింది. మడమతిప్పని వైఖరితో ఉన్న సుశీలకర్కి అయితే ప్రస్తుత అవినీతి ఊబిలో చిక్కుకున్న నేపాల్‌ను గాడిలో పెట్టగలరన్న నమ్మకం ఈ జెన్‌జెడ్‌లో బలంగా నాటుకుపోయింది. భారత్‌లోనే చదువుకున్న కర్కి బనారస్ హిందూ వర్సిటీలో ఉన్న సమయంలోనే సహచర విద్యార్థిగా ఉన్న దుర్గాప్రసాద్ సుబేదిని వివాహం చేసుకున్నారు. అయితే ఆనాటి రాజరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో విమానం హైజాక్ కేసులో ఆయన పాలుపంచుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. రెండేళ్ల భారత్‌లో జైలు జీవితం తర్వాత నేపాల్‌కు వెళ్లిపోయిన తర్వాత సుబేది ఇకపై వార్తల్లోకి రాలేదు.ఈకేసులోకూడా సుశీలాకు ఎలాంటి మరకలు అంటకపోవడం విశేషం. మొత్తంగా చూస్తే దశాబ్దాల తరబడిజరిగిన అవినీతి పాలనకు వ్యతిరేకంగా ఇప్పుడు ప్రజాస్వామ్యయుతంగా జరిగే అవినీతి రహిత పాలనవైపు హిమాలయ దేశం అడుగులు వేస్తోందని చెప్పవచ్చు. ఈక్రమంలో ప్రధానిగా సుశీల కర్కి పాలనతీరు, రాజీలేని ధోరణి, సంస్కరణలే ఇప్పుడు నేపాల్ భవిష్యత్తుకు దిక్సూచి అవుతాయని నిస్సందేహంగా చెప్పుకోగలం. ●


# అమెరికా ఆధిపత్యం అంతరించబోతోందా?



సుంకవల్లి సత్తిరాజు

వాణిజ్య పరమైన సుంకాలతో భారత్‌ను ఇబ్బంది పెడుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితుల్లో, స్వీయరక్షణలో పడి, డ్యామేజ్ కంట్రోల్ కోసం ప్రయత్నాలు చేస్తున్న సూచనలు కానవస్తున్నాయి. భారత్‌తో వాణిజ్య ఇబ్బందులు తొలగించుకుంటానని, మోడీ తన మిత్రుడంటూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ సరికొత్త రాగం ఆలపిస్తున్నారు. ఇదే సందర్భంలో భారత్‌పై నూరు శాతం వాణిజ్య సుంకాలు విధించాలని యూరోపియన్ దేశాలను రెచ్చగొట్టడం ట్రంప్ నిలకడ లేని మనస్తత్వానికి నిదర్శనం.ఇటీవల జరిగిన షాంఘై సహకార సదస్సు అగ్రరాజ్యమైన అమెరికాకు కంటిమీద కునుకు లేకుండా చేసిన మాట వాస్తవమని చెప్పడానికి డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలే నిదర్శనం. ట్రంప్ ఆగ్రహానికి, అసహనానికి, అనుమానానికి, అభద్రతకు,భయానికి అమెరికన్ ఆల్ట్‌టెక్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ట్రూత్‌సోషల్ ప్రత్యక్ష నిదర్శనంగా మారింది. భారత్‌నుఅనేక ఇబ్బందులు పెట్టి, అవమానించి, ట్రేడ్‌వార్ సాగించిన ట్రంప్ ఇప్పుడు భారత్‌పై సానుభూతి చూపించడం విడ్డూరం. భారత్, రష్యాలు చైనా చీకటి వ్యూహంలోకి నెట్టబడ్డాయన్న శ్వేత సౌధ విహారి ఆవేదనలో ఎన్నో అర్థాలు ఇమిడి ఉన్నాయి. భారత్, రష్యాలు అమెరికాకు దూరమయ్యాయంటూ ఒక వైపు ఆవేదన వ్యక్తంచేస్తూనే, మరో వైపు భారత్,రష్యాలపై అక్కసు వెళ్లగక్కడం ట్రంప్‌లోని పరస్పర వైరుధ్య భావాలను, మానసిక వత్తిళ్లను ప్రస్ఫుటం చేస్తున్నాయి. రష్యా, ఇండియాలు అమెరికాను విడిచి పెట్టడం బాధాకరమంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లోని చిత్తశుద్ధిని శంకించవలసిందే.

నియంతలతో కలవడం మోడీ చేసిన తప్పిదమంటూ, సిగ్గుచేటంటూ డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం. ఉక్రెయిన్ రష్యా యుద్ధాన్ని ఆపుతానంటూ ఇటీవల అలాస్కాలో పుతిన్‌కు రాచమర్యాదలతో స్వాగతం చెప్పినప్పుడు, పుతిన్ తన స్నేహితుడంటూ వల్లె వేసినప్పుడు పుతిన్ నియంత అని ట్రంప్‌కు తెలియదా? అమెరికాకు అత్యంత ఆప్త దేశమైన ఖతార్ పై ఇజ్రాయిల్ వైమానిక దాడులతో విరుచుపడి, విధ్వంసానికి పాల్పడితే తనకు ఏమీ తెలియదన్నట్టుగా మాట్లాడడం ట్రంప్ విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నది. ఎన్నికలు జరపకుండా, యుద్ధం పేరుతో ఎమర్జెన్సీ విధించి పాలన సాగిస్తున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఏ కోవకు చెందిన వాడో ట్రంప్ చెప్పగలరా?ఉగ్రవాదులను భారత్ పై ఉసిగొల్పుతూ, తాను తలచుకుంటే సగం ప్రపంచాన్ని అణ్వాయుధాలతో భస్మీపటలం చేస్తానన్న పాక్ ఆర్మీ ఛీఫ్ అసిమ్ మునీర్‌ను వైట్‌హౌస్‌కు ప్రత్యేక అతిథిగాఆహ్వానించి, అతనితో కలిసి విందారగించిన ట్రంప్ భారత్‌కు నీతివచనాలు చెప్పడంలో ఎలాంటి ఔచిత్యం కానరావడం లేదు. భారత్ విషయంలో ట్రంప్ ఏ విషయంలోను పరిణితి గల రాజకీయవేత్తగా ప్రవర్తించలేదు.పాక్ వేడుకుంటేనే కాల్పుల విరమణకు అంగీకరించామని భారత్ పదే పదే స్పష్టం చేస్తున్నా, ట్రంప్ మాత్రం తన బెదిరింపులతో, మధ్యవర్తిత్వంతో భారత్ పాక్‌తో కాల్పుల విరమణకు అంగీకరించిందని, అణుయుద్ధం జరగకుండా తానే ఆపగలిగానని భారత్‌ను తక్కువ చేసి మాట్లాడడం, భారత్‌ను వాణిజ్య సుంకాల పేరుచెప్పి బెదిరించి, దారికి తెచ్చానని ప్రగల్భాలు పలకడం అమెరికా అధ్యక్ష స్థానానికున్న విలువను,స్థాయిని ట్రంప్ తగ్గించినట్టుగానే భావించాలి. ఆరు యుద్ధాలను ఆపానంటూ తనకు నోబెల్ శాంతి బహుమతి కావాలంటూ, ట్రంప్ చేస్తున్న ప్రకటనలు విడ్డూరంగా ఉన్నాయి. గాల్వాన్ సంఘటన తర్వాత భారత్ చైనాల మధ్య సుదీర్ఘ కాలం ద్వైపాక్షిక సంబంధాలు సంక్షోభంలో పడ్డాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు వీటోహక్కు లేకుండా చైనా ఎప్పటికప్పుడు అడ్డుపడుతూనే ఉంది. కాని ప్రస్తుత పరిస్థితులు మారాయి. చైనా, భారత్‌ల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటున్న పరిస్థితులపై డోనాల్డ్ ట్రంప్ నీళ్ళు చల్లి చల్లార్చడమే కాకుండా బద్ధ శత్రువులను మిత్రులుగా మార్చిన వైనం ఆశ్చర్యం కలిగించింది. సరిహద్దు వివాదాన్ని



పక్కన బెట్టి, ఇరుదేశాల మధ్య సఖ్యత, స్నేహం పెంపొందించుకోవాలని మోడీ,షీ జిన్‌పింగ్‌లు భావించడం శత్రువులు మిత్రులుగా మారుతున్న క్రమంలో జరుగుతున్న సకారాత్మక ప్రక్రియగా భావించవచ్చు. షాంఘై సదస్సులో మోడీ, పుతిన్, జిన్‌పింగ్‌ల స్నేహం చూసి ట్రంప్‌కు వెన్నులో వణుకు పుట్టింది.ట్రంప్ రెండవ సారి అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుండే భారత్‌ను లక్ష్యంగా చేసుకుని భారత్ ఆర్థిక స్థిరత్వాన్ని,ఎదుగుతున్న భారత్ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి కుటిల ప్రయత్నాలు చేసిబలమైన భారత్‌ను దూరం చేసుకున్న మాటవాస్తవం.భారత్‌అమెరికా సంబంధాలు మెరుగుపడుతున్న దశలో, ట్రంప్‌కు మిత్రుడుగా మోడీ ప్రచారంలోకి వచ్చిన తరుణంలో అమెరికా అధ్యక్ష స్థానంలో కూర్చున్న ట్రంప్ ధోరణిలో మార్పు వచ్చింది. ట్రంప్ విజయానికి దోహదం చేసిన అమెరికాలోని ప్రవాస భారతీయులను సైతం ట్రంప్ ఆశ్చర్యానికి గురిచేసాడు. భారత్‌పై ప్రతీకార సుంకాలు విధిస్తూ, రష్యా నుండి చమురు కొనుగోలు చేయవద్దని ఆంక్షలు విధించడమే కాకుండా భారత్ పట్ల అత్యంత అవమానకరంగా ప్రవర్తించాడు.అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టవద్దని, భారతీయులను అమెరికా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో నియమించుకోవద్దని చెబుతూనే, భారత్‌లో సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్‌ను నెత్తిన పెట్టుకోవడం వంటి దుశ్చర్యలకు ట్రంప్ పాల్పడ్డాడు. 50శాతం సుంకాలతో భారత్‌ను ఇబ్బంది పెట్టాలన్న ట్రంప్ ఆలోచన బెడిసి కొట్టింది. ట్రంప్ ధోరణి పట్ల భారత్ విసిగి వేసారింది. షాంఘై సహకార సదస్సులో జిన్ పింగ్, పుతిన్ వంటి దిగ్గజాలతో మోడీ సుహృద్భావ వాతావరణంలో జరిపిన చర్చల పట్ల అమెరికా భీతిల్లింది.మారిన ప్రపంచ రాజకీయ పరిణామాల నేపథ్యంలో అమెరికా ఆధిపత్యానికి బ్రిక్స్ దేశాలు చరమగీతం పాడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. క్వాడ్ కూటమి ఎందుకు ఏర్పడినా, ఇదిచైనాకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటమిగానే పేర్కొంటారు. ప్రస్తుతం అమెరికాతో భారత్‌కు తలెత్తిన విబేధాల దృష్ట్యా, చైనాతో భారత్ సంబంధాలు ఇటీవలి కాలంలో మెరుగైన దృష్ట్యా, ఇక క్వాడ్ కూటమి మనుగడ సాగిస్తుందా? చైనాకు వ్యతిరేకంగా పనిచేసే పరిస్థితి ప్రస్తుతం భారత్‌కు లేకపోవడంతో ఇక క్వాడ్ కూటమి నిరుపయోగంగా మారే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. మారిన వర్తమాన,రాజకీయ, వాణిజ్య,ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో బ్రిక్స్ కూటమి బలపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బ్రెజిల్,రష్యా, ఇండియా,చైనాలతో ఏర్పడిన 'బ్రిక్' దక్షిణాఫ్రికా చేరికతో 'బ్రిక్స్'గా మారింది. ఆ తర్వాత యు.ఎ.ఇ, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, ఈజిప్టు దేశాల చేరికతోబ్రిక్స్ కూటమి 'బ్రిక్స్ ప్లస్'గా రూపాంతరం చెందింది. సభ్య దేశాల మధ్య విభిన్న రంగాల్లో పరస్పర సహకారానికి,అభివృద్ధికి ఏర్పడిన బ్రిక్స్ కూటమి ప్రధానఉద్దేశ్యం ప్రపంచాన్ని శాసిస్తున్న అమెరికా డాలర్‌కు కళ్లెం వేయడమే. డాలర్‌కు ప్రత్యామ్నాయంగా నూతన కరెన్సీని రూపొందించాలన్న లక్ష్యం సమీప భవిష్యత్తులో సాధ్యపడవచ్చు. ట్రంప్ సాగిస్తున్న ట్రేడ్‌వార్‌పట్ల ఆగ్రహంతో ఉన్న పలుదేశాలు బ్రిక్స్ కూటమిలో చేరడానికి సంసిద్ధంగా ఉన్నాయి. బ్రిక్స్‌పట్ల ట్రంప్ ఇప్పటికే పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. అమెరికా ప్రతీకార సుంకాలతో ఆగ్రహంగా ఉన్నవర్తమాన ప్రపంచవాణిజ్య పరిణామాల రీత్యా బ్రిక్స్ కూటమి బలోపేతం కావడం ఆవశ్యకమనే ధోరణి నెలకొంది. ఈ పరిణామాలు ట్రంప్‌కు మింగుడు పడడం లేదు. తలతో ట్రంప్ చేసిన వ్యాఖ్య లు హాస్యాస్పదంగా ఉన్నాయి. రష్యా,ఉత్తర కొరియాలు అమెరికాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాయంటూ పేర్కొనడం ట్రంప్‌లో ఏర్పడిన భయానికి అద్దం పడుతున్నాయి. ఒక అగ్రరాజ్యం ఇంతలా భయపడడం బహుశా ఇదే మొదటి సారేమో.భారత్‌తో కయ్యానికి కాలుదువ్వి,వాణిజ్య సుంకాలను పెంచిన ట్రంప్ అమెరికా వీసాల విషయంలో కూడా కఠిన నిబంధనలు విధిస్తున్నారు. ఇదే బాటలో ఆస్ట్రేలియా కూడా పయనిస్తున్నది.27 దేశాలకు సభ్యత్వమున్న యూరోపియన్ యూనియన్ కూడా భారత్‌తో ట్రేడ్ డీల్ కుదుర్చుకోనుంది.అమెరికా మిత్రదేశాలు భారత్‌తో ద్వైపాక్షికవాణిజ్య సంబంధాలు కుదుర్చుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం ట్రంప్‌కు శరాఘాతం. భారత్ ను బెదిరించాలనుకుని భంగపడిన అమెరికా ప్రస్తుతం నిస్సహాయ స్థితిలో ఉంది. ●

# విజయవాడ వార్త



## జిల్లా యంత్రాంగం ప్రజా కేంద్రీకృతంగా ఉండాలి -కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారీయా

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త : జిల్లా యంత్రాంగం ప్రజా కేంద్రీకృతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారీయా పిలుపునిచ్చారు.జిల్లా నూతన కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో తన మనోగతాన్ని స్పష్టంచేశారు.జిల్లా యంత్రంగా చక్కటి టీమ్ వర్క్‌తో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కు అత్యంత ప్రాధ్యాత ఇవ్వాలని ఆమె అన్నారు.పిజిఆర్ఎస్‌లో



వచ్చిన వినతుల్లో మన పరిధిలో పరిష్కారం చేయలేనివి వచ్చినప్పుడు స ్పష్టంగా అర్జీదారునికి తెలియజేయాలని ఆమె ఆదేశించారు.కొన్ని సందర్భాల్లో ఎక్కువసార్ల రీ ఓపెన్ జరుగుతున్నాయని,అలాంటి పరిస్థితులు ఉండకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి స్పష్టంగా విచారణ చేసి పరిష్కరించాలని ఆమె అన్నారు.విజన్ ఆంధ్రా కార్యాచరణ ప్రణాళికను అన్ని రంగాలకు తయారు చేయడం జరిగిందని,వాటిని తప్పకుండా సాధించుటకు కృషి చేయాలని ఆమె స్పష్టంచేశారు.ప్రభుత్వం ఇచ్చిన పెర్ఫారె మ్సన్ ఇండికేటర్స్ పై ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన ఉండాలని ఆమె అన్నారు.ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై ప్రజల దృక్పథం ఏ విధంగా ఉందో ప్రజల నుండి స్పందనను వివిధ మాధ్యమాల ద్వారా సేకరిస్తుందన్నారు.జిల్లాను అభివృద్ధి పథంలో ఉన్నతంగా ఉంచుటకు సమిష్టి కృషితో సాధ్యమని,అందుకు సానుకూల దృక్పథంతో అధికారులు పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,తెనాలి సబ్ కలెక్టర సంజనా సిన్హా,జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలి,రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు,ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గుంటూరు రైల్వేస్టేషన్ మేనేజర్‌గా శరత్‌బాబు



గుంటూరు లీగల్,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త : స్టేషన్ నిర్వహణలో గుంటూరు రైల్వే స్టేషన్‌ను అగ్రస్థానంలో నిలబెడతానని మండే శరత్‌బాబు పేర్కొన్నారు.గుంటూరు స్టేషన్ మేనేజర్ గా శరత్‌బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు.శరత్‌బాబు ఇప్పటివరకు ఇదే స్టేషన్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై స్టేషన్ మేనేజర్‌గా నియమితులయ్యారు.ఆయన నియామకం పట్ల స్టేషన్ సూపరింటెండెంట్ కంతేటి చంద్రకిరణ్,సిబ్బంది సీరం అనిల్‌కుమార్,డి.రాజకుమార్,షేక్ ఖాదర్ బాషా తదితరులు అభినందనలు తెలిపారు.

## పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త : పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజా గ్రీవెన్స్)నిర్వహించారు.కార్యక్రమానికి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వివరించగా,ఎమ్మెల్యే వాటిని విని సంబంధిత అధికారులకు పంపించి తక్షణ పరిష్కారానికి ఆదేశించారు.ప్రధానంగా బృందావన్ గార్డెన్స్‌లోని అంధుల,విభిన్న ప్రతిభావంతుల వసతి గృహంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాలని వినతిచేస్తూ,వసతి గృహాన్ని ప్రత్యక్షంగా సందర్శించాలని విభిన్న ప్రతిభావంతులు



కోరారు.తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ నాయకులు పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు కంభంపాటి రాధాకృష్ణమూర్తికి రావలసిన రూ.5,28,239ల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తక్షణం విడుదల చేయడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఏపి టిఎఫ్ సంఘ నాయకులు ఉద్యోగులు,ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వ కాలంలో ఎదురైన ఇబ్బందులను గుర్తుచేసి, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 15నెలలు గడిచినా ప్రధాన డిమాండ్లు ఇంకా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు.పెండింగ్‌లోఉన్న 4డిఏలు విడుదల చేయడం,సిపిఎస్‌ను రద్దుచేసి మెమో నెం.57ను అమలు చేయడం,12వ వేతన సవరణ కమీషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించడం,అన్ని రకాల బకాయిలు చెల్లించడం,ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచడం,యాప్,అసెస్మెంట్ బుక్లెట్ విధానాలను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు.అన్ని వినతులను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి,ఉద్యోగులు,ఉపాధ్యాయులు రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని గుర్తు చేస్తూ,వారి డిమాండ్లను ప్రభుత్వస్థాయికి తీసుకెళ్ళి త్వరితగతిన పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో అందించాలి

గుంటూరు రూరల్-ప్రభాతవార్త: మండలంలోని తురకపాలెం లో చనిపోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని బిసి వై పార్టీ అధినేత బోడి రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు శనివారం ఆయన తురకపాలెంలో పర్యటించారు ఈ సందర్భంగా గ్రామస్తులకు ధైర్యం చెప్పారు మృతిల కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన రెండు మూడు నెలలుగా తురకపాలెంలో అసహజ మరణాలు సంభవించటం ఆందోళన కలిగిస్తుందని మరణించిన



వారిలో ఎక్కడ ఎక్కువ మంది పురుషులే ఉన్నారని అలాగే చనిపోయిన వారిలో 30 నుంచి 40 సంవత్సరాల వయసు మధ్య కలవారే ఎక్కువగా ఉండటం చాలా బాధాకరం కలిగిస్తుందని గ్రామములో ప్రభుత్వం చేపట్టిన చర్యలు అభినందన నియమని తెలిపారు ఇప్పటివరకు గ్రామంలో 1340 మందికి వైద్య పరీక్షలు చేస్తే అందులో 1068 మందికి కిడ్నీ సమస్యలు 168 మందికి లివర్ సమస్యలు ఉన్నట్లు పరీక్షల్లో తెలియజేశారు గ్రామంలో వందలో 70 మందికి ఆరోగ్య సమస్యలు రావడానికి కారణం ఏమిటో యుద్ధ ప్రాతిపదికన తెలుసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు దొరకపాలెంలో చనిపోయిన వారు సహజ మరణాలు కాకుండా వారి కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకోవాలని ప్రభుత్వానికి తెలియజేశారు

## 2003 డిఎస్సీ ఉపాధ్యాయుల భారీ ర్యాలీ

గుంటూరు విద్య, ప్రభాతవార్త: 01.09.2004కు ముందు(2003సంవత్సరంలోనే )జారీ చేసిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికై, ప్రభుత్వ నియామక ప్రక్రియలో జరిగిన జాప్యం వల్ల కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ పరిధిలోకి నెట్టబడి అన్యాయానికి గురైన సుమారు 11,000 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం ఆందోళనను తీవ్రతరం చేసింది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, శనివారం గుంటూరులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీ గుంటూరు, కొరటపాడు సెంటర్‌లోని మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహంవద్ద ప్లాకార్డ్ లతో మౌన ప్రదర్శన చేస్తూ ప్రారంభమై, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగినది. అనంతరం, ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని అంబేద్కర్ విగ్రహానికి సమర్పించి తమ నిరసనను తెలియజేసినట్లు ..2003 డియస్సి గుంటూరు జిల్లా కన్వీనర్స్ సలగాల. ప్రసన్నకుమార్, శీలం.యలమంద లు తెలియజేసారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూకూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంన్నర గడిచినా, ముఖ్యమంత్రి నుండి మంత్రుల వరకు అందరికీ వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం శూన్యం. కేవలం చర్చల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని మంత్రులు చెప్పడం హాస్యాస్పదమని, ఇది చర్చలతో తేలేది కాదని, చట్ట ప్రకారం ఇవ్వాల్సిన హక్కు అని ..2003 డియస్సి ఉపాధ్యాయ ఫోరం నాయకులు మారెళ్ల శ్రీనివాసరావు, రాయిడి. శ్రీధర్, మరియు పూదోట శివప్రసాద్ తేల్చిచెబుతున్నారు. ఇప్పటికే జూలై 18న పాత జిల్లా కేంద్రాల్లో, ఆగస్టు 25న విజయవాడ ధర్నా చౌక్‌లో 3000 మందికి పైగా ఉద్యోగులతో మహాధర్నా నిర్వహించినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దురదృష్టకరమని వారు వాపోయారు.




## కలుషిత నీరు తాగొద్దు : మున్సిపల్ సిబ్బంది

విజయవాడ కార్పొరేషన్,సెప్టెంబరు 13 ,ప్రభాతవార్త: అతిసారా నివారణకు విస్తృతంగా అవగాహన కల్పించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శనివారం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి సిబ్బంది వెళ్ళి,అతిసార నివారణపై అవగాహన కల్పించే కరపత్రాలను పంచి,మైకు ద్వారా అనౌన్స్‌మెంట్లు చేసి వారికి ఆరోగ్య సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతిసార నివారణకు శుభ్రమైన కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, నీరు నిల్వ



లేకుండా ఉండాలని, వాడుకునే మంచినీటికి మూతలు తప్పనిసరిగా పెట్టాలని,ఇంటి పైనున్న ట్యాంకును క్రమం తప్పకుండా ప్రతి 15 రోజులకు పరిశుభ్రపరుస్తూ ఉండాలని, ట్యాంకు పైన తప్పనిసరిగా మూతను వాడాలని,ఆహారం తినే ముందు మరుగుదొడ్డికి వెళ్ళిన తర్వాత తప్పనిసరిగా చేతులు జబ్బుతో కడుక్కోవాలని, ఓఆర్ఎస్ ద్రావణం ఇంట్లో ఉంచుకోవాలని, విరేచనాలు మొదలైతే వెంటనే ఓఆర్ఎస్ తాగాలని,పసిపిల్లలు ఉంటే వారికి తల్లిపాలను కొనసాగించవచ్చని,ఇంటి లోపల ఉన్న వ్యర్థ్యాలను తొలగించి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. అలాగే కలుషిత నీరు బయట వండిన అశుభ్ర ఆహారం తినకూడదని,విరేచనాలు వచ్చినప్పుడు కానీ టి.పానీయాలు తాగకూడదని,మలమూత్ర విసర్జన బహిరంగ ప్రదేశాల్లో చేయకూడదని చిన్నారులకు ఓఆర్ఎస్ ద్రవాలు ఇవ్వకుండా వదిలేయకూడదని, ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని,ఎటువంటి సందేహాలు ఉన్నా సమాచారం లేదా సహాయం కోసం ఎన్టీఆర్ జిల్లా కంట్రోల్ రూం 9154970454 నెంబర్ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి త్రాగునీటి బబుల్స్ సరఫరా చేశారు.

## శని,ఆది వారాల్లో వేంకటేశ్వర స్వామి వారికి మండలాభిషేకం

విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్త: శనివారం,ఆదివారంలలో పున్నమితోటలో ఉన్న వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో మండాభిషేకాన్ని నిర్వహించినట్లు దేవాలయ ఇనస్పెక్టర్ లలిత తెలిపారు.శనివారం సాయంత్రం 6.30 గంటలకు విష్వక్సేన పూజ,పుణ్యాహవాచకం,అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించారు. నేడు విష్వక్సేన పూజ,పుణ్యాహవాచకం,అగ్ని ప్రతిష్టాపన,శాంతి హోమం,అష్టోత్తర శతకలశాభిషేకం,పూర్ణాహుతి,అక్షతారోహణ,ఆచార్య బహుమానం,యజమాని ఆశీర్వచనంలను నేటి రాత్రి 8.30కు నిర్వహస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శాంతి కళ్యాణాన్ని నిర్వహిస్తారని ఆలయ అధికారి మల్లిఖార్జునరావు తెలిపారు.అనంతరం అన్నప్రసాద వితరణ జరగనుందని ఆయన పేర్కొన్నారు. నేడు జరిగిన కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణ,శశికిరణ్,ఆనంద్,భక్తులు విజయకుమార్,నారాయణరావు,న్యాయవాదులు పడవల ఏడుకొండలు,ప్రసాద్,సుబ్రహ్మణ్యంలతో పాటు భక్తులు ప్రసాదరెడ్డి,తులసి,శాంతి,రాజేశ్వరి, తదితర భక్తులు,అధికారులు పాల్గొన్నారు.

## టిటిడి దేవస్థానంలో అన్నప్రసాద వితరణ



విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్త: శనివారం పున్నమితోట లోని టిటిడి దేవస్థానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని టెంపుల్ ఇనస్పెక్టర్ లలిత అధ్వర్యంలో నిర్వహించారు. జన్యావుల ప్రసన్న,జన్యావుల శివమల్లేష్,చేకూరి శేషయ్య,దుర్గమ్మ,బాలాంతరపు రత్నకుమార్,జ్యోతిర్మణి,కోనేరు ప్రవీణ్‌కుమార్,అనుపమ తదితరులు ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన



తిరువూరు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త : తిరువూరు నగర్ పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో జిల్లా కలెక్టర్ మరియు కమీషనర్ మనోజ ఆదేశాల మేరకు శాంతినగర్ సచివాలయం సిబ్బంది అందరూ హెల్త్ సెక్రటరీతో కలిసి ఈ రోజు సీజనల్ డిసీజెస్ మీద కాంపైన్ నిర్వహించారు.

## వ్యాధులు వ్యాపించకుండా చర్యలు

తిరువూరు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తిరువూరు నగర పంచాయతీ పరిధిలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా




తీసుకొనవలసిన జాగ్రత్తలను మున్సిపల్ కమీషనర్ కె.మనోజ ఒకటవ సచివాలయంలో ప్రతి ఇల్లు తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. వాతావరణంలో వచ్చే మార్పులు కారణంగా ఆరోగ్య జాగ్రత్తలు కాచి చల్లార్చిన త్రాగునీరు వేడి ఆహారం తీసుకోవాలని సూచనలు చేశారు. వీరితో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్, శానిటరీ సెక్రటరీలు హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్స్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ అభివృద్ధి పనులపై మంత్రి నారాయణ సమీక్ష

గుంటూరు నగరపాలక సంస్థ-ప్రభాతవార్త: కుంచనపల్లిలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ క్యాంప్ కార్యాలయంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనులపై ఆ శాఖ మంత్రి నారాయణ సమావేశం నిర్వహించారు.కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,ఎమ్మెల్యేలు గల్లా మాధవి,నసీర్ అహ్మద్,రామాంజనేయులు,పబ్లిక్ హెల్త్ ఈ ఎన్ సీ ప్రభాకర్,సీఆర్డీయే ఈ ఎన్ సీ గోపాల కృష్ణా రెడ్డి, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు.గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు కార్యక్రమాలపై ప్రధాన చర్చ జరిగింది. గుంటూరులో 120 కోట్ల విలువైన రోడ్లు,డ్రైనేజీల పనులకు వెంటనే టెండర్లు పిలవాలని సమావేశంలో నిర్ణయించారు.నగరంలో పలు ప్రాంతాల్లో పీపీపీ విధానంలో అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలని మున్సిపల్ కార్పోరేషన్ పరిధి ఉన్న మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర రాష్ట్ర మంత్రులు దిశా నిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.

## భారీ వర్షాలకు జలమయమైన ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త : మొండిగేటు నిర్మాణంలో గుంటూరు నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని తూర్పు ఎమ్మెల్యే,అసెంబ్లీ మైనార్టీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు.శనివారం కురిసిన వరా ్షలకు నీట మునిగిన ప్రాంతాలను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు.ఆయా ప్రాంత వాసులతో మాట్లాడి ధైర్యం చెప్పారు,24గంటలు అందుబాటులో ఉంటానని ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు.నగరంలోని వర్షపు నీరంతా మొండిగేటు ద్వారా గుంటూరు చానల్లో కలుస్తుందని అయితే ఇక్కడ కేవలం వెంట్ 5మీటర్ల లోపు మాత్రమే ఉందని,దీంతో వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్ళే అవకాశం లేక లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయన్నారు.తాను ఎమ్మెల్యే అయిన వెంటనే ఈ సమస్యపై దృష్టి సారించానని,రైల్వే అధికారులను అనేక దఫాలుగా సంప్రదించి మున్సిపాలిటీతో సంబంధం లేకుండా రైల్వే అధికారులను ఒప్పించి రూ.7.50కోట్లతో మొండిగేటు నిర్మాణానికి మంజూరు చేయించామని వెల్లడించారు.ఈ పనులు



రానున్న మార్చిలో ప్రారంభిస్తామని, 11మీటర్ల మేర నిర్మించనున్నామని తెలిపారు.అప్పటివరకు గుంటూరు నగరంలో డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని,ప్రజలు సహకరించాలని కోరారు.స్థానిక వినోభానగర్ ఆర్ అండ్ బి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని దీనికోసం ఆర్ అండ్ బి శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిని కలిశామని తెలిపారు.ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని బాద్యతగా తీసుకొని పని చేస్తున్నామని స్పష్టం చేశారు.అధికారం చేపట్టిన మొదటిరోజు నుంచే ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడుతున్నామని వెల్లడించారు.

## 'విద్యతోనే విజ్ఞానం అలవడుతుంది'



పెనమలూరు,సెప్టంబర్13 ప్రభాతవార్త : విద్యయే విజ్ఞాన మని విజ్ఞానం మనిషి మేధస్సుని సమాజం,సంఘం పట్ల బాధ్యుడ్ని చేసి తనతోపాటు వందల మంది విద్యార్థులను విద్యావేత్తలుగా తీర్చిదిద్దుతుందని రీజనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రమేష్ బాబు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ఎంఎడ్ స్ ప్రోస్పెరిటీ అసోసియేషన్ ఆధ్వర్యం లో వై.వి.రావు కాలేజ్ నందు శనివారం బెస్ట్ టీచర్స్ డే అవార్డ్ ప్రదానోత్సవం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన రమేష్ బాబు ప్రవచనాలలో కాకుండా ఆచరణలో గురువు స్థానం పదిలంగా ఉండాలని సూచించారు. గౌరవ అతిధి ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఇటువంటి బెస్ట్ టీచర్ అవార్డులు భాధ్యతను పెంచుతాయి అని ఆకాంక్షించారు. విశిష్ట అతిధి రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సబ్జెక్ట్ పైన పట్టు నిబద్ధత ఉండడం తో పాటు విద్యార్థులకు తగిన ప్రేరణ ఇచ్చే వారిగా ఉండాలని తెలియచేసారు. మరో అతిధి శేషశ్రీ మాట్లాడుతూ విద్య విలువను పెంచుతుంది అని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించిన విద్యావేత్తలకు ప్రభుత్వాలు సరైన సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూర్తి, శ్యాంబాబు, వీరలక్ష్మి, నిర్మల, కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీశివ పంచాయతన మఠం శివాలయ క్షేత్రంలో సహస్ర మోదక గణపతి, సుబ్రహ్మణ్యస్వామి శాంతి హోమం

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :జగ్గయ్యపేట పట్టణంలోని పాలేటి ఒడ్డునగల శ్రీశివ పంచాయతన మఠం శివాలయ క్షేత్రంలో శనివారం సహస్ర మోదక గణపతి హోమం, సహస్ర



సంఖ్యావల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి శాంతి హోమాలను శాస్త్రోక్తంగా భక్తిప్రపత్తులతో నిర్వహించారు. శ్రీగురుధామ్ వ్యవస్థాపకులు, ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ ఆదేశానుసారం కంచికామకోటి పీఠం ఆస్థాన సిద్ధాంతి లక్కావఝ్జల విజయ సుబ్రహ్మణ్యం సిద్ధాంతి నిర్ధేశించిన ముహూర్తకాలంలో ఆలయ అర్చకులు ఘట్టి సాయిశర్మ పర్యవేక్షణలో హోమాలు, పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈకార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని సేవించారు.

## దసరా మామూళ్ళకోసం వేధిస్తున్నారని ట్రాన్స్‌జెండర్లపై వ్యాపారుల ఫిర్యాదు

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త : విజయదశమి మహోత్సవాలు (దసరా) ప్రారంభం కానుండగా మామూళ్ళకోసం ట్రాన్స్‌జెండర్లు వేధిస్తున్నారని పలువురు పట్టణ వ్యాపారులు శనివారం ఎస్ఐ రాజుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. బంగారం వ్యాపారుల దుకాణాలకు వచ్చి భారీ మొత్తంలో డబ్బు డిమాండ్‌చేయటమే కాకుండా ఇవ్వకపోతే అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, అమర్యాదకరంగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. ట్రాన్స్‌జెండర్ల వేధింపుల నుండి తమను కాపాడాలని పోలీసులను కోరారు. ఈసమస్యపై విచారణ చేసి న్యాయం చేస్తామని ఎస్ఐ రాజు వ్యాపారులకు హామీ ఇచ్చారు.



## రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌లో జగ్గయ్యపేట నుండి ఇరువురికి చోటు



జగ్గయ్యపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గం నుండి ఇరువురికి చోటు లబించింది. జగ్గయ్యపేట పట్టణ స్వర్ణకార సంఘ అధ్యక్షులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బిసి సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కర్రి శేషగిరిరావు (చిన్నా), పెనుగంచిప్రోలు ప్రాంతం నుండి జనసేన పార్టీ నాయకులు తునికిపాటి శివలను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈసందర్భంగా పలువురు కూటమి నేతలు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు చిన్నా, శివలను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తమకు కార్పొరేషన్‌లో పదవి కల్పించటంపట్ల చిన్నా, శివ స్థానిక, జిల్లా రాష్ట్ర కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్య ఏదైనా సహాయానికి 112 డయల్ చేయండి

### ఎన్‌టిఆర్ జిల్లా సిపి రాజశేఖర్ బాబు



ఎ కొండూరు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలో తిరువూరు ఎ కొండూరు విసన్నపేట గంపలగూడెం మండలాల్లోని ప్రజలకు మహిళలకు యువతీ యువకులకు సమస్య ఏదైనా సహాయం కోసం ఆపదలో 112 నెంబర్‌కు కాల్ చేయాలని సిపి ఎస్‌వి రాజశేఖర్ బాబు ఆదేశించారు.ఆపదకాలంలో అందగా నిలిచి నమ్మకం భద్రత సేవ సహాయం అందించడానికి పోలీస్ శాఖ ఎల్లవేళలా సిద్దంగా ఉన్నట్లు సిపి రాజశేఖర్ బాబు తెలిపారు. మీ భద్రతే మా బాద్యత అని ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ రాజశేఖర్ బాబు భరోసా కల్పించారు.

## చెరువును తలపిస్తున్న తిరువూరు బస్టాండ్ !

ఎ కొండూరు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త : ఎపిఎస్సార్టీసి ఎన్టీఆర్‌జిల్లా తిరువూరు బస్టాండ్ భారీ దంచుడు వానలకు చెరువును తలపిస్తుంది. దీనివల్ల ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఈ బస్టాండ్ ఏర్పడి సుమారు 70 సంవత్సరాలు కావస్తున్నా బస్టాండ్ వర్షాలకు చెరువును తలపించడం మోకాళ్లలోతు నీళ్లలో దిగి బస్సులు ఎక్కడానికి బస్టాండ్ బైట స్టాండ్ నుండి లోపలకు వెళ్లటానికి మహిళలు వృద్దులు సీనియర్ సిటీజన్లు వికలాంగులు తదితర ప్రయాణీకుల పరిస్థితి వర్ణనాతీతం. ఈ బస్టాండ్‌తో పాటు ప్రధాన రహదారిపై పొంగిపొర్లుతున్న వరద నీటితో వాహన చోదకులు పాదచారుల పరిస్థితి అయోమయంగా వుంది. ఇకనైనా ఆర్టీసి బస్టాండ్‌లో వరద నీరు నిల్వ లేకుండా బైటకు వెళ్లే విదంగా చర్యలు తీసుకుని తమ కష్టాలను గట్టెక్కించాలని ఆంధ్ర తెలంగాణ రాష్ట్ర ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



## డయేరియా సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డాక్టర్ వేముల స్వాతి



ఎ కొండూరు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండల ప్రాంత ప్రజలు ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తాగునీరు కలుషితమై డయేరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని డయేరియా సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎ కొండూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపిహెచ్‌సి డాక్టర్ వేముల స్వాతి కోరారు. ఈ సందర్భంగా విరోచనాలు కడుపులో నొప్పి వాంతులు, నీరసం డీహైడ్రేషన్ తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే డయేరియాగా గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపిహెచ్‌సిల్లో చికిత్స పొందాలని డాక్టర్ స్వాతి కోరారు. శుభ్రమైన కాచి చల్లార్జిన నీరు తాగాలని నివాస గృహాల చుట్టూ నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. వాటర్ ట్యాంకులను శుభ్రంగా క్లోరినేషన్ చేయాలని మంచినీటి పాత్రలపై మూతలు పెట్టాలని ఆహారం తినే ముందు తర్వాత చేతులు సబ్బుతో పరిశుభ్రంగా కడగాలని వేడిగా ఫ్రెష్‌గా ఉన్న ఆహార పదార్థాలను భుజించాలని డాక్టర్ స్వాతి పేర్కొన్నారు. చిన్నారులకు తల్లిపాలనే తాగించాలని వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల శుభ్రత పాటించాలని డయేరియా పట్ల నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు పాటించి నివారణకు కృషి చేయాలన్నారు డ్రైడే ఫ్రైడే ఫీవర్ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని డయేరియా రాకుండా నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ స్వాతి సిబ్బందిని కోరారు.

# వైద్యసిబ్బంది నిర్లక్ష్యం - చిన్నారికి సంకటం!

కారంపూడి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త: వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో చిన్నారి పరిస్థితి సంకటంగా మారిన ఘటన కారంపూడి మండల పరిధిలోని చక్రాయపాలెంలో చోటుచేసుకుంది. వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతో ఏడాదిన్నర వయసున్న చిన్నారి ఆసుపత్రి పాలై ప్రాణాపాయస్థితిని ఎదుర్కొన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వైద్యసేవలపై తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి.





చక్రాయపాలెంకు చెందిన కేతావత్ అంజినాయక్, ఆదిలక్ష్మి దంపతులకు ఝాన్సీ మహేశ్వరి ఏడాదిన్నర వయసున్న చిన్నారి ఉంది. ఈ నెల 6న చక్రాయపాలెం సచివాలయంలో టీపీటీ టీకా ఇవ్వగా, టీకా అనంతరం వచ్చే జ్వరం తగ్గించేందుకు అవసరమైన సిరప్ ఇవ్వకపోవడంతో చిన్నారి పరిస్థితి విషమించిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిరప్ ఇవ్వకపోవడం వల్ల అధిక జ్వరం రావడం, తర్వాత ఫిట్స్ రావడంతో నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడి వైద్యులు కూడా ఇదే కారణంగా చిన్నారికి సమస్యలు తలెత్తాయని తెలిపారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. రెక్కాడితే డొక్కాడని పరిస్థితి. ప్రైవేటు ఆసుపత్రిలో రూ.30 వేలు దాకా ఖర్చయినట్లు బాధితుడు తెలిపాడు. ఈ డబ్బులు ఎవరిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క సిరప్ ఇవ్వాలని తల్లి ఎన్నిసార్లు అడిగినా వైద్యసిబ్బంది పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఇలా జరిగిందని వారు వాపోయారు.

**చిన్నారుల ఆరోగ్యంపై ఇంత నిర్లక్ష్యమెందుకు?**

టీకా ఇచ్చిన వెంటనే అవసరమైన మందు ఇవ్వకపోవడం వల్లే మా పిల్ల ప్రాణాపాయానికి గురైంది. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చిన్నారి తండ్రి అంజినాయక్ స్పష్టం చేశారు. ఇంతనిర్లక్ష్యానికి కారణమైన వైద్యసిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ప్రాణానికి ముప్పు తలెత్తేలా వ్యవహరించిన వైద్యులపై విచారణ చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**వైద్యాధికారి వివరణ:** ఈ ఘటనపై కారంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్యను వార్త పత్రిక రిపోర్టర్ ఫోన్లో వివరణ కోరగా సిరప్ ఇవ్వని మాట వాస్తవమే అయినప్పటికీ, డీపీటీ టీకా వల్ల 105 జ్వరం వచ్చే అవకాశమే లేదన్నారు. ప్రైవేటు ఆసుపత్రిలో చూపించిన రిపోర్ట్స్ చెక్ చేస్తామని అడిగితే ఇవ్వలేదని తెలిపారు.

## కారంపూడిలో నేడు ఎంఎన్ హాస్పిటల్ ప్రారంభం

కారంపూడి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కారంపూడిలో ఆదివారం ఎంఎన్ హాస్పిటల్ ప్రారంభోత్సవం జరుగుతుందని డాక్టర్ శంతన్ శనివారం తెలిపారు. పల్నాడు ప్రాంత





ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లకుండా కారంపూడిలోనే అత్యంత ఆధునిక వైద్యపరికరాలతో వైద్యం అందించనున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా అధికారులకు ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రాలను డాక్టర్ శంతన్, చల్లా వెంకటేశ్వర్లు అందజేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## మంచినీటి బోరు వద్దకు చేరుతున్న మురుగునీరు

తాడేపల్లి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త : ఇప్పటంలో గ్రామస్థులకు అందించే మంచినీటి బోరు వద్దకు మురుగునీరు. అసలే జ్వరాల సీజన్ అందులోనూ మంచినీటిలో మురుగునీరు కలుషితంతో ఏ





వ్యాధులతో ఇబ్బంది పడాల్సి వస్తుందో అని భయాందోళనలో స్థానికులు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిదిలో అధికారులకు సమాచారం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఈ మురుగునీరు కాల్వ మంచినీటిలో కలిస్తే ఎన్ని అనారోగ్యాలు వస్తాయోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం.. అందులోనూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిత్యం కంటికి కనిపిస్తున్న అనారోగ్య కేసులు. కానీ ఎందుకింతటి అలసత్వమో దేనికి సంకేతాలో అని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారం చేస్తారా లేక పరిస్థితి చేయిదాటాక సరిదిద్దుబాటు చర్యలకు సిద్ధం అవుతారో అని కొందరు గ్రామస్థులు వాపోతున్నారు.

## దేవతి భగవన్నారాయణకు అభినందనలు తెలిపిన తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్

తాడేపల్లి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలో ఆర్యవైశ్య జాతిపిత టి.జి. వెంకటేష్ చేతుల మీదుగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ విభాగాధ్యక్షునిగా నియమితులైన ప్రముఖ వ్యాపారవేత్త, సేవాతత్పరుడు, స్నేహశీలి దేవతి భగవన్నారాయణను బిజేపి ఓబిసి మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్ మంగళగిరిలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు



తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ నిరాడంబర స్వభావం కలిగిన భగవన్నారాయణ ఆర్యవైశ్య సమాజాభివృద్ధి, రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ప్రయోజనాల సాధన కోసం కృషి చేస్తారని మేము విశ్వసిస్తున్నాం. ఈ పదవి రావడం సమాజానికి ఎంతో ఆనందదాయకం అని అన్నారు.

## విశ్వకర్మ జయంతి యజ్ఞోత్సవాన్ని జయప్రదం చేయాలి

తాడేపల్లి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త : గుంటూరు జిల్లా రాజధాని అమరావతి ఉద్దండ్రాయుని పాలెంలో ప్రధాని నరేంద్రమోడీ భూమిపూజ చేసిన ప్రదేశంలో ఈనెల 17వ తేది బుధవారం, భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో "సృష్టి" పేరుతో విశ్వకర్మ జయంతి యజ్ఞోత్సం జరగనుంది. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుంటూరు జిల్లాలోని విశ్వబ్రాహ్మణ కులాలు, చేతివృత్తుల వర్గాలు, అమరావతి ప్రజలు, రాజధానికి భూములిచ్చిన రైతులు ముందుకు



రావాలని ఓబిసి జిల్లా అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్ పిలుపు నిచ్చారు. "విశ్వకర్మ సృష్టి కర్త, ప్రతి సాధనాన్ని రూపుదిద్దిన మహర్షి, అలాంటి విశ్వకర్మ జయంతిని జరుపుకోవడం ప్రతి ఒక్కరికి గర్వకారణం, విశేషంగా అదే రోజున ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం కావడం ఆనందకరమైన సంగతే" అని రామకృష్ణ యాదవ్ అన్నారు. బిజేపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాలతో, ఓబిసి రాష్ట్ర అధ్యక్షులు రొంగుల గోపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ యజ్ఞోత్సవం జరుగుతుందని, కేంద్ర రాష్ట్ర మంత్రులు, పార్టీ పెద్దలు హాజరుకానున్నారని రామకృష్ణ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టిసీ సెల్ కోకన్వీనర్ కే. హేమసుందర్, బిజేపి మందడం మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, ఓబిసి జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మనబోయిన రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నదికి పెరిగిన వరద..లంకవాసులు అప్రమత్తంగా ఉండాలి: తహాశీల్దార్

కొల్లిపర, సెప్టెంబరు 13 ప్రభాతవార్త: ఎగువన కురుస్తున్న వర్షాలకు నదికి మరలా వరద ఉధృతి పెరిగింది. ప్రకాశం బ్యారేజీ నుండి 92 వేల 931 క్యూసెక్కులు నీటిని కృష్ణానది దిగువకు విడుదల చేయటంతో మండల యంత్రాంగం అప్రమత్తం అయ్యారు. కొల్లిపర తహాశీల్ధార్ గుమ్మడి సిద్ధార్ధ లంకవాసులు అప్రమత్తంగా



ఉండాలని హెచ్చరించారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేసారు. పడవ నడిపే జాలర్లు తగిన జాగ్రత్తగా ఉండాలన్నారు. వరద ఉధృతి తగ్గేవరకు కృష్ణానది రేవుల్లో ప్రతి ఒక్క విఆర్ఓ డ్యూటి చేయాలన్నారు.

## కొల్లిపరలో భారీవర్షం..రహదారులు జలమయం

కొల్లిపర, సెప్టెంబరు 13 ప్రభాతవార్త: వాతావరణంలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుని మండలంలో భారీవర్షం కురవటంతో రోడ్లన్ని జలమయమయ్యాయి. దావులపాలెం, దావులూరు, శిరిపురం, చివలూరు, తూములూరు, వల్లభాపురం, మున్నంగి తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు నీటితో నిండటంతో పాటు పల్లపు ప్రాంతాలలో ఉన్న గృహాల వద్ద నీరు అధికంగా చేరటంతో గృహాలలో నుంచి బయటకు రావటానికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొల్లిపర శివాలయం వద్ద నుండి గ్రామ పంచాయతీ వరకు రోడ్డుపై అధికంగా నీరు చేరటంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడ్డారు. తూములూరు ఎస్సీ కాలనీలో గృహాల చుట్టూ వర్షపునీరు చేరటంతో గంటల తరబడి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు.. ప్రధాన రహదారులు సైతం నీటిలో నిండిపోగా డ్రైన్లు పొంగి ప్రవహించాయి. మూడు గంటల సేపు ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురవటంతో జనజీవనానికి అంతరాయం కలిగింది.







## అబద్ధాలు,మోసాలతో ప్రజలను మోసగించడమే జగన్ నైజం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, సెప్టెంబర్13, ప్రభాతవార్త: వెయ్యి అబద్దాలు, లక్ష మోసాలతో ప్రజలను మోసగించడమే జగన్‌కు తెలిసిన పాలన అని మాజీమంత్రి, శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ అలాంటి పాలనను ప్రజలు మరలా



అనుభవించడానికి సిద్ధంగా లేరని వైసిపి నేత సజ్జల గ్రహించాలని ప్రత్తిపాటి తెలిపారు. గతంలో ప్రజారాజధాని అమరావతిపై విషం చిమ్మిన వైసిపి నాయకత్వ పడగనీడలో ఉండటానికి రాజధాని వాసులు, రాష్ట్ర ప్రజలు ఎప్పటికి అంగీకరించరని అన్నారు. రాజధాని మహిళలు, రైతులే లక్ష్యంగా సాగించిన అమానుషాలకు జగన్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఐదేళ్ల వైసిపి నేతల ప్రచారం చేసిన కమ్మరావతి, ఎడారి, స్మశానం, పందులు తిరిగే ప్రదేశం నుంచి మరలా పాలన ఎలా చేస్తారో సజ్జల చెప్పాలని ప్రత్తిపాటి అన్నారు. 2026లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీకి వెనుకాడుతున్న జగన్, మరలా అధికారంలోకి వస్తాడనటం సజ్జల పిచ్చితనమని అన్నారు. జగన్, అమరావతిపై వైసిపి నేతల అంతరాంతరాలలో దాగిఉన్న కపట, క్రూరత్వాలు దాచాలంటే దాగేవి కావని సజ్జలకు తెలుసునని అన్నారు. ఏ రోటికాడ ఆ పాటపాడటం, ఏ అవసరానికి ఆ గొడుగు పట్టే దుర్మార్గుల పాలనతో సర్వం కోల్పోయిన ప్రజలు వారికి ఎప్పటికి అధికారం కట్టిబెట్టరని సజ్జల గ్రహిస్తే మంచిదని అన్నారు.

**ఐదేళ్ల అవినీతితో జగన్ ప్రపంచస్థాయి స్కామ్‌స్టర్‌గా పేరు:**

ఐదేళ్లలో రాష్ట్రాన్ని లూఠీచేసి, ప్రజలను అప్పులపాలుచేసి, షెల్‌కంపెనీలు, నమ్మినబంట్ల ద్వారా తరతరాలకు సరిపడా సొత్తును దేశం దాటించిన జగన్ పాలన ప్రపంచంలోనే అవినీతిపరులకు ఒక కేస్‌స్టడీ అని ప్రత్తిపాటి తెలిపారు. అందుకే జగన్ ఇప్పటికి ప్రపంచస్థాయి స్కామ్‌స్టర్‌గా పేరు గడించారని అన్నారు. అవకాశవాద, విధ్వంసకర రాజకీయాలకు అసలైన ప్రతినిధి జగన్ అని అన్నారు. చూసినవారు అహ అంటారంటున్న మెడికల్ కాలేజీలలో ఎన్ని ప్రవేశాలు జరిగాయో, కన్వీనర్ కోటాలో ఎందరు ఎస్‌సి, బిసి, మైనారిటి విద్యార్థులకు సీట్లు ఇచ్చారో జగనే చెప్పాలని అన్నారు. రాజధానిని నిర్మించడం, మెడికల్ కాలేజీలు కట్టటం అంటే రుషికొండ ప్యాలెస్, పార్టీ కార్యాలయాలు కట్టినంత తేలిక కాదని జగన్ తెలుసుకోవాలని అన్నారు. పిపిపి విధానం లేకుండా ఏ దేశం, ఏ రాష్ట్రంలో నిర్మాణాలు జరుగుతున్నాయో జగన్ చెప్పాలని అన్నారు. మరలా జగన్ గెలవడం మిధ్య, ఆంధ్రుల రాజధానిగా అమరావతి నిలవడం తధ్యం, జగన్‌కు మరలా అవకాశం ఇస్తే అమరావతితో సహ, రాష్ట్రమే ప్రపంచ పటంలో కనుమరుగవుతుందని ప్రజలకు తెలుసునని ప్రత్తిపాటి వివరించారు.

## సాంబయ్యకు నివాళులర్పించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట, సెప్టెంబర్13, ప్రభాతవార్త: మండలంలోని వేలూరు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు వూట్ల సాంబయ్య ఇటీవల మరణించారు. కాగా ఆయన పెద్దకర్మను వారి నివాసంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ పాల్గొని సాంబయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. రాజశేఖర్‌తో పాటు నార్నె హనుమంతరావు, బొంతా తిరుపతయ్య, కంతేటి హనుమంతరావు, పావులూరి వెంకటేశ్వర్లు, కందిమళ్ల సుబ్బారావు, కట్టా హరిబాబు, కక్కెర శ్రీనివాసరావు, ఎలికా శ్రీనివాసరావు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



## చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 25 వేల విత్తనాలతో మట్టితో బాల్స్ తయారీ

చిలకలూరిపేట, సెప్టెంబర్13, ప్రభాతవార్త: చిలకలూరిపేట రోటరిక్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ డైరెక్టర్ దండా లక్ష్మీనారాయణ చిలకలూరిపేట పరిసర ప్రాంతాలలో వేప, చింత, నేరేడు, ద్రాక్ష, పుచ్చ, సపోట విత్తనాలను 25వేలు సేకరించారు. ఈ విత్తనాలను సీడ్‌బాల్స్‌గా పలు పాఠశాల విద్యార్థిని,





విద్యార్థులతో తయారుచేయించి వాటిని కొండవీటి కొండ, కోటప్పకొండ పరిసర ప్రాంతాలలో వీటిని చల్లడం ద్వారా మొక్కలను పెంచే దానికి కృషి చేస్తున్నామని శనివారం పట్టణంలోని చైతన్యలిటిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దండా లక్ష్మీనారాయణ వివరించారు. చైతన్యలిటిల్స్ విద్యార్థులు 15వేల విత్తనాలను మట్టితో బాల్స్‌గా



తయారుచేశారు. అదేవిధంగా గణపవరం కెల్లంపల్లి భద్రాచలం హైస్కూల్ విద్యార్థిని, విద్యార్థులు 10వేలు విత్తనాలను మట్టితో బాల్స్‌గా తయారుచేశారు. వీటన్నింటిని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో చిలకలూరిపేట ప్రాంతంలోని ఖాళీ ప్రదేశాలు, రోడ్ల ప్రక్కన వీటిని చల్లి వృక్ష సంపదను పెంచేందుకు రోటరి తరుపున కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట రోటరిక్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాద్, చైతన్యలిటిల్స్ ప్రిన్సిపల్ డివి లక్ష్మీ, ఎట రామకృష్ణ, పాఠశాలకు చెందిన విద్యార్ధిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## నాదెండ్ల తహాశీల్దార్ చంద్రశేఖర్ బదిలీ

నాదెండ్ల, సెప్టెంబర్13, ప్రభాతవార్త: నాదెండ్ల మండల తహసిల్దార్‌గా పనిచేస్తున్న ఎస్ చంద్రశేఖర్ అచ్చంపేట తహసిల్దార్‌గా బదిలీ అయ్యారు. నాదెండ్ల ఇన్‌చార్జి తహసిల్దార్‌గా డిప్యూటి తహసిల్దార్‌గా ఉన్న షేక్ సల్మాన్‌కు ఇన్‌చార్జి తహసిల్దార్‌గా ఉన్నతాధికారులు భాధ్యతలు అప్పగించారు.

## ప్రధాని నరేంద్రమోడీ జన్మదినోత్సవం సందర్భంగా పక్వాడ్ పక్షోత్సవ సమావేశం

చిలకలూరిపేట, సెప్టెంబర్13, ప్రభాతవార్త: ప్రధాని నరేంద్రమోడీ జన్మదినోత్సవం సందర్భంగా శనివారం బిజెపి కార్యాలయంలో సేవాపక్వాడ్ పక్షోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న మైలవరపు సుబ్బారావుని చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్‌చార్జిగా



నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్షోత్సవాలలో బాగంగా ఏ రోజున ఏఏ కార్యక్రమాలు చేపట్టాలో వివరించారు. ఈ కార్యక్రమాలలో బాగంగా ఉచిత వైద్యశిబిరాలు, క్రీడా ఉత్సవాలు, రక్తదాన శిబిరాలు, కేంద్ర ప్రభుత్వ స్కీమ్‌లు, చిత్రలేఖనం పోటీలు, ప్రధాని మోడీ జీవితచరిత్రపై, బిజెపి పార్టీ సిద్దాంతాల గురించి ప్రజలలోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సింగరేసు పోలయ్య, జిల్లా కార్యదర్శి గట్టా హేమకుమార్, బిజెపి నాయకులు మాచర్ల శ్రీనివాసరావు, ఉప్పాల భాస్కరరావు, వరికూటి నాగేశ్వరరావు, రావికింది రామకృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా సాంబశివరావు

చిలకలూరిపేట, సెప్టెంబర్13, ప్రభాతవార్త: పట్టణంలోని కళామందిర్ సెంటర్ వద్దనున్న శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా 18వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మేకనబోయిన సాంబశివరావు నియమితులయ్యారు. ధర్మకర్త మండలి సభ్యులుగా కృష్ణమూర్తుల లక్ష్మీనారాయణ, చిరుమెళ్ల శ్రీనివాసరావు, ఆవుల వెంకటేశ్వర్లు, నాయుడు వరలక్ష్మీ, తెప్పలి కాసులు, సంగిశెట్టి నాగజ్యోతి, గొర్రెపాటి సుభాషిణి, పొత్తూరి వెంకటలక్ష్మీలు నియమితులయ్యారు.

# జలదిగ్బంధంలో కొలకలూరు బీసీ కాలనీ

### -అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు పలు ప్రమాదాలు
### -మాగోడు ఆలకించండి మహాప్రభో అంటూ స్థానికుల వేడుకోలు

తెనాలి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త : అసలే పల్లపు ప్రాంతం నిత్యం సైడు కాలవల సమస్యతో సతమతమవుతూ నిరంతరం కొలకలూరు బీసీ కాలనీ వాసులు వ్యాధులకు గురవుతూ అనేక కష్టాలకు పాలవుతూ ఉంటారు. వివరాల్లోకి వెళితే తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన బీసీ కాలనీ పల్లపు ప్రాంతం కావడంతో గ్రామంలోని మురుగు నీరంతా బీసీ కాలనికీ చేరి కాలువలు లేకపోవడంతో







వర్షపు నీరు, గ్రామం నుండి వచ్చే నీరు కానీ వాటికై అవి ఎండిపోతే తప్ప బయటకి వెళ్ళే మార్గం లేదని కొలకలూరు బీసీ కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఇంకుడు కాలువలు మంజూరైనట్లు మండల అధికారుల పర్యవేక్షణలో కాలనీలో ప్రధాన రహదారులకు ఒకవైపు డ్రైనేజి కోసం భారీగా తవ్వించి ఇంకుడు కాలువలను ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలియపరిచారని, అయితే ఇది నల్లరేగడ ప్రాంతమని ఆరు అడుగులు తీస్తే నీటి ఊట బయటకు వస్తుందని, ఇసుక ప్రాంతంలో ఇంకుడు కాలువల తప్ప ఇలాంటి నల్లరేగడ ప్రాంతంలో ఇంకుడు కాలువలు ఉపయోగపడవని సంబంధిత అధికారులకు బీసీ కాలనీ వాసులు ఎంత గగ్గోలు పెట్టినా ఇది మంత్రి మనోహర్ ఆదేశమని మీరు ఎంత అడ్డం తిరిగినా ఇంకుడు కాలువలను ఏర్పాటు చేయక తప్పదని సంబంధిత కొలకలూరు పంచాయితీ, మండల అధికారులు కాలనీ వాసుల గోడు పట్టించుకోలేదన్నారు. ఇంకుడు కాలువల మరమ్మత్తులకై తీసిన కుంటలను సకాలంలో పూర్తి చేయలేకపోవటంతో భారీ వర్షాలకు రోడ్లు నిండిపోయి ఇంకుడు కాలువ కొరకు తీసిన లోతు కాలువ కూడా నీటిలో సమానంగా కలిసిపోవడంతో, కాలనీలో స్కూలు పిల్లలు, వృద్దులు, మహిళలు ఎటు నడవాలో తెలియక కాలువలో పడిపోయి ప్రమాదాలకు గురి అవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా కొలకలూరు బీసీ కలనీ వాసులపై అధికారుల నిర్లక్ష్య ధోరణి మానుకుని ప్రతి మాటకు మంత్రి మనోహర్‌పై సాకులు చెప్పటం తగదని, జనసేన గెలుపుకి కాలనీ వాసులు ఎంతో కృషి చేశారని, అలాంటి కాలనీ వాసులపై పక్షపాతం తగదని, ప్రజలు కోరుకున్నదే అధికారులు చేయాలి కానీ ప్రజలను వ్యతిరేకించ తమకు తోచినట్లుగా పనులు చేసేది అభివృద్ధి అని చెబితే ప్రజలు సహించే రోజులు పోయాయని, ఏది ఏమైనా కొలకలూరు గ్రామం బీసీ కాలనీ పట్ల సంబంధిత అధికారులు స్పందించి కాలువల మరమ్మత్తులకై తక్షణ చర్యలు తీసుకుని డ్రైనేజీ ద్వారా కాలనీలో నుండి నీరంతా బయటకు వెళ్ళే మార్గం చూపాలని తెనాలి శాసన సభ్యులు మరియు మంత్రి మనోహర్ కాలనీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, డ్రైనేజీ కొరకు తీసినం భారీ లోతు కాల్వలను దాటలేక వృద్దులు మహిళలు, పిల్లలు పలు ప్రమాదాలకు గురవుతున్నారని తక్షణమే స్పందించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చివుకులను సన్మానించిన టిడిపి పార్లమెంట్ మహిళా సంఘం

బాపట్ల, సెప్టెంబర్13, ప్రభాతవార్త: బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గా చివుకుల దుర్గాప్రసాద్ శాస్త్రి ఎంపిక అవడం సంతోషదాయకమని బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ అన్నారు. పట్టణంలోని చివుకుల శాస్త్రీ స్వగృహంలో శనివారం దుర్గాప్రసాద్‌కు చిరు సత్కార



కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేట్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చివుకుల దుర్గాప్రసాద్ శాస్త్రి మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పల్లం సరోజిని మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పధవులు అధిరోహించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, పార్లమెంట్ మహిళా కార్యదర్శి కూచిపూడి ఝాన్సీ రాణి, సీనియర్ నాయకురాలు గిరిజారాణి, షేక్ నజ్మా , మస్తాన్ బి , పద్మ మహిళా నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## కక్షిదారులకోసమే జాతీయ లోక్ అదాలత్: జిల్లా న్యాయమూర్తి

తెనాలి టౌన్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు పర్యవేక్షణలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి శ్రీధర్, అడిషనల్ సివిల్ జడ్జి షేక్ షరీఫ్, రెండో అదనపు సివిల్ జడ్జి రాజశేఖర్ లు కలిసి కేసుల విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు మాట్లాడుతూ, జాతీయ లోక్ అదాలత్ భారత న్యాయవ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగమని, ఇది కేసుల పెండింగ్ లను తగ్గించడంతోపాటు, కక్షి దారుల సమయం మరియు డబ్బును ఆదా చేస్తుందని, మరియు వివాదాల యొక్క సామరస్య పూర్వక పరిష్కారాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. కోర్టు వెలుపల వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవటానికి లోక్ అదాలత్ ఉద్దేశించబడిందని, దీని ద్వారా ఆస్తి హక్కులు కోరటం, ఆర్థిక వివాదాలు మరియు వైవాహిక సమస్యలు వంటి కుటుంబ వివాదాలను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షి దారులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం స్పందించాలి, ఆయేషామీరా తల్లిదండ్రుల వినతి

తెనాలి టౌన్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త): పట్టణంలోని పాండురంగ పేటకు చెందిన బిఫార్మసి విద్యార్థిని ఆయేషామీరా హత్యకేసులో ప్రభుతం కూడా స్పందించాలని, ఆయేషామీరా తల్లిదండ్రులు ఇక్బాల్ బాషా, శంషాద్ బేగం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా సీబిఐ తమకు పంపిన నోటీసులను తిరస్కరించినట్లు తెలిపారు. కేసు విచారణ ముగిసిందంటూ సిబిఐ కోర్టుకు సీల్డ్ కవర్లో



నివేదిక పంపిందని కానీ ఆ నివేదిక ఇంతవరకు తమకు అందించలేదని వారు ఆరోపించారు సిపిఐ ద్వారా కూడా తమకు న్యాయం జరగలేదని, కావున ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, హోం మంత్రి, డిజిపి, స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. గత 18 ఏళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నామని, ఇంకా ఎన్నిసార్లు మమ్మల్ని కోర్టులు చుట్టూ తిప్పుతారని, వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిడ్డను కోల్పోయి ఆవేదనలో ఉన్న తమకు ఈనాటికి న్యాయం జరగకపోగా తిరిగి తమనే కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని బాధితులైన తమను కోర్టులు చుట్టూ ఎన్నిసార్లు తిప్పుతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసలైన నిందితులను నేటికీ గుర్తించలేక, కేసును నీరుగారు స్తున్నారని వారు వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, తమకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి, అసలైన నిందితులను శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

## కోడెల కాంస్య విగ్రహాన్ని రూపొందించిన సూర్య శిల్పశాల



తెనాలి టౌన్ సెప్టెంబర్ 13, ప్రభాతవార్త: నవ్యంధ్రప్రదేశ్ తొలిసభాపతి గా పనిచేసిన, దివంగత నేత, డాక్టర్ కోడెల శివప్రసాద్ కాంస్య విగ్రహన్ని, పట్టణానికి చెందిన, సూర్య శిల్పశాలలో రూపుదిద్దుకుంది. ఈ విగ్రహాన్ని వినుకొండ శాసనసభ్యులు జివి. ఆంజనేయులు ఆధ్వర్యంలో కోడెల శివప్రసాద్ ఆరవ వర్ధంతి సందర్భంగా వినుకొండలో ఆవిష్కరించనున్నారని, శనివారం విగ్రహాన్ని వినుకొండకు తరలిస్తున్నామని, సూర్య శిల్పశాల అధినేత కాటూరి వెంకటేశ్వరరావు, అయన తనయుడు, యువశిల్పి కాటూరి రవిచంద్ర తెలిపారు. నరసరావుపేటలో ఆవిష్కరించబడిన కోడెల శివప్రసాద్, తండ్రి కోడెల సంజీవయ్య కాంస్య విగ్రహాన్ని కూడా తామే రూపొందించామని శిల్పులు తెలిపారు.

## తెనాలిలో ఉరుములతో కూడిన భారీవర్షం

తెనాలి టౌన్ సెప్టెంబర్ 13, ప్రభాతవార్త: పట్టణంలో శనివారం భారీ వర్షం కురిసింది.ఉదయం సాధారణంగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం నుండి ఒక్కసారిగా మారిపోయింది.ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఏకధాటిగా కురుస్తూనే ఉంది. దీనివల్ల మధ్యాహ్న సమయంలో ఇళ్లకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.అలాగే మార్కెట్లో వ్యాపారాలు నిర్వహించే చిరు



వ్యాపారులు, వర్షంలోనే తమ అమ్మకాలను కొనసాగించారు. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతలతో అల్లాడిపోయిన ప్రజలకు,ఈ వర్షం ఉపశమనం కలిగించింది.ఉరుములు మెరుపుల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. పట్టణంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను శనివారం విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించారు. సుల్తానాబాద్, ఆలపాటి నగర్లలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కారణంగా, తరచుగా లోవోల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న కారణంగా, శనివారం విద్యుత్ సిబ్బంది అడ్డుగా ఉన్నచెట్లు కొమ్మలను తొలగించారు.ఈచెట్లుకొమ్మల వలన ట్రాన్స్ఫార్మర్లు తరచూ మరమ్మత్తులకు గురవుతున్నాయి, దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, ప్రత్యేక సిబ్బంది ద్వారా ఈ పనులు చేపట్టారు.

## జిజిహెచ్‌లో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని ఆకస్మిక తనిఖీ

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త : జిజిహెచ్‌లో కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.పారిశుద్ధ్య సమస్యలు ఎందుకు రిపీట్ అవుతున్నాయి.చిన్న చిన్న ట్యాంకర్లు ఏర్పాటుచేసుకుంటే టాయిలెట్ల దగ్గర ఇబ్బంది ఉండదని మంత్రి అన్నారు.చికిత్స నిమిత్తం వచ్చిన ప్రజలను నేరుగా కలుసుకొని వారి సమస్యలను అడిగి



తెలుసుకున్నారు.అలాగే జిజిహెచ్‌లో సౌకర్యాలను,ఎక్విప్‌ఎంట్,వైద్యుల పనితీరును తదితర ఏర్పాట్లపై రోగులనుండి అభిప్రాయాలు అడిగారు.శానిటరీ సమస్యలు,మరుగుదొడ్లలో ఇబ్బందులున్నాయని రోగులు విన్నవించగా సూపరింటెండెంట్ డాక్టర్ రమణ తో పాటు శానిటరీ సిబ్బందిని వెంటనే పిలిపించిన డాక్టర్ పెమ్మసాని ఆయా సమస్యలకు తగిన పరిష్కారాలను వివరించారు.పెండింగ్‌లోఉన్నబకాయిలు రానుందన కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయలేకపోతున్నామని శానిటరీ అధికారులు వివరణ విన్న వెంటనే బకాయిలను వెంటనే తెప్పించాలని అధికారులకు సూచించారు.అనంతరం ఓపి ఐసియు,ఎమర్జెన్సీ,వార్డులను పరిశీలించారు.అలాగే ఇటీవల తురకపాలెంలో ఆరోగ్య సమస్యలతో జిజిహెచ్‌లో అడ్మిట్ అయిన బాధితులను కూడా ఆయన కలసి పరామర్శించారు.ఆయా రోగుల ఇబ్బందులను వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.స్వతహాగా వైద్యుడైన మంత్రి పెమ్మసాని చికిత్స విషయంలో కూడా వైద్యులకు పలు సలహాలు అందజేశారు.ఏదైనా అవసరం వచ్చిన వెంటనే తెలియజేయాలని సూపరింటెండెంట్ కు,వైద్యులకు స్పష్టం చేశారు.

## సాటిలేని మేటి నటి కళాసామ్రాజ్ఞి భానుమతి

గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త : సాటిలేని మేటి నటి, కళాసామ్రాజ్ఞి బహుముఖ ప్రజ్ఞావతి భానుమతి అని ఆమెగొప్ప నటి మాత్రే కాదుగొప్ప రచయిత్రి,దర్శకురాలు,గాయని సినీ నిర్మాత,స్టూడియో అధినేత అని ఇలా పలు ప్రతిభాపాటవాలతో ఆమె తనకు తానే సాటి



అనిపించుకుందని అవగాహన మనమూ పాడుదాం రండి బృంద సభ్యులు నివాళులర్పించారు.అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రముఖ నటి పద్మభూషణ్ డాక్టర్ భానుమతి జయంతి కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో సీనియర్ గాయనీ యార్లగడ్డ లక్ష్మీ,వి.రాజేశ్వరీ లు మాట్లాడుతూ భానుమతి మంచి రచయిత ఆమె రాసిన అత్తగారి కథలు,నాలో నేను,అత్తగారు తదితరాలు ప్రసిద్ధి చెందాయన్నారు.కార్యక్రమంలో గాయనీగాయకులు పరమేశ్వర,ప్రమీల,బాబురావులు భానుమతి పాటలు మధురంగా ఆలాపించారు.

## విద్వాన్ డాక్టర్ శారదా సుబ్రహ్మణ్యం కు గాయత్రి సంగీత విద్వన్మణి బిరుదు ప్రధానంతో సన్మానం

గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త : స్థానికలక్ష్మీపురంలోని శ్రీత్యాగరాజ కళావేదికపై శ్రీ గాయత్రి మహిళీ సంగీత సన్మండలి అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ పి.విజయ,ఎం.వై.శేషురాణి ల ఆధ్వర్యంలో శనివారం గాంధర్వామృత వర్షిణీ డాక్టర్ జి.శారద సుబ్రహ్మణ్యం విశాఖపట్నం,వారికి గాయత్రి సంగీత విద్వన్మణి బిరుదు ప్రధాన సభ అనంతరం శాస్త్రీయ సంగీత కచేరి



జరిగింది.ముఖ్యఅతిధిగా చాన్సలర్ వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజీకల్ యూనివర్సిటీ, నంబూరు వాసిరెడ్డి విద్యాసాగర్,సభాధ్యక్షులుగా మాధవపెద్ది మీనాక్షి పాల్గొన్నారు.కార్యక్రమాలను కనస్లైంట్ ఫెసియామాక్సిలరీ సర్జన్ డాక్టర్ నల్లపాటి ప్రవీణ్‌కుమార్,సంస్థవారు ఆలయ పాలకమండలి వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.అనంతరం అతిధులు సన్మాన గ్రహీత డాక్టర్ జి.శారదా సుబ్రహ్మణ్యం ను గాయత్రి సంగీత సన్మండలి బిరుదు ప్రధానంతో ఘనంగా సత్కరించారు.సభానంతరం శారదా సుబ్రహ్మణ్యం శాస్త్రీయ సంగీత కచేరి శ్రావ్యంగా జరిగింది.వీరికి వయోలిన్ పై టి.సంపత్‌కుమార్,మృదంగంపై సద్గురు చరణ్,ఘటంపై ఎం.హరిబాబు లు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు.ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరీ,మాధవపెద్ది మీనాక్షి,పాటిబండ లలితాదేవి,కార్యదర్శి ఎ.వి.మంగాదేవి,కోశాధికారి విజయలక్ష్మీ, కళాకారులను అతిధులను ఘనంగా సత్కరించారు.

## దుబాయ్‌లో మ్యాచ్ రద్దుచేయాలని కేంద్రానికి లేఖ

### శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వినోదుల నరసింహారావు

గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త : పహల్గామ్ దాడి,సిందూర్ ఆపరేషన్ నేపధ్యంలో సెప్టెంబర్ 14న దుబాయ్‌లో జరగాల్సిన మ్యాచ్‌ను రద్దుచేయాలని కేంద్రానికి శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వినోదుల నరసింహారావు ఘాటు లేఖ రాశారు.ఆసియా కప్‌లో భాగంగా భారత్,పాకిస్థాన్



దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ అనుమతి ఇవ్వడంపై ఆయన తీవ్రంగా స్పందించారు.పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడాలన్న నిర్ణయం దేశ ప్రజలకు బాధ కలిగించే అంశమని,ఇది అమానుష చర్య అని ఆయన అభివర్ణించారు.ఈ మేరకు శనివారం ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ఒక లేఖ రాశారు.పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన బారతీయుల రక్తం ఇంకా ఆరనేలేదు.పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడటం మన సైనికుల పరాక్రమాన్ని అవమానించడమే కాకుండా,కశ్మీర్ కోసం ప్రాణత్యాగం చేసిన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీతో సహా ప్రతి అమర వీరుడ్ని అగౌరవించడమే అవుతుందని ఆయన విమర్శించారు.ఒకప్పుడు రక్తం,నీళ్ళు కలసి ప్రవహించవు అని మీరే అన్నారు.మరి ఇప్పుడు రక్తం క్రికెట్ కలసి ప్రవహిస్తున్నాయా అని ప్రశ్నించారు.పహల్గామ్ ఉగ్రదాడికి పాలపడింది పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థే,ఆ దాడి 26మంది మహిళల నుదుటి సింధూరాన్ని చెరిపేసింది.ఆ తల్లులు,సోదరీమణులు ఆవేదనను మీరు పరిగణనలోనికి తీసుకున్నారా? అని శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వినోదుల నరసింహారావు తన లేఖలో ప్రధానికి ప్రశ్న వేశారు.

# బాపట్ల జిల్లా వార్త



## ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తాం

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

బాపట్ల,సెప్టెంబర్13,ప్రభాతవార్త:రాష్ట్ర ప్రభుత్వము అందించే సంక్షేమ పథకాలు పకడ్బందీగా అములు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం బాపట్ల జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్





మీడియాతో మాట్లాడుతూ ఈరోజు బాపట్ల జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టడం జరిగిందని,అంతకు ముందు అనంతపురము జిల్లా లో 18 నెలల పాటు జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహిం చాన్నారు.. రాష్ట్ర ప్రభుత్వము అములు పరిచే సంక్షేమ పథకాలు పకడబందీగా అములు చేయడం జరుగుతుందన్నారు.ప్రజలకు కావలసిన ప్రతి సౌకర్యాన్ని చేసే దిశగా కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశాలు హాల్స్, రెవెన్యూ శాఖ పరిధిలో పలు విభాగాలు మరియు సి పి ఓ, ఎన్ఐసి ల్యాండ్ అండ్ రికార్డ్స్,ఆర్ డి ఓ కార్యాలయాలు, కలెక్టరేట్ ఆవరణలోని పరిసరాలు పరిశీలించి అధికారులకు సిబ్బందికి పలు చూచనలు జారీ చేశారు. అంతకుముందు కలెక్టరేట్ కు చేరుకున్న కలెక్టర్ గారికి జిల్లా రెవెన్యూ అధికారి మరియు ఇంచార్జి జాయింట్ కలెక్టర్ గంగాధర్ గౌడ్,కలెక్టరేట్ ఏ ఓ.మల్లిఖార్జునరావు,వేదపండితులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించి అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు అర్‌డివో గ్లోరియా,తహశీల్దార్ సలీమా ఇతర శాఖల అధికారులు కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలసి బొకే లు అందజేశారు.

## ఎరువుల సరఫరాపై వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

బాపట్ల,సెప్టెంబర్13,ప్రభాతవార్త:యూరియా సరఫరాపై వ్యవసాయ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,అదికారుకు సూచించారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఉన్న మార్క్ఫెడ్ స్టాక్ స్టోర్ చేసే అవేజ్ గౌడౌన్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ శనివారం అకస్మీకంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు ఇంతవరకు ఎంత



యూరియా వచ్చింది, రైతు సేవా కేంద్రాలకు, పిఏసీఎస్, డిసిఎమ్ఎస్ లకు ఎంత యూరియా పంపించారు, గతేడాదికన్నా ఎక్కువ వచ్చిందా, తక్కువ వచ్చిందా, ఎంత నిల్వ ఉంది, యూరియా పంపిణీలో ఏమైనా సమస్యలు ఉన్నాయా తదితర వివరాలను వ్యవసాయ అధికారుల ను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అవేజ్ గౌడౌన్ నుంచి రైతు సేవా కేంద్రాలకు, పిఏసీఎస్, డిసిఎమ్ఎస్ లకు యూరియా పంపించడంపై దృష్టి సారించాలన్నారు. సీఎంఏఐడి యాప్ ద్వారా రైతులకు యూరియాను అందజేయాలని,రైతులు యూరియా కొనుగోలులో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే లేదా అధిక ధరల అమ్మకాలుకు సంబంధించి రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని రైతులకు చూచించారు.ఎరువుల కోసం వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా చూడాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్ డి ఓ, గ్లోరియా, వ్యవసాయ శాఖ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జిటి రోడ్డుపై గుంతలు పూడ్చాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మాధవి


గుంటూరు క్రైమ్,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త : నగరంలో భారీ వర్షాల కారణంగా జిటిరోడ్డుపై ఏర్పడిన గుంతలను పశ్చిమ ఎమ్యెల్యే గళ్ళా మాధవి స్వయంగా పరిశీలించారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గుంతలను వెంటనే పూడ్చి,ఎప్పటికప్పుడు రోడ్డు పరిస్థితిని పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు కఠిన ఆదేశాలు



జారీ చేశారు.చుట్టుగుంట సెంటర్ నుండి మార్కెట్ సిగ్నల్ వరకు నూతన బిటి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు నాణ్యమైన రహదారులపై సురక్షితంగా ప్రయాణించడానికి చర్యలు వేగవంతం చేస్తున్నాం.వర్షాకాలంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం మా బాధ్యత,ప్రజల భద్రత,సౌకర్యం కోసం రహదారి అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

## కంటి శస్త్రచికిత్సలు చేయించి 671 మందికి కళ్లజోళ్ళు పంపిణీచేసిన జయప్రద ఫౌండేషన్

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :సమాజంలోని అందరికి ఆరోగ్యం కావాలి అదే అసలైన అభివృద్ధి అనే సంకల్పంతో జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండెపు దశరథజనార్ధన్ చేపట్టిన ఉచిత వైద్య పరీక్షలు, శస్త్రచికిత్సల బృహత్ సేవా కార్యక్రమంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న 671 మందికి అవసరమైన కళ్ళజోళ్ళను పంపిణీచేశారు. పట్టణంలోని యలమంచిలి రాఘవేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఈసేవా కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హాజరై జయప్రద ఫౌండేషన్ అందిస్తున్న సామాజిక సేవలు అదర్శనీయమని అభినందించారు. అందరికి ఆరోగ్యం, పేదలకు ఉచిత రీతిన వైద్యసేవలు అందించటం ప్రధాన లక్ష



్యంగా జయప్రద ఫౌండేషన్ అంకితభావంతో పనిచేస్తుందని సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ తొండెపు దశరథజనార్ధన్ అన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని అన్ని వార్డుల్లోని వారికి వీలు కలిగే విధంగా నెల రోజులపాటు వైద్యశిబిరాలు ప్రతి వార్డులోని వారు వినియోగించుకునే విధంగా ఏర్పాటుచేసి వేలాది మందికి నేత్ర, గుండె, షుగర్, బిపి, గైనకాలజీ, శల్య, చర్మ తదితర జనరల్ వైద్య సేవలు కొనసాగించటం మహత్తరమైన సేవగా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, బిసి మహిళా విబాగం నియోజకవర్గ నేత, మున్సిపల్ కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి ప్రశంసించారు. కాగా కార్యక్రమంలో జయప్రద ఫౌండేషన్ ప్రతినిధులు నెట్టెం శివరామ్, ఫ్రోగ్రామ్ కోఆర్డినేటర్ కట్టా వెంకటనరసింహారావు, మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు పుల్లారావు, రాంప్రసాద్, యామర్తి బోసు యాదవ్, ఏఎంలు, ఆశా కార్యకర్తలు, ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లా నూతన ఎస్పీగా ఉమామహేశ్వర్



బాపట్ల,సెప్టెంబర్13,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా నూతన ఎస్పీగా ఉమామహేశ్వర్ ను ఉన్నతాధికారులు నియమించారు. ఇటీవల జరిగిన ఎస్పీల బధిలీల కార్యక్రమంలో బాగంగా బాపట్ల జిల్లా ఎస్పీగా విదులు నిర్వహిస్తున్న తుషార్‌దూడిని చిత్తూరుజిల్లా ఎస్పీగా నియమించారు.ఈ మేరకు సిఐడి ఎడ్మిన్‌గా విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వర్‌ను బాపట్లజిల్లా ఎస్పీగా నియమించారు.

## కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే 'వేగేశన'

బాపట్ల,సెప్టెంబర్13,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలె చెపట్టిన డాక్టర్ వినోద్‌కుమార్‌ను బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను బహుకరించి స్వాగతం పలికారు.



## జిల్లాలో యూరియా పంపిణీ పకడ్బందీగా జరగాలి

బాపట్ల,సెప్టెంబర్13,ప్రభాతవార్త: జిల్లా లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీగా యూరియా ను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను అదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆర్ డి ఓ లు, మండల తహశీల్దార్లు,యం పి డి ఓ లు,మండల వ్యవసాయ అధికారుల తో జిల్లాలో రైతులకు యూరియా పంపిణీ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా లోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పకడ్బందీగా పంపిణీ జరగాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారులు చెప్పిన విదంగా మండల వ్యవసాయ అధికారులు



సోమవారం నుండి ఆదివారం వరకు ఎంత యూరియా అవసరంవుందో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు గత సంవత్సరం లో జిల్లాలో ఈరోజు నాటికి ఎన్ని ఎకరాలలో పంటలు వేశారు,ఇప్పుడు ఎన్ని ఎకరాలలో పంటలు వేశారని నిర్ధారణ చేసుకోవాలని ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారులు యూరియా ఎంత వచ్చింది,ఎంత రైతు కేంద్రాలకు పంపించమని ప్రతి రోజు రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేశించారు.ఏ మండలం రైతులు వ్యవసాయం చేస్తుకుంటున్నరో ఆ మండలంలో నే రైతులకు యూరియా పంపిణీ చేయాల్సిన బాధ్యత మండల వ్యవసాయ అధికారులదేనని చూచించారు. మండలంలో ఎన్ని ఎకరాలు పంటలు పెట్టారో అన్ని ఎకరాలకు మాత్రమే యూరియా పంపిణీ చేయాలని,మండలాలలో ఇప్పటి వరకు ఎంత యూరియా పంపిణి చేశారు, ఇంకా ఎంత అవసరము అవుతుందని అంచనాలు చేసుకోవాలన్నారు.ఏ మండలానికి ఎంత అవసరవుందో అంతేఇవ్వడం జరుగుతుందన్నారు.

ఎరువుల కొరత, అధిక ధరలు ఉంటే కంట్రోల్ రూమ్ 82470 40131 నెంబర్ కు ఫోన్ చేసి పిర్యాదు లు చేసేలా రైతులకు అవగాహన కలిగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి యూరియా పంపిణీ కేంద్రం వద్ద గ్రామ వ్యవసాయ అధికారి వీఆర్వో లేదా వీఆర్ఏ, ఒక పోలీస్ అధికారి ఉండి రైతులకు ఎలా పంపిణీ జరుగుతుందని పరిశీలించాలన్నారు.

రైతు కేంద్రం వద్ద ఉన్న వి ఆర్ ఓ,వి ఆర్ ఏ, గ్రామ వ్యవసాయ అధికారి యూరియాకు వచ్చే రైతులు ఎన్ని ఎకరాల్లో పంటలు వేశారు. వారికి ఎంత అవసరమవుతుందో వంటి వివరాలను తీసుకోవాలన్నారు. ఎవరికైనా ఎక్కువ ఇస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జాయింట్ టాస్క్ ఫోర్స్ కమిటీ ప్రతిరోజు రైతు కేంద్రాలను పరిశీలించాలన్నారు. రైతు కేంద్రాలకు వచ్చే రైతులకు ముందుగానే టోకెన్లు ఇవ్వాలని,ఒక్క వేళా టోకన్లు ఇచ్చిన అందరికి ఉన్న యూరియా సలకపోతే టోకన్లు ఇచ్చిన వారికి ముందుగానే సమాచారం తెలియజేయాలని,అలాంటి వారికి మరుసటి రోజు వచ్చి తీసుకునేలా వారికి తెలియజేయాలన్నారు. ఎంత నిల్వవుందో అంతే ఇవ్వాలని ఎక్కువ ఇవ్వకూడదన్నారు. మండలాల వారిగా యూరియా సప్లై చేయడం జరుగుతుందని, ప్రతిరోజు మండల వ్యవసాయ అధికారులు తహశీల్దార్లు తో యూరియా పంపిణీ పై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.రైతు కేంద్రాలలో సిబ్బంది తక్కువగా ఉంటే తక్కువగా ఉన్న చోటుకు అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.యూరియా పంపిణీ లో ఎలాంటి సమస్యలు వస్తాయని ముందుగానే గుర్తించి సమస్యలు వస్తే వాటిని ఎలా పరిష్కరించాలని దానిపై దృష్టి సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలన్నారు.యూరియా పంపిణీ లో ఏమైనా ఇబ్బందులు సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఏ వ్యవసాయ అధికారిణి అన్నపూర్ణ జిల్లా మార్కెపేడ్ డి యం కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయం ప్రారంభం

గుంటూరు విద్య-ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా నూతన కార్యాలయాన్ని రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్య నారాయణ ప్రారంభోత్సవం చేశారు. కేఆర్ సూర్య నారాయణ మాట్లాడుతూ క్రింది స్థాయి ఉద్యోగుల నుంచి రాష్ట్ర స్థాయి ఉద్యోగులు ఉండే ఏకైక గుర్తింపు పొందిన సంఘం ఏపీ జి ఈ ఏ అని , ఇప్పటివరకు సంఘం కి కార్యాలయం లేనందున రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కలెక్టర్ కి చెప్పి కార్యాలయం ను తాత్కాలిక భవనం ఏర్పాటు చేయాలని , ఆనాటి గౌరవ గుంటూరు జిల్లా కలెక్టర్ యస్.నాగలక్ష్మి ని కలిసి చెప్పడం జరిగింది . ఈ నేపథ్యంలోనే శనివారం నూతన భవనం ప్రారంభోత్సవం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లింపులపై ప్రభుత్వానికి సూచన కూడా చేయడం జరిగిందని తెలిపారు. నూతన భవనం ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, గౌరవ కలెక్టర్ మేడం కి , జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ , గుంటూరు జిల్లా అధ్యక్షులు చాంద్ బాష, జిల్లా కార్యదర్శి కెవియస్ శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి , రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ , మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి సుమిత్రా దేవి, తాలూకా యూనిట్ అధ్యక్షులు మరియు కార్యదర్శులు పాల్గొన్నారు.

## చిప్స్ ఫార్మసీ కళాశాలలో పి.సి.ఐ. నూతన సిలబస్ ముసాయిదా పై ప్రతిస్పందన అవగాహన

గుంటూరు విద్య- ప్రభాతవార్త: నగరంలోని నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీకి చెందిన చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో, ఏపీటీఐ, ఐపీఏ, మరియు ఐపీఏ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టనున్న నూతన సిలబస్ పై ప్రతిస్పందన మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో శ్రీ నిరంజన్, మెంబర్, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, పద్మావతి మహిళా ఫార్మసీ కళాశాల సీనియర్ ప్రొఫసర్ ఆచార్య నాగరాజు ,శ్రీ గోపాలకృష్ణ మూర్తి, సెక్రటరీ, ఐ పి ఏ ఆంధ్రప్రదేశ్,శ్రీ వెంకట రమణ, ప్రెసిడెంట్, ఎ పి టి ఐ, శ్రీ అంకమ్మ చౌదరి, వైస్ ప్రెసిడెంట్, ఎ పి టి ఐ, పద్మలత, ప్రిన్సిపాల్, విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్,శ్రీ నరేంద్ర, ప్రిన్సిపాల్, వి జె. ఫార్మసీ కళాశాల,శ్రీ నిరంజన్, ప్రిన్సిపాల్, సెవెన్ హిల్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, తిరుపతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర, నిరంజన్ , డాక్టర్ అంకమ్మ చౌదరి, ప్రొఫెసర్ నాగరాజు , డాక్టర్ శ్రీనివాసుబాబు ముసాయిదాలో చేయవలసిన మార్పులు చేర్పుల గూర్చి న సూచనలు సలహాలను సమర్పించారు. ఫార్మసీ విద్యారంగంలో విద్యార్థుల ప్రయోజనార్థమై ఈ విధమైన అవగాహన కార్యక్రమ రూపకల్పన లో కృషిసల్పిన తమ కళాశాల అధ్యాపకులు మరియు ఈ అవగాహన కార్యక్రమానికి విచ్చేసి న వివిధ ఫార్మసీ విద్యారంగ ప్రతినిధులకు చిప్స్ కళాశాల యాజమాన్యం తమ అభినందనలను తెలిపారు.

## మెగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు విద్య- ప్రభాతవార్త: నేషనల్ ఆయుర్వేద డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసిన కార్యక్రమంలో భాగంగా గత 25 సంవత్సరాలుగా ఆయుర్వేద వైద్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల వారు విశ్వ ఆయుర్వేద పరిషత్ ,శ్రీ కంచి కామకోటి పీఠ హరి హర దత్త క్షేత్రం మరియు స్నిగ్ధ ఆయుర్వేదిక్ ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో మెగా ఉచిత వైద్య శిబిరం మరియు ఉచిత మందుల పంపిణీ కార్యక్రమం స్థానిక పట్టాబిపురం రవీంద్ర నగర్ లో గల శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్. గోపాలన్ ,స్థానిక కార్పొరేటర్ వర ప్రసాద్ , స్నిగ్ధ ఆయుర్వేద ఫౌండర్ డా చైతన్య వైద్య శిబిరం కు వచ్చినవారికి 3 నెలల వరకు ఉచిత కన్సల్టెషన్, మందులలో 20 రాయితీ, పంచకర్మ చికిత్సలో 25 రా యితీ అందిస్తామని తెలిపారు . డా సుదర్శన్ వేదాంతం , డా భవ్య శ్రీ , డా మహేశ్వర్ రెడ్డి , డాక్టర్. ఎన్. హర్ష, కంచి కామకోటి పీఠ హరిహర దత్తక్షేత్రం చైర్మన్ గణపతి మరియు ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. పట్టాబిపురం మరియు పరిసర ప్రాంతాల నుంచి వందకు పైగా ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధి పొందారు.

## ఇకనుండి ఆదివారం కూడా జీతెలుగు సీరియల్స్

విజయవాడ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త : ప్రతిరోజూ సా.6నుండి 9వరకు ప్రసారమయ్యే ప్రేక్షకాదరణ పొందిన సీరియల్స్ ఇకనుండి ఆదివారం కూడా ప్రసారం చేస్తామని ప్రేక్షకులు వీక్షించి ఆనందించాలని జీతెలుగు ప్రతినిధులు తెలిపారు.

## కెన్‌స్టార్ కొత్తతరం 5స్టార్ వాటర్‌హీటర్‌లు

విజయవాడ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త : స్విర్ల్ హీట్ టెక్నాలజీ, జర్మన్ బ్లూ సఫైర్‌కోటింగ్, హైడెన్సిటి పియుఎఫ్ ఇన్సులేషన్తో రూపొందించిన కొత్తతరం 5స్టార్ వాటర్‌హీటర్లను మార్కెట్లో ఆవిష్కరించినట్లు కెన్‌స్టార్ ప్రతినిధులు వెల్లడించారు. 8బార్ ప్రెజర్ కంపాటిబిలిటి, 7లెవల్ సేఫ్టీ షీల్డ్, 7ఏళ్ల ట్యాంక్ వారంటీతో పాటు 20శాతం ఎక్కువ వేడినీరు, 40శాతం ఎక్కువ లైఫ్, 10శాతం రిటెన్షన్ను అందిస్తాయన్నారు.

# మిరాయ్ అందించిన అనూహ్యవిజయం



సూపర్ హీరో తేజ సజ్జా బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ మిరాయ్. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. రితికా నాయక్ హీరోయిన్ గా నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. సెప్టెంబర్ 12న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజైన ఈ చిత్రం బ్రహ్మాండ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకుని అద్భుతమైన కలెక్షన్స్‌తో హౌస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా థాంక్ యూ మీట్ నిర్వహించారు.ఈ మీట్లో సూపర్ హీరో తేజ సజ్జా మాట్లాడుతూ, అందరికి నమస్కారం. ఈ సినిమాని మీ గుండెల్లో పెట్టి ఆదరిస్తున్న ప్రేక్షకులకు మీడియా వారికి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మీ సపోర్ట్ వల్లే నేను సినిమాలుచేయగలుగుతున్నాను. ఇక్కడ ఉండగలుగుతున్నాను. ఆడియన్స్, మీడియా అందరూ కలిపి నాకు ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చారని భావిస్తున్నాను. ఈ సినిమాకి వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్ చాలా ఆనందాన్నిచ్చింది. సినిమా చూసిన ఆడియన్స్ సపరేట్ గా రీల్స్ చేస్తూ ఈ సినిమా గురించి ప్రమోట్ చేస్తుంటే ఆనందంగా అనిపించింది. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అందరూ కూడా ఒక మంచి సినిమా ఇవ్వాలని ప్యాషన్ తో చేశారు. జగపతి బాబు ,శ్రీయ జయరాంలుచాలా గొప్ప నటులు. మా పాషన్ చూసి మాతో ట్రావెల్ అయ్యారు. చాలా సపోర్ట్ చేశారు. మిరాయ్ అందరికీ నచ్చే సినిమా. అందరూ థియేటర్స్ కి వచ్చి ఎంజాయ్ చేయండి. రాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ, ఈరోజు నాకు చాలా హ్యాపీగా ఉంది. దాదాపు12 ఏళ్ల తర్వాత సక్సెస్‌తో నా ఫోన్ మోగుతూనే ఉంది. నిన్నటి నుంచి అభినందనలు వస్తున్నప్పటికీ నాకు ఇదంతా కలలా ఉంది. ఈ కథలో నన్ను భాగం చేసినందుకు డైరక్టర్ కార్తిక్‌కు జన్మంతా రుణపడి ఉంటాను. ఇంతకుముందు నేను ఎక్కడికి వెళ్లినా అన్నా సినిమా ఎప్పుడు. కమ్‌బ్యాక్ ఎప్పుడు?అని అందరూ అడిగేవారు. త్వరలోనే వస్తాను అని చెప్పేవాడిని. వాళ్లతో బయటకు ధైర్యంగా మాట్లాడినా.. లోపల తెలియని భయం ఉండేది. అలాంటి టైమ్‌లో కార్తిక్ రావడం నా అదృష్టం. నన్ను మాత్రమే నిలబెట్టలేదు.. నాతో పాటు నా కుటుంబాన్ని కూడా నిలబెట్టారు. అందరినీ ఇండస్ట్రీలో కలుపుకుంటూ ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాను. రితిక అద్భుతంగా చేసింది. తనకు మంచి భవిష్యత్తు ఉంది. మా డైరెక్టర్‌కి హాట్సాఫ్. శ్రీకర్ ప్రసాద్‌కి నేను చిన్నప్పుడు నుంచి పెద్ద ఫ్యాన్ ని. ఆయనతో కలిసి వర్క్ చేయడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇకపై వరుస సినిమాలు చేస్తూ ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాను. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ,. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ జర్నీ 2017లో స్టార్ట్ అయింది. గూడచారి మాకు ఫస్ట్ క్రెడిబిలిటీ తీసుకొచ్చింది. ఆ తర్వాత ప్రతి ఏడాదిలో దాదాపు పది సినిమాలు చేసిన సందర్భాలు ఉన్నాయి.మిరాయ్ లాంటి అద్భుతమైన విజయం మాకు మరెన్నో సినిమాలు చేసే గొప్ప ఎనర్జీ ఇచ్చింది. ఈ సినిమాని మా దగ్గరికి తీసుకు వచ్చిన డైరెక్టర్ కార్తీక్‌కి ఈ క్రెడిట్ ఇస్తాను. ఈ సినిమాతో ఆడియన్స్ నుంచి గొప్ప క్రెడిబిలిటీ సంపాదించాము. అది మాకు చాలా ఆనందాన్ని ఇస్తుంది. కార్తీక్ తేజ మనోజ్ ఎక్స్ట్రార్డినరీ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. గౌరహరి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. హిందీలో రిలీజ్ చేయడానికి చాలా ఎంకరేజ్ చేశారు. ఈ సినిమా అద్భుతంగా సపోర్ట్ చేసిన ఆడియన్స్ అందరికీ థాంక్యూ. మా అమ్మాయి కృతి ప్రసాద్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా తన జర్నీ మొదలుపెట్టి ఈ సినిమాతో నిర్మాతగామారారు. తను మాలక్ష్మి చార్జ్ అని భావిస్తున్నాం. డైరెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. 2021 లో ఈ సినిమా ఐడియా చెప్పాను తేజకి. అప్పటినుంచి ట్రావెల్ అవుతున్నాం. నాలుగేళ్లు జర్నీ అంత ఈజీ కాదు. నన్ను బిలీవ్ చేసిన నిర్మాత విశ్వప్రసాద్‌కి థాంక్యు. మనోజ్ తో కలిసి షూట్ చేయడం మ్యాజికల్ఎక్స్పీరియన్స్.

ఈ సినిమాకి రైటింగ్ వెరీ లాంగ్ టైం ప్రాసెస్. రానా నన్ను ఎప్పుడు కూడా ఎంకరేజ్ చేస్తున్నారు. అడగ్గానే ఈ ప్రాజెక్టులో భాగమైన ఆయనకి కృతజ్ఞతలు. ఈ సినిమాలో పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. హీరోయిన్ రితిక నాయక మాట్లాడుతూ, సినిమాకి ఆడియన్స్ నుంచి వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్ నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నాకు అద్భుతమైన క్యారెక్టర్ ఇచ్చిన మా డైరెక్టర్ ధన్యవాదములు. నా మనసులో ఎప్పుడూ నిలిచిపోతుంది.మనోజ్, తేజ వెరీ డెడికేటెడ్ చాలా ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు. ఈ వేడుకలో మిరాయ్ యూనిట్ అంతా పాల్గొన్నారు.




# ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున మ్యూజికల్ లైవ్ కన్సర్ట్




ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా భారీ ఎత్తున ఇళయరాజా మ్యూజికల్ లైవ్ కన్సర్ట్ విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నవంబర్ 8న ఇ సైజ్ఞాని ఇళయరాజా మ్యూజికల్ లైవ్ కన్సర్ట్.ఇ సైజ్ఞాని ఇళయరాజా సంగీత విభావరి (లైవ్ కన్సర్ట్) పెద్ద ఎత్తున మొదటిసారి ఆంధ్రప్రదేశ్ లో జరగనుంది. విజయవాడ ఎంజి రోడ్ లోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నవంబర్ 8వ తేదీ శనివారం నాడు కనీవినీ ఎరుగని రీతిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

విజయవాడలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ట్రెండ్ సెట్టర్స్ లైవ్ సుధాకర్ ఈ లైవ్ కన్సర్ట్ ను నిర్వహిస్తున్నారు. ఈ సంగీత కచ్చేరికి సంబంధించిన పోస్టర్ ను ఇసైజ్ఞాని ఇళయరాజాతో పాటు, ఏపీ ఇండస్ట్రీస్ మినిస్టర్ టీజీ భరత్ విడుదల చేశారు. ఈవెంట్ కు సంబంధించిన టికెట్లను ఇప్పటికే బుక్ మై షో లో పొందుపరచగా మంచి రెస్పాన్స్ దక్కుతోంది. అత్యంత వేగంగా టికెట్లు అమ్ముడు అవుతున్నాయి. ఇంకా లిమిటెడ్ టికెట్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటి వరకు కనీ విని ఎరుగని రీతిలో ఈ సంగీత విభావరి కార్యక్రమం కోసం గట్టి భద్రత, సకల సౌకర్యాలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రెండ్ సెట్టర్స్ సుధాకర్ మాట్లాడుతూ.. "సినీ సంగీతానికి జీవనాడిగా ఉన్న ఇళయరాజాతో కలిసి ఈ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. ఇళయరాజా మొదటిసారి ఆంధ్రప్రదేశ్లో నిర్వహిస్తున్న లైవ్ కన్సర్ట్ కావడంతో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నాం. ఈ ఈవెంట్ కు సంబంధించిన టిక్కెట్లను బుక్ మై షో యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

80మంది సభ్యుల బృందంతో ఇళయరాజా ఈ లైవ్ కన్సర్ట్ కు హాజరవుతున్నారు. ఏపీలో ఇలాంటి మ్యూజికల్ కన్సర్ట్‌ను ఇంత లార్జ్ స్కేల్ లో నిర్వహించడం ఇదే మొదటిసారి అని చెప్పారు.

# 'బ్యూటీ' ట్రైలర్‌ను విడుదల చేసిన నాగచైతన్య




ఓ మంచి ప్రేమ కథను, అంతకు మించిన కుటుంబ విలువలు, ఫాదర్ డాటర్‌రిలేషన్, ఎమోషనల్ కంటెంట్ తో వస్తున్న చిత్రం'బ్యూటీ'. జీ స్టూడియోస్,మారుతీ టీం ప్రొడక్ట్స్, వానర సెల్యూలాయిడ్ సంయుక్తంగా 'బ్యూటీ' సినిమాని నిర్మించారు. అలాంటి'బ్యూటీ'చిత్రంనుంచి ఇప్పటికే వదిలిన గ్లింప్స్, మోషన్ పోస్టర్,పాటలు,టీజర్ఇలా అనీ హైలెట్ అయ్యాయి.సెప్టెంబర్19నమూవీని విడుదలచేస్తున్న క్రమంలో తాజాగా ట్రైలర్ విడుదల చేసి అంచనాలు పెంచేశారు.

అంకిత్ కొయ్య, నీల జంటగా నటించిన ఈ మూవీని విజయ్ పాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ నిర్మించారు. ఇక ఈ సినిమాకు గీతా సుబ్రమణ్యం, హలో వరల్డ్, 'భలే ఉన్నాడే' ఫేమ్ జె.ఎస్.ఎస్. వర్ధన్ మాటలు, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వహించారు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేని ఆర్.వి.సుబ్రహ్మణ్యం అందించారు.

విడుదలతేదీ దగ్గర పడుతున్న సందర్భంగా యువ సామ్రాట్ నాగ చైతన్య తాజాగా బ్యూటీ ట్రైలర్ ను రిలీజ్ చేశారు. ట్రైలర్ విడుదల చేసిన అనంతరం చిత్ర యూనిట్‌కి ఆల్ ది బెస్ట్ తెలిపారు. నాగ చైతన్య రిలీజ్ చేసిన ట్రైలర్ ప్రస్తుతం ప్రేక్షకుల మనసుని హత్తుకుంటుంది.

ఎప్పుడైనా నేను నిన్ను కొప్పడితే నన్ను అలా వదిలి పెట్టి వెళ్ళకు, నిన్ను వదిలేసి వెళ్ళడం అంటే.. నా ఊపిరి వదిలేయడమే కన్నా అంటూ హీరో హీరోయిన్ల చెప్పే డైలాగ్ తో ట్రైలర్ ఓపెన్ చేశారు. స్కూటీ కొనిస్తాను అని తండ్రి మాట ఇవ్వడం, మిడిల్ క్లాస్ ఫాదర్ ఎమోషన్స్, క్యాబ్ డ్రైవర్ అయితే క్యాబ్ డ్రైవర్ లా ఉండాలి గానీ కలెక్టర్ లా ప్రామిస్ చేయొద్దు అనే డైలాగ్ ప్రతీ ఒక్కరిని కదిలించేలా ఉంది. ఈ ట్రైలర్ లోని డైలాగ్స్, హీరో హీరోయిన్ల లవ్ ట్రాక్, ఫాదర్ డాటర్ ఎమోషన్, మిడిల్ క్లాస్ కష్టాలుఇలాఅన్నీ కూడా ఆకట్టుకున్నాయి.

ఇక మ్యూజిక్, ఆర్ ఆర్, విజువల్స్ అయితే టాప్ నాచ్‌గా ఉన్నాయి. ఈ చిత్రంలో అంకిత్ కొయ్య, నీలఖి, నరేష్, వాసుకి, నంద గోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీ గౌడ్, ప్రసాద్ బెహరా వంటి వారు నటించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్‌గా శ్రీసాయి కుమార్ దారా, ఆర్ట్ డైరెక్టర్‌గా బేబీ సురేష్ భీమగాని, ఎడిటర్ గా ఎస్‌బి ఉద్ధవ్ పని చేశారు.

ఈ సినిమాకు బి.ఎస్.రావు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరి స్తున్నారు. ఇకసెప్టెంబర్ 19న ఈమూవీ నిగ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.

తారాగణం : అంకిత్ కొయ్య, నీలఖిపాత్ర,నరేష్, వాసుకి, నందగోపాల్, సోనియా చౌదరి, నితిన్ ప్రసన్న, మురళీగౌడ్, ప్రసాద్ బెహరా తదితరులు.

సాంకేతికసిబ్బంది: స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, దర్శకత్వం: జె.ఎస్.ఎస్. వర్ధన్,నిర్మాతలు: అడిదాలవిజయ్ పాల్‌రెడ్డి, ఉమేష్‌కుమార్ బన్సాల్ బ్యానర్లు: వానర సెల్యులాయిడ్, జీ స్టూడియోస్ మారుతీ టీమ్ ప్రొడక్ట్,కథ, స్క్రీన్ ప్లే: ఆర్.వి. సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బి.ఎస్. రావుడిఓపి: శ్రీ సాయి



"లిటిల్ హార్ట్స్" టీమ్ ను ఇన్వైట్ చేసి, కంగ్రాట్స్ చెప్పిన హీరో విజయ్ దేవరకొండమౌళి తనూజ్, శివానీ నాగరం జంటగా నటించిన "లిటిల్ హార్ట్స్" సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు ప్రేక్షకుల ఆదరణతో పాటు సెలబ్రిటీల ప్రశంసలు లభిస్తున్నాయి. తాజాగా హీరో విజయ్ దేవరకొండ ఈ సినిమా టీమ్ ను ఇంటికి ఇన్వైట్ చేసి మీట్ అయ్యారు. విజయ్ ను కలిసిన వారిలో హీరో మౌళి, డైరెక్టర్ సాయి మార్తాండ్, డీవోపీ సూర్య బాలాజీ, మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి, ఇతర టీమ్ మెంబర్స్ ఉన్నారు. "లిటిల్ హార్ట్స్" మంచి సక్సెస్ అందుకున్నందుకు టీమ్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు విజయ్ దేవరకొండ. ఈ ఫోటోస్ ను సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు హీరో మౌళి తనూజ్. ఈ పోస్ట్ లో విజయ్ దేవరకొండకు మౌళి కృతజ్ఞతలు చెప్పాడు. సోదరుడిలా తమపై విజయ్ ప్రేమ చూపించాడని, ఆయన చెప్పిన మాటల్ని, విశెస్ ను మర్చిపోలేమని మౌళి ఈ పోస్ట్ లో పేర్కొన్నాడు .


# 'లిటిల్ హార్ట్స్' టీమ్‌ను అభినందించిన దేవరకొండ

# 'ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు'19న విడుదల




**రాజాకృష్ణ ప్రొడక్షన్స్** బ్యానర్ పై నిర్మిస్తున్న తాజా చిత్రం ..ఇలాంటి సినిమా మీరెప్పుడు చూసుండరు... తెలుగులోనే కాదు ప్రపంచ సినిమా చరిత్రలోనే ఎవరు చేయని విధంగా ఒకే షాట్లో సినిమా మొత్తాన్ని తెరకెక్కించి అందరిని ఆశ్చర్యశకితులను చేశాడు ప్రొడ్యూసర్, డైరెక్టర్, హీరో సూపర్ రాజా. ఈ రోజు సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హీరో సూపర్ రాజా మాట్లాడుతూ, క్రియేటివిటీనే బ్యాగ్రౌండ్, కసినే బలం ఈ రెండు ఆయుధాలతో సినిమా పరిశ్రమలో అద్భుతాలు చేయొచ్చు అంటున్నారు. గివ్ అప్ చేయకుండా ప్రయత్నిస్తే ఒక మనిషి ఏం చేయగలడో సెప్టెంబర్ 19న థియేటర్లో చూస్తారు అన్నారు. సినిమా ఇంత అద్భుతంగా రావడానికి కారణం తన పేరెంట్స్ అని చెప్పారు. అలాగే ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చిందని తెలిపారు. ఎన్నో రోజులు చీకట్లో ఉండి వెలుగు కోసం ప్రయత్నం చేశాను. ఈ ప్రయత్నం ఎంతో మంది జీవితాల్లో వెలుగు నింపుతుందని చెప్పారు. తనను నమ్మి డబ్బులు పెట్టిన తన పేరెంట్స్ అండ్ అన్నయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆయను నమ్మి నటించిన నటీనటులకు, డిస్ట్రిబ్యూట్ చేస్తున్న మైత్రీ వాళ్లకు, ఈవెంట్ చీఫ్ గెస్ట్ గా వచ్చిన అభిమానులకు స్పెషల్ థ్యాంక్స్ చెప్పారు. ఈ సినిమాలో నటించడం చాలా స్పెషల్ ఫీల్ అవుతున్నట్లు హీరోయిన్ చందన పాలంకి తెలిపారు. మొదట సినిమా గురించి చెప్పినప్పుడు ఒకే షాట్ లో ఎలా తీస్తారు అనే భయం ఉండేది కానీ తరువాత సూపర్ రాజా కాన్ఫిడెన్స్ చూసిన తరువాత ఆ భయం పోయిందని, కేవలం సూపర్ రాజాను నమ్మి తన పాత్ర చేసినట్లు చెప్పారు. అలాగే సూపర్ రాజా చాలా స్పాంటేనియస్ యాక్టర్ అని చెప్పారు. ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చుతుందని సెప్టెంబర్ 19న థియేటర్లో అందరూ చూడాలని చెప్పారు. ఇలాంటి సినిమా ఎప్పుడు చూసి ఉండరు, ఇలాంటి ఈవెంట్ కూడా ఎప్పుడు జరిగి ఉండదు అని వంశీ గోనె అన్నారు.. సూపర్ రాజా ఎంతో మంది యువతకు ఇన్స్పిరేషన్ అవుతారని చెప్పారు. జీవితంతో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా తట్టుకోని నిలబడ్డారు కాబట్టే ఈ రోజు ఇంతమంది అభిమానాన్ని చురొగొన్నారు అని చెప్పారు. తరువాత సినిమా చూశాక షాక్ అయ్యాను అని శశీధర్ చెప్పారు. సింగిల్ టేక్ లో ఈ సినిమా ఎలా చేశారు అనే ఆశ్చర్యం వేసింది అన్నారు. సూపర్ రాజా ఎఫర్ట్ కి, ఆయన క్రియేటివిటీకీ హ్యాండ్సప్ చెప్పారు. అలాగే మంచి కంటెంట్ ను మైత్రీ నవీన్, రవి, విశ్వప్రసాద్ ఎప్పుడూ ప్రొత్సహిస్తారని చెప్పారు. ఇంత కష్టపడి సూపర్ రాజా తెరకెక్కించిన ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు విపరీతంగా నచ్చుతుందని చెప్పారు.

# 'ప్రేమతో దెయ్యం' ట్రైలర్ విడుదల



బి.కె.ఎస్ దర్శకత్వంలో బి గణేష్, బద్దెల శ్రీనివాస్, నవ్యశ్రీ తదితరులు ప్రధానపాత్రల్లో శ్రీ లక్ష్మి హనుమ శివపార్వతి బ్యానర్ పై హరి ఓం తపశ్రిత సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'ప్రేమతో దెయ్యం'. చిత్రానికి సంబంధించిన ట్రైలర్ సినీ ప్రముఖుల సమక్షంలో ఘనంగా విడుదలయింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, కథనాలతో ఈ చిత్రం రూపొందిందని దర్శకుడు బి.కె.ఎస్ తెలిపారు. నిర్మాత బి. కుమారస్వామి మాట్లాడుతూ, ప్రస్తుతం వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఈ సినిమాను నిర్మించామన్నారు. సినిమాలో ప్రతీ ఒక్కరినీ కదిలించే సన్నివేశాలు ఉంటాయన్నారు. ఎక్కడా రాజీపడకుండా చిత్రాన్ని అందమైన ప్రదేశాల్లో చిత్రీకరణ జరిపినట్టు తెలిపారు. ఈ చిత్రానికి సంబంధించి ప్రసన్నకుమార్ , అనుపమారెడ్డి టీజర్ ని విడుదల చేయగా, సముద్ర, శివనాగు సాంగ్స్, తుమ్మలపల్లి సత్యనారాయణ ట్రైలర్ ని విడుదల చేశారని చెప్పారు. విజయచిత్ర ఎడిటర్ గుర్రపు విజకుమార్ మాట్లాడుతూ, సినిమా ఆద్యంతం ప్రతీ ఒక్కరినీ అలరిస్తుందని చెప్పారు. ప్రేక్షకులను ఆకట్టునే విధంగా సినిమా ఉంటుందని అన్నారు. నిర్మాత రాజేష్ పుత్ర మాట్లాడుతూ, ఈ సినిమా వినోదాత్మకంగా ఉంటూనే అన్ని వర్గాలవారిని అలరిస్తుందని చెప్పారు. ఈ చిత్రలోని ఇతర పాత్రల్లో దేవి, ఉమారాణి, రామకృష్ణ, రజాక్, మస్తాన్ అలీ, రవి, బాబు, తపశ్రిత, హరి ఓం, హరిచరణ్ నటించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : శేఖర్, సంగీతం : సి.హెచ్. అమ్మ పాండు, ఎడిటింగ్ : డి.ఆర్ శ్యాం కుమార్, బ్యాగ్రౌండ్ మ్యూజిక్ : సిస్సి జస్టిన్, బ్యానర్ : శ్రీ లక్ష్మి హనుమ శివపార్వతి, సమర్పణ: హరి ఓం తపశ్రిత , నిర్మాత: బి. కుమార స్వామి, కథ, స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వం : బి.కె.ఎస్.

MN 9_14-9Pg5.qxd 9/13/2025 10:29 PM Page 1



# భారత్‌పై సుంకాలకు జీ7 దేశాలు సిద్ధం

## భారత్, చైనా సహా రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీగా ఆంక్షలు

### అమెరికా ప్రతిపాదనకు ఆ దేశాలు అంగీకారం

**వాషింగ్టన్, సెప్టెంబరు 13:** రష్యన్ చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై ఐరోపా సమాఖ్యతో పాటు, జీ7 దేశాలు టారిఫ్‌లు విధించాలని అమెరికా ప్రతిపాదించింది. దీనికి జీ7 దేశాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. భారత్‌పై భారీగా టారిఫ్‌లు విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్లను జీ7 దేశాలు అంగీకరించినట్లు తెలిసింది. ఉక్రెయిన్‌లో శాంతి పునరుద్ధరణకు రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తోంది. అందులో భాగంగా రష్యన్ చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై ఐరోపా సమాఖ్యతో పాటు, జీ7 దేశాలు టారిఫ్‌లు విధించాలని అమెరికా ప్రతిపాదించింది. ఈ టారిఫ్‌ల విధింపునకు తాజాగా జీ7 దేశాలు కూడా అంగీకరించినట్లు సమాచారం. జీ7 దేశాల ఆర్థిక మంత్రులు ఈ సుంకాల విధింపుపై చర్చించారు. ఈ విషయాలను అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ వెల్లడించారు. ఇప్పటికే భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ క్లిష్ట సమయంలో నిర్ణయాత్మక చర్య తీసుకోవడానికి వారంతా ముందుకురావాలని కోరారు. ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి నిజంగా కట్టుబడి ఉంటే రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ముందుకురావాలని యూఎస్ వాణిజ్య మంత్రి స్కాట్ బెసెంట్ పిలుపునిచ్చారని




తెలిపారు. ఇందుకోసం మాస్కో నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై సుంకాలు విధించాలంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రతిపాదనలను ఉద్ఘాటించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా యుద్ధం ముగింపునకు కట్టుబడి ఉన్నామని జీ7దేశాలు ప్రకటించాయని తెలిపారు. ఉక్రెయిన్ రక్షణకు నిధులు సమకూర్చేందుకు స్తంభించిన రష్యా ఆస్తులను ఉపయోగించే విషయంపైనా సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. క్లిష్ట సమయంలో అమెరికాతో కలిసి ఈ దేశాలు కూడా నిర్ణయా త్మక చర్యలు చేపడుతాయని ఆశిస్తున్నామని వెల్లడించారు.

దీంతో భారత్, చైనాలపై సుంకాల విధింపునకు ఆయా దేశాలు కూడా సిద్ధమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా, రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ఇంతకుముందు ఐరోపా సమాఖ్య(ఈయూ) దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈవిషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జీ7 దేశాల ముందుపెట్టడం గమనార్హం. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై 50 శాతం సుంకం విధించడం అంత తేలికైన విషయం కాదని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. రష్యాపై చర్య తీసుకునేందుకు భారత్‌తో విభేదానికి తాము సిద్ధమయ్యామని అన్నారు. భారత్ రష్యాకు అతిపెద్ద చమురు వినియోగదారని తెలిపారు. ఆ దేశం నుంచి చమురు కొంటున్నారన్న కారణంతోనే నేను భారత్‌పై 50 శాతం సుంకం విధించానని, అది చాలా పెద్ద చర్య అని చెప్పారు. దీంతో భారత్‌తో విభేదాలు వచ్చాయని, అయినా తాను చర్య తీసుకున్నానని చెప్పారు. ఇలాంటి ఎన్నో పనులు చేశానని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్‌పాక్ ఘర్షణ సహా ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య ఏడు యుద్ధాలను తాను నివారించినట్లు ట్రంప్ మళ్లీ పాత పాట పాడారు.



# జపాన్‌లో లక్షదాటిన శతాధిక వృద్ధుల జనాభా

## ప్రపంచ వ్యాప్తంగా 55వసారి జపాన్ రికార్డు

**టోక్యో, సెప్టెంబరు 13:** జపాన్ కొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఆ దేశంలో వంద ఏళ్లు దాటిన వృద్ధుల సంఖ్య లక్ష దాటినట్లు ప్రభుత్వం వెల్లడించింది. వరుసగా 55వ సంవత్సరం ఆ దేశం కొత్త రికార్డును నమోదు చేసింది. సెప్టెంబర్‌లో శతాధిక వృద్ధుల సంఖ్య 99,763 మందికి చేరుకున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి వెల్లడించారు. అయితే దీంట్లో 88 శాతం మంది మహిళలే ఉండడం గమనార్హం. అత్యధిక కాలం జీవిస్తున్న వారి సంఖ్య జపాన్‌లో అధికం. ఆ లిస్టులో జపాన్ టాప్‌లో ఉంటుంది. ప్రపంచంలోని అత్యంత వృద్ధ వ్యక్తి ఆ దేశంలో జీవిస్తున్నట్లు రికార్డులు ఉన్నాయి. చాలా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల జపాన్ ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తున్నారు. కానీ అక్కడ జనన రేటు తక్కువగా ఉన్నది. జపాన్ నివేదికల ప్రకారం ఆదేశంలో జీవిస్తున్న అత్యంత వృద్ధ వ్యక్తి వయసు 114 ఏళ్లు. యమటో కరియామాకు చెందిన ఆ మహిళను షిగికో కగ్వాగా గుర్తించారు. నారా సిటీకి శివారులో ఈ ప్రాంతం ఉంది. జపాన్ లెక్కల ప్రకారం అత్యంత వృద్ధ మగ వ్యక్తిని కియోటకా మిజునోగా గుర్తించారు. ఆయన వయసు 111 ఏళ్లు. ఇవాటా అతని స్వస్థలం. ఆరోగ్యశాఖ మంత్రి తకమారో పుఖోకా ఈ నేపథ్యంలో వృద్ధులకు కంగ్రాట్స్ చెప్పారు. 87,784 మంది మహిళలు, 11,979 మంది వృద్ధ పురుష జనాభా ఉన్నట్లు మంత్రి తెలిపారు. జపాన్‌లో సెప్టెంబర్ 15వ తేదీన వృద్ధ దినోత్సవం జరుపుతున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నుంచి ఆ వృద్ధులకు ఓ లేఖ, సిల్వర్ కప్ అందిస్తారు. ఈ ఏడాది 52,310 మంది పురస్కారానికి ఎంపికయ్యారు. 1963లో శతాధిక వృద్ధులను లెక్కింపు చేయడం మొదలుపెట్టారు. ఆ సమయంలో 153 మందివందేళ్లు దాటిన వాళ్లు ఉన్నారు. 1981లో ఆ సంఖ్య వెయ్యి దాటింది. 1998 నాటికి ఆ సంఖ్య పది వేలకు చేరుకున్నది. జపాన్‌లో ఓబెసిటీ కేసులు తక్కువ. రెడ్ మీట్ తక్కువగా తింటారు. ఎక్కువగా చేపలు, కూరగాయలు తింటారు. జపాన్ మహిళల్లో ఓబెసిటీ కేసులు మరీ మరీ తక్కువ. దాని వల్లే అక్కడ మహిళల్లో జీవిత కాలం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. మిగితా ప్రపంచ దేశాలన్నీ తమ డైయిట్‌లో షుగర్, ఉప్పుకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా జపాన్ మాత్రం భిన్నంగా ముం దుకె ళ్లింది. ఉప్పును తగ్గించి తీసుకోవాలని జపాన్‌లో ప్రచారం చేశారు.

కేవలం ఆహారం మాత్రమే కాదు జీవితంలో యాక్టివ్‌గా ఉండేందుకు ఎక్కు వగా వాకింగ్ చేస్తారు. ప్రజా రవాణా వ్యవస్థ మీద ఎక్కువగా ఆధారపడుతారు. జపాన్ వృద్ధ జనాభా లెక్కల్లో కొంత అవకతవకలు ఉన్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఫ్యామిలీ రిజిస్ట్రీల ప్రకారం జపాన్‌లో 2010 నాటికే సుమారు రెం డున్నర లక్షల మంది శతాధిక వృద్ధులు ఉం టారని అంచనా వేస్తున్నారు. కానీ వాళ్లు పెన్షన్ కోసం తప్పుడు లెక్కలు చూపి ఉంటారని కొం దరు భావిస్తున్నారు.



## గాజాపై ఇజ్రాయెల్ ఉధృత దాడులు 65 మందికిపైగా మృతి

**గాజా సిటీ, సెప్టెంబరు 13:** హమాస్ అంతమే లక్ష్యంగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడుతోంది. డ్రోన్లు, వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. తాజాగా శుక్రవారం కూడా గాజాలోని పలు ప్రాంతాలపై ఐడీఎఫ్ దళాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో 60 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. గాజా నగరంలోని ఉత్తర ప్రాంతంపై ఐడీఎఫ్ కాల్పులు జరిపింది. ఈ దాడిలో 65 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన 14 మంది ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. గాజా నగరంలో అట్ ట్వామ్ ప్రాంతంలోని ఇంటిపై జరిపిన దాడిలో వారంతా మరణించినట్లు పేర్కొన్నాయి. అయితే, ఈ దాడులను పాలస్తీనా గ్రూప్ హమాస్ ఖండించింది. పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఇజ్రాయెల్ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది. ఇలాంటి చర్యలు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది.

# లాడెన్ మీ దేశంలోనే హతమయ్యాడని మర్చిపోయారా?

### పాకిస్థాన్‌కు ఇజ్రాయెల్ కౌంటర్




**టెల్‌అవీవ్, సెప్టెంబరు 13:** ఐరాసలోని భద్రతా మండలి వేదికగా పాకిస్థాన్ ఇజ్రాయెల్ కౌంటర్ ఇచ్చింది. కరుడుగట్టిన ఉగ్రవాది బిన్‌లాడెన్‌కు పాక్ ఆశ్రయం కల్పించిందని, అక్కడే అతడు హతమయ్యాడని వ్యాఖ్యానించింది. ద్వంద్వ ప్రమాణాలతో వాస్తవాలను మార్చలేరంటూ విమర్శలు చేసింది. గత రెండేళ్లుగా ఇజ్రాయెల్–హమాస్ మధ్య పోరు జరుగుతోంది. కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా ప్రతిపాదన మేరకు దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. దీనిని పలు దేశాలు ఖండించాయి. అయితే, ఈ దాడులను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సమర్థించుకున్నారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడులను అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చారు. ఆ తర్వాత పాకిస్థాన్ గడ్డపై ఆశ్రయం పొందిన బిన్‌లాడెన్‌ను అమెరికా మట్టుపెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. ఖతార్‌పై దాడుల గురించి ఐరాస భద్రతామండలిలో చర్చ సందర్భంగా తమ దేశం పేరు ప్రస్తావించడంపై పాకిస్థాన్ అభ్యంతరం చెప్పింది. అలాగే ఇజ్రాయెల్ దాడిని ఖండించింది. ప్రాంతీయ సుస్థిరతను దెబ్బతీసే దురాక్రమణ అని వ్యాఖ్యలు చేసింది. దాంతో ఐరాసలో పాక్ రాయబారి అసీమ్ ఇఫ్తికార్ అహ్మద్‌ను ఉద్దేశించి ఇజ్రాయెల్ శాశ్వత ప్రతినిధి డానీ డానన్ గట్టి కౌంటర్ ఇచ్చారు.

'విదేశీ గడ్డపైనున్న ఉగ్రవాదిని ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనే ప్రశ్న అడగకూడదు. అడగాల్సిన ప్రశ్న ఏంటంటే.. అసలు ఉగ్రవాదికి ఆశ్రయం ఎందుకు ఇస్తున్నారు అని. బిన్‌లాడెన్‌ను మట్టుపెట్టేందుకు చేసిన ఆపరేషన్ సరైందే అయినప్పుడు హమాస్ విషయంలో మేం చేసింది కూడా సరైందే' అని సమర్థించుకున్నారు. 9/11 తర్వాత భద్రతామండలి ఒక తీర్మానాన్ని ఆమోదించిందని ఏ దేశమూ ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటివి చేయకూడదని పేర్కొందన్నారు. అలా కాదని ఆశ్రయం కల్పిస్తే, మండలి నియమావళిని ఉల్లంఘించినట్లే అవుతుందన్నారు. కాగా అమెరికాలో 2001, సెప్టెంబరు 11న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రదాడి జరిగిన 24 యేళ్లు అయిన నేపథ్యంలో భద్రతా మండలి సమావేశమైంది. ఆ చర్చలో భాగంగానే పాకిస్థాన్ ఉగ్రవాదులకు స్వర్గధామమని మరోసారి తేటతెల్లమైంది.

# బ్రిటన్‌లో సిక్కు మహిళపై లైంగిక దాడి

**లండన్, సెప్టెంబరు 13:** బ్రిటన్‌లో దారుణం చోటు చేసుకుంది. ఓల్డ్‌బరీ పట్టణంలో సిక్కు మహిళపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం మీ దేశానికి వెళ్లిపో అంటూ బాధితురాలిని బెదిరించారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. దీంతో బాధితురాలి కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా ఈ ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు జల్లెడ పట్టారు. ఆక్రమంలో నిందితులను పోలీసులు గుర్తించారు. వారు శ్వేత జాతీయులని స్పష్టం చేశారు. వారి కోసంగాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు వివరించారు. గతవారంలో చోటు చేసుకున్న ఈఘటనపై బ్రిటన్‌లోని ప్రవాస భారతీయులంతా మండిపడుతున్నారు.

# ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌తో మ్యాచ్‌లేంటి?

### శివసేన చీఫ్ ఉద్ధవ్ థాకరే ఆగ్రహం



**ముంబయి, సెప్టెంబరు 13:** ఆసియా కప్‌లో భాగంగా ఆదివారం భారత్‌పాకిస్థాన్ మధ్య జరగనున్న క్రికెట్ మ్యాచ్‌పై శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని ఎగదోసే పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడడం అంటే, అది భారతీయుల భావోద్వేగాలను అవమానించడమే అని వ్యాఖ్యానించారు. సరిహద్దుల్లో మన సైనికులు ప్రాణాలు త్యాగం చేస్తుంటే, పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడడం ఏంటని ప్రశ్నించారు. ఈ మ్యాచ్‌కు వ్యతిరేకంగా మహారాష్ట్ర అంతటా సిందూర్ నిరసనలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ముంబయిలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఉద్ధవ్ ఠాక్రే, ఆదివారం జరగనున్న భారత్‌పాక్ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలని, ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రపంచానికి తెలియజేయడానికి ఇది ఒక మంచి అవకాశమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీజేపీపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌పాక్ క్రికెట్ మ్యాచ్‌ను అనుమతించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసినట్లు ప్రకటించబోతోందా అని ఆయన ప్రశ్నించారు. మన సైనికులు సరిహద్దుల్లో ప్రాణాలు త్యాగం చేస్తుంటే, మనం పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడాల్సిన అవసరం ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్‌పై మండిపడిన ఉద్ధవ్ ఠాక్రే, దాయాదుల మధ్య జరగనున్న క్రికెట్ మ్యాచ్ దేశభక్తిపై వేసిన ఒక పెద్ద జోక్ అని అభివర్ణించారు. దీనిని బాయ్‌కాట్ చేస్తే, ఉగ్రవాదంపై భారత వైఖరి ఏమిటో ప్రపంచానికి బలమైన సంకేతాన్ని పంపినట్లు అవుతుంది అని ఆయన అన్నారు. బీజేపీ దేశభక్తి పేరుతో వ్యాపారం చేస్తోందని ఆయన విమర్శించారు.

ఒకానొక సమయంలో బాల్ ఠాక్రే దగ్గరకు పాకిస్థాన్ క్రికెటర్ జావేద్ మియాందాద్ వచ్చారు. అప్పుడు కూడా క్రికెట్ మ్యాచ్ గురించే చర్చ జరిగింది. ఆ సందర్భంలో బాల్ ఠాక్రే, పాకిస్థాన్ నేల మీద నుంచి భారత్‌పై ఉగ్రవాద చర్యలు కొనసాగినంత కాలం క్రికెట్ ఆడడం జరగదు అని మియాందాద్ మొహం మీదే చెప్పారని ఈ సందర్భంగా ఉద్ధవ్ తెలిపారు. ప్రస్తుతం భారత విదేశాంగ విధానం చాలా బలహీనంగా ఉందని ఈ క్రికెట్ మ్యాచ్ ద్వారా నిరూపితం అయ్యిందని వ్యాఖ్యానిం చారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కేంద్రం తిరిగి తీసుకోలేక పోయిందని అన్నారు.

## సంక్షిప్తంగా..

### కాంగోలో రెండు పడవ ప్రమాదాలు: 193 మంది జలసమాధి



**కిన్షాస, సెప్టెంబరు 13:** డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో జరిగిన రెండు వేర్వేరు పడవ ప్రమాదాలు 193 మందిని బలి తీసుకున్నాయి. మరి కొం దరు గల్లంతయ్యారని ఆ దేశ మీడియాసహా అధికారులు పేర్కొన్నారు. ఈక్వెటార్ ప్రావిన్స్‌కు 150 కిమీ దూరంలో బుధ, గురువారాల్లో ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం లుకోలెలా భూభాగం నుంచి దాదాపు 500 మందితో ఓ పడవ బయలుదేరింది. ఈ దుర్ఘటనలో 107 మంది చనిపోయినట్లు కాంగో ప్రభుత్వం ప్రకటించింది. 209 మందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. మలాంగే గ్రామానికి చెందిన పడవ సాయంతో ప్రయాణికులను ఒడ్డుకు చేర్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నివేదిక ప్రకారం 146 మంది గల్లంతయ్యారని ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ పేర్కొంది. అంతకు ముందు రోజు బసాన్‌కుసు ప్రాంతంలో ఓ పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 86 మంది మృతి చెందారు. అందులో ఎక్కువ మంది విద్యార్థులేనని తెలిసింది.

### కెనడా కార్మిక విధానంలో మార్పులు



**ఒట్టావా, సెప్టెంబరు 13:** తాత్కాలిక విదేశీ కార్మికుల విధానంలో మార్పులపై కెనడా సంకేతాలిచ్చింది. నిర్దిష్ట రంగాలు, ప్రాంతాల్లో ఎవరు పని చేయాలనే నిబంధనల్లో సంస్కరణలు తీసుకురానుంది. ప్రధాని మార్క్ కార్నీ ప్రకటనతో సాఫ్ట్‌వేర్, వైద్యరంగానికి చెందిన విదేశీ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. శ్రమతో కూడిన పనులు చేసే వారికి మాత్రమే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తే తమ భవితవ్యం ప్రమాదంలో పడుతుందని భయపడుతున్నారు. తాత్కాలిక విదేశీ వర్కర్ల కార్యక్రమం ఒక 'కేంద్రీకృత విధానం'గా ఉండాలని పార్టీ కాకస్‌లో కార్నీ వ్యాఖ్యానించారు. అది కార్మిక అవసరాలను లక్ష్యంగా చేసుకొనేలా ఉండాలన్నారు. గృహనిర్మాణం, మౌలిక సదుపాయాలు, సామాజిక సేవారంగాలపై ఒత్తిడిని తగ్గించేలా మార్పులు అవసరమని పేర్కొన్నారు. శాశ్వత నివాసులు కాని వారి వాటాను తగ్గించాలని కార్నీ భావిస్తున్నారు. 2027 చివరికి జనాభాలో వారి వాటాను 7 నుంచి 5 శాతానికి తీసుకురావాలని ప్రణాళిక రచిస్తున్నారు. ఇది కార్యరూపం దాలిస్తే తాత్కాలిక కార్మికుల సంఖ్య భారీగా తగ్గనుంది.



## రాయ్‌బరేలి అభివృద్ధి సమీక్షలో రాహుల్, యుపి మంత్రుల వాగ్వాదం


**లక్నో,సెప్టెంబరు 13:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, యూపీ మంత్రి దినేశ్ ప్రతాప్ సింగ్ మధ్య వాగ్వాదం జరిగింది. రాయ్‌బరేలీ నియోజకవర్గం జిల్లా అభివృద్ధిపై జరిగిన దిశా మీటింగ్‌లో ఆ ఇద్దరి నేతల మధ్య మాటల యుద్ధం సాగింది. సెప్టెంబర్ 11వ తేదీన ఈ ఘటన జరిగింది. దానికి సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం వైరల్ అవుతోంది. నియోజకవర్గా అభివృద్ధి పనులపై చర్చ జరుగుతున్న సయమంలో ఇద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. దీంతో ఆ ఇద్దరూ గట్టిగా అరిచారు. తమ వాదనలను వినిపించే ప్రయత్నం చేశారు. ఒకవేళ రాయ్‌బరేలీ నియోజకవర్గం ప్రజల తరపున రాహుల్ గాంధీ పోరాడితే అప్పుడు ఆయనకు మద్దతు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. కానీ దిశా మీటింగ్ వేదికగా పార్టీ రాజకీయాలు ప్రచారం చేసినా, ప్రభుత్వాన్ని విమర్శించినా ఊరుకునేది లేదన్నారు.

## కేరళ వృద్ధునికి రూ.3.72కోట్ల 'సైబర్'టోపీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** డిజిటల్ అరెస్ట్ ఈ మధ్య సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పంథా. తాజాగా కేరళలోని కొల్లాంలో 79 ఏళ్ల వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. కొల్లం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దక్షిణ కేరళ జిల్లాలోని ఓ వృద్ధుడికి జులై 7న వాట్సప్‌లో వీడియో కాల్ వచ్చింది. కాల్ చేసిన వ్యక్తి తనను తాను బిఎస్ఎన్ఎల్ అధికారికగా పరిచయం చేసుకున్నాడు. అక్రమ కార్యకలాపాలకు మొబైల్ నంబరు వినియోగించినందుకు ముంబయి సైబర్ పోలీసులు ఈ నంబర్‌ను ట్రాక్ చేస్తున్నట్లు తెలిపారు. కొద్దిసేపటికీ దుండగులు పోలీసు దుస్తుల్లో వాట్సాప్ వీడియో కాల్ చేసి తాము ముంబయి సైబర్ పోలీసులమని పేర్కొంటూ నకిలీఅరెస్టువారెంట్ జారీ చేశారు. దీంతో ఆందోళన చెందిన వృద్ధుడు వారు చెప్పినట్లుగా వివిధఖాతాలకు జులై23 నుంచి ఆగస్టు 29మధ్య 17లావాదేవీలలో రూ. 3.72 కోట్లను బదలీ చేశాడు. వారు డబ్బు తిరిగి పంపకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

# 3 నిమిషాల్లో విరిగిన ఎముకలు అతికేందుకు 'బోన్‌గ్లూ'!

### చైనా శాస్త్రవేత్తల అద్భుత పరిశోధనలు



**బీజింగ్, సెప్టెంబరు 13:** వైద్య రంగంలో మరో అద్భుతం వెలుగులోకి వచ్చింది. విరిగిన ఎముకలను అతికించాలంటే గంటల తరబడి సాగే శస్త్రచికిత్సలు, స్టీల్ ప్లేట్లు, స్క్రూలు అవసరం లేకుండా కేవలం మూడు నిమిషాల్లోనే సరిచేసే ఒక ప్రత్యేకమైన 'బోన్ గ్లూ' ను చైనా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆర్థోపెడిక్స్ విభాగంలో ఇదొక విప్లవాత్మక మార్పుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. తూర్పు చైనాలోని షెజాంగ్ ప్రావిన్స్‌కు చెందిన పరిశోధకులు 'బోన్ 02' పేరుతో ఈ సరికొత్త జిగురును తయారు చేశారు. సముద్రంలోని ఆల్చిప్పలు నీటి అడుగున దేనికైనా బలంగా అతుక్కుపోయే గుణం నుంచి ప్రేరణ పొంది దీన్ని రూపొందించడం విశేషం. ఈ పరిశోధన బృందానికి నాయకత్వం వహించిన సర్ రన్ రన్ షా ఆసుపత్రి అసోసియేట్ చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ లిన్ షాన్‌ఫింగ్ ఈ ఆవిష్కరణ వివరాలను పంచుకున్నారు. మేము కొత్తగా అభివృద్ధి చేసిన ఈ గ్లూ, కేవలం రెండు లేదా మూడు నిమిషాల్లోనే విరిగిన ఎముకలను అతికిస్తుంది. తీవ్రమైన రక్తస్రావం జరుగుతున్న ప్రదేశంలో కూడా ఇది ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. సాంప్రదాయ పద్ధతుల్లో ఎముకల ఆపరేషన్ చేయాలంటే రోగి శరీరానికి పెద్ద కోత పెట్టి, లోపల స్టీల్ ప్లేట్లు లేదా రాడ్లు అమర్చాల్సి ఉంటుంది. ఇది రోగికి తీవ్ర నొప్పితో పాటు, కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. కానీ, ఈ కొత్త బోన్ గ్లూను ఒక సూది ద్వారా సులభంగా విరిగిన ప్రదేశంలోకి ఇంజెక్ట్ చేయవచ్చు. దీనివల్ల పెద్ద కోతల అవసరం ఉండదు, ఆపరేషన్ సమయం గణనీయంగా తగ్గుతుంది. నీరు, రక్తం ఉన్న చోట కూడా ఇది తన పటుత్వాన్ని కోల్పోకుండా ఎముకల మధ్య బలమైన బంధాన్ని ఏర్పరుస్తుంది. ఈ ఆవిష్కరణ భవిష్యత్తులో ఆర్థోపెడిక్ చికిత్సల స్వరూపాన్నే మార్చేస్తుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రోగులకు నొప్పిలేని, సులభమైన చికిత్స అందించి, వారు త్వరగా కోలుకునేందుకు ఇది దోహదపడుతుంది. ప్రస్తుతం మరిన్ని క్లినికల్ ట్రయల్స్ నిర్వహించి, దీని భద్రతను, ప్రభావాన్ని పూర్తిగా నిర్ధారించే పనిలో శాస్త్రవేత్తలు నిమగ్నమై ఉన్నారు.

# 13వ అంతస్తుపైనుంచి పడి తల్లీకొడుకు మృతి



**లక్నో, సెప్టెంబరు 13:** తల్లీకొడుకు ఇద్దరూ ప్రమాదవశాత్తు భవనం 13వ అంతస్తు నుంచి కిందపడి దుర్మరణం పాలయ్యారు. ఉత్తరప్రదేశ్ లోని గౌతమ్‌బుద్ధ నగర్ లో శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గౌతమ్‌బుద్ధనగర్‌లోని బిస్రక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల ఓ బహుళ అంతస్తుల భవనం 13వ అంతస్తులో దర్పన్ చావ్లా అనే వ్యక్తి తన భార్య, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. దర్పన్ చావ్లా కుమారుడైన 12 ఏళ్ల దక్ష్‌కు మతిస్థిమితం లేదు. దాంతో తల్లి అతడిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం దక్ష్ బిల్డింగ్ పైనుంచి దూకేస్తానని తల్లికి చెప్పి వేగంగా పరుగుతీశాడు. ఆ హఠాత్పరిణామాన్ని ఊహించని తల్లి కొడుకును కాపాడుకునేందుకు అంతే వేగంగా వెంటపడింది. దక్ష్‌ను అందుకునే ప్రయత్నంలో అతడితోపాటు కిందపడింది. ఈ ఘటనలో తల్లీకొడుకు ఇద్దరూ దుర్మరణం పాలయ్యారు.

# మధ్యప్రదేశ్ సిఎంకు తృటిలో తప్పిన ప్రమాదం

**భోపాల్, సెప్టెంబరు 13:** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్‌కు శనివారం నాడు తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన ఎక్కేందుకు సిద్ధమవుతున్న హాట్ ఎయిర్ బెలూన్ కు మంటలు అంటుకున్నాయి. దీంతో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది మంటలను అదుపు చేయడంతో సీఎంకు ప్రమాదం తప్పింది. మంద్‌సౌర్‌లోని గాంధీ నగర్ ఫారెస్ట్ రిట్రీట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి ఎయిర్ బెలూన్ ఎక్కడానికి సిద్ధమవుతుండగా బెలూన్ దిగువ భాగంలో మంటలు అంటుకున్నట్టు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. భద్రతా సిబ్బంది మంటలను అదుపు చేసి, ముఖ్యమంత్రి ట్రాలీని పట్టుకో వడంతో ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారు. దీంతో వెంటనే ఆయణ్ని అక్కడి నుంచి భద్రతా సిబ్బంది తరలించారు. ప్రమాదం కాదన్న అధికారులు కాగా, ఈ ఘటనపై మంద్‌సౌర్ జిల్లా కలెక్టర్ అదితి గార్గ్ వివరణ ఇచ్చారు. మంటలు వచ్చినట్టు వచ్చిన కథనాలు పూర్తిగా తప్పని అన్నారు. బెలూన్‌ను పరిశీలించేందుకే సీఎం వచ్చారని, సీఎం బెలూన్ ఎక్కలేదని చెప్పారు. మంటలు రావడంపై మాట్లాడుతూ, బెలూన్‌ను లిఫ్ట్ చేసేందుకు అందులోని గాలిని హీట్ చేయడం అనేది స్టాండర్డ్ ప్రాసెస్ అని చెప్పారు. ఏడేళ్ల అనుభవం ఉన్న బెలూన్ పైలెట్ మహమ్మద్ ఇర్ఫాన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బెలూన్ కోసం ఎల్పీజీ, ఫైర్‌ప్రూఫ్ కెవ్లార్ మెటీరియల్ వాడతామని, పూర్తి భద్రతా ప్రమాణాలకు లోబడి ఈ ప్రక్రియ ఉంటుందని చెప్పారు.

## రష్యాలో తీవ్రస్థాయి భూకంపం రిక్టర్‌స్కేలుపై 7.7గా నమోదు

**మాస్కో, సెప్టెంబరు 16:** రష్యాలోని కామ్‌చట్కా ద్వీపకల్పంలో ఇవాళ శక్తివంతమైన భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై ఆ భూకం తీవ్రత 7.7గా నమోదు అయ్యింది. దీంతో అధికారులు సునామీ వార్నింగ్ జారీ చేశారు. అన్ని ఎమర్జెన్సీ సర్వీసులను హై అలర్ట్‌లో ఉంచారు. కామ్‌చట్కా ప్రాంతీయ రాజధాని పెట్రోపవలోస్కీలో భూకంప తీవ్రత 6.3గా ఉన్నట్లు గవర్నర్ వ్లాదిమిర్ సోలోడోవ్ తెలిపారు. బలమైన భూకంపం రావడంతో స్థానిక అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. కీలక ప్రదేశాలను, రెసిడెన్షియల్ బిల్డింగ్‌లను తనిఖీ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎటువంటి డ్యామేజ్ అయినట్లు రిపోర్టు కాలేదు. నివాసితులు జాగ్రత్తగా ఉండాలని ఆదేశాలు ఇచ్చారు.

## ఇది ప్రధానుల సంప్రదాయం కానేకాదు: ప్రియాంకగాంధీ



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 13:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. 2023లో ఈశాన్య రాష్ట్రంలో హింసాత్మక ఘర్షణల తర్వాత మోదీ ఇక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో మోదీ పర్యటనపై విప క్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మణిపూర్ పర్యటనపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తీవ్ర విమర్శలు చేశారు. ఘర్షణలు చోటు చేసు కున్న రెండేండ్ల తర్వాత రాష్ట్రంలో మోదీ పర్యటించడం దురదృష్టకరమన్నారు. వయనాడ్ పర్యటనలో ఉన్న ప్రియాంక గాంధీ అక్కడ విలేకరులతో మాట్లాడారు. ఆయన ఇప్పటికే అక్కడ పర్యటించి ఉండాల్సింది. భారత్ లోని ప్రధానమంత్రుల సంప్రదాయం ఇది కాదు.

14-09Pg6exHMNWJQE 10_14-09Pg6exHMNWJQE.qxd 9/13/2025 11:58 PM Page 1



# వచ్చే అక్టోబర్ నాటికి బందరుపోర్టు అందుబాటులోకి తెస్తాం

## : రవాణా రహదారుల భవనాల శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి యం.టి.కృష్ణబాబు



మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కృష్ణబాబు

**గన్నవరం(కృష్ణా), సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తిచేసి పోర్టునుండి కార్యకలాపాలు ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు వేగవంతం చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా రహదారుల భవనాల శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి యం.టి.కృష్ణబాబు తెలిపారు. శనివారం ఉదయం ఆయన అధికారులతో కలిసి బందరుపోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. నార్త్, సౌత్ బ్రేక్‌వాటర్, డ్రెడ్జింగ్, బెర్తులు, రహదారులు, పరిపాలనా భవనాలు, గిడ్డంగుల నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అవసరమైతే యంత్రాలు, మానవ వనరులను పెంచి నిర్దేశిత సమయానికి పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రూ.5,500కోట్ల ఖర్చుతో చేపట్టిన పోర్టు నిర్మాణ పనులు వచ్చే ఏడాదికి పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం నిర్దేశించారని, ఈమేరకు బ్రేక్‌వాటర్, బర్తులు, డ్రెడ్జింగ్ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇక్కడ మొత్తం 16 బెర్తులు నిర్మించాల్సి ఉండగా ఫేజ్ 1లో నాలుగు బెర్తులు పూర్తిచేస్తున్నట్లు చెప్పారు. దీనికి అనుబంధంగా పోర్టుకి రహదారులు అనుసంధానం చేసేందుకు జాతీయరహదారుల సంస్థతోనూ, కేంద్రంతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అమరావతి అవుటర్‌రింగ్‌రోడ్డు వచ్చే ఏడాది మార్చిలోగా అవార్డు జారీచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా విజయవాడ నుండి మచిలీపట్నంరోడ్డ అభివృద్ధిపనులు చేపడు తున్నామన్నారు. దీనితోపాటు విసన్నపేట-పెడన రహదారి విస్తరణ కోసం ఇప్పటికే డిపిఆర్‌ను కేంద్రప్రభుత్వానికి పంపించామని ఇవి పూర్తయితే మచిలీపట్నంకు రోడ్ కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. మిగిలిని మూడితో పోల్చితే హార్బర్ పనులు మందకొండిగా సాగుతున్నాయన్నారు,

## వాడపల్లి క్షేత్రానికి లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , సెప్టెంబర్ 13,(ప్రభాతవార్త)** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం లక్షలాది భక్తులు తరలివచ్చి స్వామివార్ని దర్శించుకున్నారు. రెండవ శనివారం సెలవు దినం కావడంతో భక్తుల రద్దీ పెరగడంతో మాడ వీదులు జనసంద్రంగా మారాయి. సుమారు లక్షకు పైగా భక్తులు రావడంతో వాడపల్లి క్షేత్రం భక్త జనంతో కిక్కిరిసింది. మాడవీధులన్నీ గోవింద నామ స్మరణతో మారుమ్రోగాయి. ఉదయం సుప్రభా సేవతో మొదలైన స్వామి వారి దర్శనాలు రాత్రి పదిగంటలవరకు కొనసాగాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లలో భక్తులకు మంచినీళ్ల సదుపాయం, చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు, వృద్ధులకు గర్భిణీ స్త్రీలకు ఉచితంగా బ్యాటరీ కార్లలో పార్కింగ్ నుంచి గుడి వరకు వెళ్లే సదుపాయం,మెడికల్ క్యాంపులు తదితర సౌకర్యాలను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

# దసరా ఏర్పాట్లు - క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలన



క్యూలైన్లు పరిశీలిస్తున్న కలెక్టర్

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో ఈ నెల 22 నుండి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి కావాల్సిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను కలెక్టర్ డా లక్ష్మీషా శనివారం ఇఓ వికె శీనా నాయక్ , ఏడిసిపి రామకృష్ణ, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఇంజనీర్లు కెవిఎస్ఆర్ కోటేశ్వరరావు, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 22 నుండి జరగబోయే దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఆర్జిత సేవలైన ప్రత్యేక ఖడ్గమాలార్చన (రు.1500), ప్రత్యేక కుంకుమార్చన (రు.1500), ప్రత్యేక చండీయాగం (రు.1500), ప్రత్యేక శ్రీచక్రనవణార్చన (రు.1500) సేవల్లో పరోక్షంగా పాల్గొనటానికి వీలుగా మార్గదర్శకాలను ప్రతిపాదిస్తూ టికెట్లను రూపొందించాలని దేవదాశాఖ కమీషనర్ ఐటి విభాగానికి ఆదేశాలిచ్చారు. అలాగే పైన తెలిపిన ఆర్జిత సేవలన్నింటికి పది రోజులకు గాను రు.11,116లు (ఒక టికెట్‌పై ఒక్కరికి మాత్రమే) రుసుము నిర్ణయిస్తూ ఆదేశాలిచ్చారు. పరోక్ష సేవల్లో పాల్గొనే భక్తులు టికెట్లను దేవస్థానం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా గాని, ఏపి ప్రభుత్వ వెబ్‌సైట్, మనమిత్ర యాప్ ద్వారా గాని విక్రయించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. పరోక్ష టికెట్లు పొందిన వారు వర్చువల్‌గా మాత్రమే సేవలో పాల్గొనవలసి వుంటుందని వివరించారు.

# శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు - కదలి వచ్చిన భక్త జనం

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 13 ప్రభాతవార్త** శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో కిట కిట లాడింది. వరుస సెలవులతో తండోప తండాలుగా కడలి తరంగాల్లా భక్తులు కదలి వచ్చా రు. ఆలయంలో వెలసిన శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. కాగా అభయ వెంకటేశ్వరునికి ప్రత్యేకాలంకారాలు జరిపారు. వచ్చిన భక్తులు క్యూలైన్లలో నిరీక్షించకుండా ఇఓ డి.బాపిరెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఆలయంలోనూ, పట్టణంలో ఎటు చూసినా భక్తుల సందడికనబడింది. వ్యాపార సంస్థలు హోటళ్ళు కిట కిట లాడాయి. ఉదయం నుంచి ఆలయంలో వరదలా భక్తులు కదలి వచ్చారు.రూ.500ల రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకున్న భక్తులకు దర్శనానికి దక్షిణామూర్తి ఆలయం పక్క నుంచి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి సత్వర దర్శనంకు అవకాశం కల్పించారు. విఐపిల తాకిడి అధికమైంది. సామాన్య భక్తులు గంటల తరబడి స్వామి అమ్మవార్ల ధర్శనానికి నిరీక్షించాల్సి వచ్చింది. ఒక్కసారిగా ఆలయానికి భక్తుల వరదలా రావటంతో కొందరు భక్తులు తోసులాటకు అవకాశం కల్గింది. ఆలయంలో ఎవరు సామాన్యభక్తులో ఎవరు విఐపిలో అర్థం కాని పరిస్థితి చోటు చేసుకుంది. ఆలయాధికారులు ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెడుతున్నా దళారులు, అక్రమ సంపాదన పరులు మరో దారి ఎంచుకున్నారు. శనివారం క్యూలైన్లలో ఉన్న సామాన్యభక్తులు అంతరాలయ దర్శనానికి వెళుతున్న వారికి సంబంధించి వారిని ఎందుకు అనుమతిస్తున్నారని ప్రశ్నించటం కనబడింది. ఆలయంలో మధ్యాహ్నం 1గంటకు డ్యూటీలు మారుతారు.



కాళహస్తీశ్వరాలయంలో దర్శనం కోసం నిరీక్షిస్తున్న జనం

షిఫ్టుల్లో పని చేసే వారు మారటం జరుగుతుంది. ఈ సమయంలో పూజలకు కూర్చొన్న భక్తులు అసహానానికి గురౌతున్నారు.

మధ్యాహ్నం డ్యూటీకి వచ్చే వేదపండితులు ఆలస్యంగా రావటంతో భక్తుల్లో అసంతృప్తి చోటు చేసు కుంటుంది. డ్యూటీకి వచ్చే వారు కొంత ముందు వస్తే ఈ సమస్య ఉండదు.

# అమరావతిపై వైఎస్సార్సీ నేతలవి అవాస్తవాలు

## తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



టిడిపి కార్యాలయంలో మాట్లాడుతున్న తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 13:** అమరావతి రాజధాని విషయంపై అందితే జుట్టు, అందకపోతే కాలు అన్న చందాన వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ...వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అమరావతి రాజధానిపై తప్పుడు ప్రచారం చేసి, ఇప్పుడేమో అమరావతే రాజధానిగా ఉంటుందనడం వారి నక్కజిత్తులను తెలియజేస్తోంది. అప్పుడేమో అమరావతిని భ్రమరావతి అన్నారు. ఇప్పుడు అమరావతే రాజధానిగా ఉంటుందని నక్క వినయాలు ప్రదర్శిస్తున్నారు. దీన్ని బట్టి మోసానికి ప్రతిరూపం జగన్ అని అనిపిస్తోంది. వైసీపీ నాయకుల మాటలకు విశ్వసనీయత లేదు, మాట మారుస్తారు, మడమ తిప్పుతారు. నక్క జిత్తులను ప్రదర్శిస్తారు. ఇటీవల జరిగిన వేటు న్యూస్ కాంక్లేవ్ లో వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అమరావతి రాజధాని మీద కొత్త భాష్యం చెప్పారు. అసలు సజ్జల అర్హత ఏమిటి? గతంలో తాడేపల్లి [illegible] పేరుపొందాడు. ఇప్పుడు నోటి కొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అమరావతే రాజధానిగా ఉంటుందంటున్నారు. 2019 లో జగన్ మాట్లాడిన మాటలను మరోసారి సజ్జల చెప్పారు. 2019లో జగన్ కు అమరావతే రాజధాని గా ఉంచాలని ఆలోచించాడని 2024 లో విశాఖపట్నం రాజధానిగా ఉంటుందని, అక్కడ నుంచి పరిపాలన సాగించాలని అనుకున్నాడని అన్నారు. అయితే ప్రస్తుతం మళ్లీ , 2029 ఎన్నికల తర్వాత అమరావతి నుంచే పరిపాలన సాగిస్తారని చెప్పారు. ఇలా ఇన్ని రకాలుగా మాట్లాడారు. సజ్జల ఈ వేటు న్యూస్ కాంక్లేవ్ కార్యక్రమంలో నాలుక మడతేసే మాటలు మాట్లాడారు. వీటన్నింటిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. విధానపరమైన విధానాలు ప్రకటించే హక్కు సజ్జలకు లేదు. ఒకవేళ మాట్లాడాలంటే జగన్ మాట్లాడాలి. జగన్, సజ్జల లు మోసానికి ప్రతిరూపం. సజ్జల ప్రజల్ని మరోసారి మోసం చేయడానికి సిద్ధమయ్యారని ఆయన ప్రకటన ద్వారా తెలుస్తోంది. 201419 కాలంలో అసెంబ్లీ లో రాజధాని నిర్ణయం జరుగుతున్నప్పుడు రాజదానికి సంబంధించి జగన్ మాట్లాడుతూ.. అసలే రాష్ట్రం చిన్నదైంది. ప్రాంతాలమధ్య చిచ్చు పెట్టదలచుకోలేదు. రాజధానిని గుంటూరు విజయవాడ మధ్య ఎక్కడైనా పెట్టండి.. కనీసం 30 వేల ఎకరాలకు తగ్గకుండా చూడండి అన్నారు. వైసీపీ సంపూర్ణంగా మద్దతిస్తోందని చెప్పారు. 2019 ఎన్నికలకు వెళ్తున్నప్పుడు అమరావతి ప్రాంతంపై జగన్ కు ప్రేమ ఉంది

## యేడాది అయినా ఎవరికీ దక్కని శివయ్య సేవా భాగ్యం

**శ్రీకాళహస్తి,జూన్ 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ పదవులు తప్ప నామినేటెడ్ పదవులు ఏడాది అయినా దక్కలేదు. ఇక్కడ శాసనసభ్యుడు ఏ నిర్ణయం తీసుకోవాలన్నా, ఇతర పదవులు ఎవరికి ఇవ్వాలనే అంశం శ్రీకాళహస్తీశ్వరుని పాలకమండలి నియామకం మీద ఆధారపడి ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉన్న కీలక నామినేటెడ్ పదవులు ఒక్క శ్రీకాళహస్తీశ్వరాలయమే. అయితే ఏడాదిన్నరగా అదిగో ఇదిగో అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేవస్థానం పదవులకు సంబంధించి ఊరిస్తున్నారు. మహానాడుకు ముందు అన్ని నామినేటెడ్ పదవుల భర్తీ చేస్తామంటూ ప్రకటించారు.కానీ మహానాడు అయి రెండు నెలలు దాటుతున్నా దేవాలయాల పదవుల భర్తీకి మోక్షం లభించలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయం పదవిని కష్టకాలంలో తనతో పాటు నడచిన మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్య నాయుడుకే అని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు.

# 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' తో వైసిపిలో వణుకు

## టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 13:** సూపర్ సిక్స్ సూపర్ హిట్‌తో వైసీపీలో వణుకు పుడుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద్ సూర్య అన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ"సూపర్ సిక్స్ - సూపర్ హిట్" కార్యక్రమం అనంతపురంలో విజయవంతమవడంతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని వ్యాఖ్యానించారు."కూటమి ప్రభుత్వం తీసుకున్న పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయి. అందుకే జగన్ రెడ్డి, వైసీపీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నార్హు అని అన్నారు. సూపర్ సిక్స్ - సూపర్ హిట్ విజయోత్సాహం :"సెప్టెంబర్ 10న అనంతపురంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్, బీజేపీ నేత మాధవ్ పాల్గొన్న మహాసభలో లక్షలాది ప్రజలు గుమికూడారు. అక్కడ ప్రజలు కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలపై హర్షం వ్యక్తం చేశారు. అదే సమయానికి వైసీపీకి వెన్నులో వణుకు పుట్టింది. 151 సీట్లు గెలిచి అధికారంలోకి వచ్చిన జగన్ పార్టీ ఇప్పుడు 11కి పడిపోయే స్థితిలో ఉందని స్పష్టమైంద్హి అని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం :"ప్రతి నెల ఒకటవ తేదీకి 64 లక్షల మందికి ఇంటి గుమ్మం వద్దకే పెన్షన్లు అందుతున్నాయి. ఇప్పటివరకు ఈ పథకానికి రూ.45 వేల కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇదే చంద్రబాబు నాయకత్వంలోని నిబద్ధత" అని ఆయన తెలిపారు. స్త్రీ శక్తి పథకం :"మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఇప్పటివరకు ఐదు కోట్ల ప్రయాణాలు జరిగాయి. దీని వలన కుటుంబాలకు 200 కోట్లు ఆదా అయ్యాయి. ఈ పథకం మహిళల జీవితాల్లో పెద్ద మార్పు తీసుకొచ్చింద్హి అని వివరించారు. దీపం-2 పథకం :"రూ.1704 కోట్లతో 2.45 కోట్ల సిలిండర్లు రాష్ట్ర ప్రజలకు అందించాం. ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఈ పథకం వల్ల పేదలకు ఊరట లభిస్తోంది" అని చెప్పారు. అన్నదాత సుఖీభవ :"జగన్ పాలనలో రైతులకు ఇచ్చింది కేవలం 13,500 రూపాయలే. అందులోనూ 38 లక్షల మందికే పరిమితం.



లేపాక్షి చిత్ర కళా ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థినిలు

# లేపాక్షి హస్తకళల ప్రదర్శనలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ విద్యార్థులు

**విజయవాడ, సెప్టెంబర్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** లేపాక్షి హస్తకళల డిజైన్ పోటీ, మాస్టర్‌పీసెస్ ఎగ్జిబిషన్‌లో యువ డిజైనర్ల స్వరాలు ప్రతిధ్వనించాయి. జాతీయ డిజైన్ సంస్థ ఆంధ్రప్రదేశ్ కి చెందిన 25 మంది విద్యార్థులు సంప్రదాయ హస్తకళల ఆభిరుచిని ఆస్వాదిస్తూ శనివారం లోతైన అధ్యయనం చేశారు. టెక్స్‌టైల్ డిజైన్, ఇండస్ట్రియల్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్ వంటి విభాగాల్లో ప్రత్యేకత కలిగిన విద్యార్థులు ప్రదర్శనలోని కళాఖండాలను పరిశీలించి - డిజైన్, నాణ్యత, వినియోగ ప్రయోజనాలు, ప్రజెంటేషన్ అంశాలపై విశ్లేషణ జరిపారు. నైపుణ్యం కలిగిన కళాకారుల ప్రతిభను ప్రశంసించిన వీరు, ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సంప్రదాయాన్ని కాపాడుకుంటూ కొత్త ఆలోచనలు అందించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి ) ఎండి విశ్వ మనోహరన్ రాష్ట్ర హస్తకళా రంగంలో నూతనత్వాన్ని ప్రవేశపెట్టేందుకు చేపట్టిన భాగస్వామ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సందర్శన నిర్వహింపచేశారు. విద్యార్థులు కళాకారులు, సందర్శకులతో చర్చించి - డిజైన్ మెరుగుదలలు, ఆధునిక ప్యాకేజింగ్, మార్కెటింగ్ వ్యూహాలపై తమ సూచనలు ఇచ్చారు. ఇది మాకు నేర్చుకునే అవకాశం మాత్రమే కాదు, కళాకారుల కృషికి విలువ చేకూర్చే డిజైన్ ఆలోచనలను పంచుకునే అవకాశం కూడా," అని ఒక విద్యార్థి అభిప్రాయపడ్డారు. సంప్రదాయ హస్తకళలను సంరక్షిస్తూ వాటిని గ్లోబల్ మార్కెట్‌కు తీసుకెళ్లే ప్రభుత్వ కట్టుబాటును ఈ ప్రయత్నం ప్రతిబింబిస్తోంది.

విద్యార్థులతో పాటు ఫ్యాకల్టీ డిజైన్ ఫౌండేషన్ విభాగం అధ్యాపకురాలు స్వాతి పాండే సిన్హా కూడా పాల్గొన్నారు.



గాయపడ్డ సెక్షన్ ఆఫీసర్ సుకుమార్

## అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్‌పై ఏనుగు దాడి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స

**పలమనేరు టౌన్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పలమనేరు, గంగవరం మండలాల్లో ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. శనివారం తెల్లవారు జామున 6గంటల సమయంలో రొంటకుంట్ల గ్రామం వద్ద నేషనల్ హైవే పక్కనే ఫ్లై ఓవర్ వద్ద ఈ ఏనుగు ప్రత్యక్ష మైంది. వాకింగ్ వెళ్ళే వారు ఈ విషయం గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన సెక్షన్ ఆఫీసర్ సుకుమార్ సిబ్బందితో వెళ్ళి ఏనుగును దూరం నుంచి అడ్డుకున్నారు. సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తరిమి వేయాలని ప్రయత్నించగా ఎదురు తిరిగింది. హటాత్తుగా దాడి చేసి తొండంతో ఎత్తి విసిరి వేసి కాళ్ళతో తొక్కింది. దీంతో కాలు చెయ్యి విరిగి ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. అటవీ శాఖ సిబ్బంది గ్రామస్తులు అరచి కేకలు వేయగా ఏనుగు పరుగులు తీసింది. గ్రామస్తులు తప్పెట్లు, బాణ సంచా కాల్పులతో వెంబడించగా పంట పొలాల వెంబడి దాదాపు 4 గంటల పాటు ముప్పు తిప్పలు పెట్టింది. చివరకు 11 గంటల సమయంలో పాత కీలపట్ల రహదారి నుండి పలమనేరు పక్కనే ఫ్లై ఓవర్ కిందకు వచ్చి గంటా పూరులో ప్రవేశించింది. అక్కడే ఎంబిటి రోడ్డులో ఉన్న బొమ్మల తయారీ దారులు దుకాణాలు వదిలి పరుగులు తీశారు. చివరకు గొబ్బళ్ళ కోటూరు పక్కనే అటవీ ప్రాంతం లోకి వెళ్ళి పోయింది. గాయపడ్డ సెక్షన్ ఆఫీసర్‌ను అటవీశాఖ వాహనంలో పలమనేరు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. కాలు చెయ్యి విరిగి నట్లు వైద్యులు ధృవీకరించడంతో మెరుగైన చికిత్స కోసం రూయా ఆసుపత్రి తరలించారు.

## జనాభా ప్రాతిపదికగా కాపు రిజర్వేషన్లివ్వాలి

### రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు

**విజయవాడ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** జనాబా ప్రాతిపదికన కాపులకు రిజర్వేషన్లు ఇవ్వాలంటూ కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 12శాతం వున్న కాపులకు ప్రత్యేక రిజర్వేషన్లు 12శాతం కూటమి ప్రభుత్వం ఇవ్వాలన్నారు. బిసిలకు 34శాతం, ఇతర అగ్రకులాల పేదలకు 10శాతం ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లు ఇస్తున్న కూటమి ప్రభుత్వం కాపులపట్ల ద్వంద్వ నీతిని విడనాడి ప్రత్యేక రిజర్వేషన్లివ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, కోఆర్డినేటర్ జానపాముల నాగబాబు, కో కన్వీనర్స్ బోడ పాటి పెదబాబు, కాకిలేటి హరనాథ్, సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జంగాల సింగారయ్య యాదవ్, నేతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### విఆర్ఓ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు

**విజయవాడ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రజలకిచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ చేసిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర విఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. ఉద్యోగులకు పెండింగ్ డిఎలు, పిఆర్‌సి కమీషన్, ఐఆర్, పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ అమలుకు చిత్తశుద్ధితో కృషి చేసిన ఉద్యోగులకు ఈ దసరా కానుకగా తీపి కబురు చెబుతారని ఆశాభావాని వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఓపిఎస్ పై తగు నిర్ణయం ప్రకటించాలని సిఎం చంద్రబాబు నాయుడును, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరారు. ఉద్యోగులకు రు.25వేల కోట్ల బకాయిలు విడుదల చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్న జెఎసి వారి భాగోతం మొత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలుసునని, ఆ నేతలు గత ప్రభుత్వ హయాంలో నోరు మెదపకుండా, ఇపుడు కూటమి ప్రభుత్వం గౌరవాన్ని అప్రదిష్ట చేసేలా మాట్లాడుతున్నారన్నారు. వారికి కూటమి ప్రభుత్వం భయపడబోదన్నారు. ఒక సీనియర్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉద్యోగులకు తీపి కబురు చెపుతారన్నారు.

# కన్నుల పండువగా గణనాధుని పుష్పపల్లకిసేవ

**కాణిపాకం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా శనివారం పుష్పపల్లకిసేవను వైభవోపేతంగా నిర్వహించారు. కాణిపాకం బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో ముఖ్యమైన సేవల్లో పుష్పపల్లకిసేవ ఒకటి. ఈకార్యక్రమానికి శ్రీమతి.కె. భాగ్యలక్ష్మమ్మ, చిగరపల్లె, ఎన్.దామోదర్‌నాయుడు మరియు కుటుంబసభ్యులు కాకర్లవారిపల్లె , కె.మోహన్‌నాయుడు అండ్ బ్రదర్స్, చిత్తూరు, కీ॥శే॥ఆర్. శేషాద్రినాయుడు అండ్ బ్రదర్స్, వి.టి.రాజన్ బ్రదర్స్,తిరువణంపల్లె, ఎం.రామనాథం నాయుడు, తిరువణంపల్లె, జి.కృష్ణమనాయుడు అండ్ సన్స్, అడపగుండ్లపల్లె, ఎ.నరసింహారెడ్డి అండ్ సన్స్,అగరంపల్లె, కీ॥శే॥ఎం.రాజారెడ్డి అగరంపల్లె, కీ॥శే॥యం.శ్రీరాములురెడ్డి అగరంపల్లె, కీ॥శే॥యం.బాలకృష్ణారెడ్డి అండ్ కో చిత్తూరు, మొగిలీశ్వర ఏజన్సీస్, చిత్తూరు, జి.శేషయ్యనాయుడు అండ్ సన్స్ చిత్తూరు, బి. కుమరేం ద్ర చౌదరి, సి.ఎ.చిత్తూరు, యం.మనోహర్‌నాయుడు అండ్ బ్రదర్స్ అడపగుండ్లపల్లె, జి.ఆంజనేయులు నాయుడు అండ్ సన్స్ చింతగుంపలపల్లెలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వారు ఉడయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ఘనంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి చందనాలంకారం చేసి వివిధరకాల పుష్పాలతో అలంకరి ంచి ప్రత్యేక పూజలు చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరిగి రాత్రి సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలోవుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల దేశీయ, విదేశీజాతి పుష్పాలు, రంగురంగుల విద్యుద్ధీపాలతో దేధీప్యమానంగా భారీ ఎత్తున ఏర్పాటు చేసిన ప్రత్యేక పుష్పపల్లకిపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి మరోమారు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

# బాటిల్ మూత గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి

**గుత్తి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త** అనంతపురం జిల్లా గుత్తి పట్టణ శివారు ప్రాంతంలో వున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టిపిసి క్వార్టర్స్‌లో ప్రమాదవశాత్తు ఓ చిన్నారి బాటిల్ మూత మింగి మరణించాడు. వివరాలు ఇలా వున్నాయి. ఏపి ట్రాన్స్‌కోలో ఏడిఇగా విధులు నిర్వహిస్తున్న మౌనిక ఎన్‌టిపిసిలో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి విధుల నిర్వహణలో వుండగా కుమారుడు రక్షతరామ్‌కు ఆడుకోవటానికి నీటి బాటిల్ ఇచ్చారు. అయితే ఆ చిన్నారి ప్లాస్టిక్ బాటిల్ మూతను నోట్లో పెట్టుకోవడంతో అది కాస్త గొంతులో ఇరుక్కుపోయింది. గమనించిన చిన్నారి తల్లి హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆ బాలుడు మృతి చెందాడు. దీంతో ఆమె రోధనతో ఆసుపత్రి దద్దరిల్లిపోయింది. ముక్కు పచ్చలారని చిన్నారి మృతి ఆసుపత్రి వర్గాలను సైతం కలచి వేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇద్దరు మహిళల అపహరణ యత్నం!

## - మహిళ అప్రమత్తతో బెడిసికొట్టిన రౌడీషీటర్ దురాగతం

**తిరుపతి,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** వివాహేతర సంబంధం కలిగిన ఓ వ్యక్తి చివరకు తల్లీ కుమార్తెలను అపహరణచేసి కారులో తరలిస్తుండగా ,అప్రమత్తమైన మహిళ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బెడసికొట్టింది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి తిరుపతినగరంలో చోటుచేసుకుంది. తిరుపతి నగరంలోని లక్ష్మీపురంకూడలిలో అజీమ్ జిమ్ నిర్వహిస్తున్నాడు. ఇతను నారాయణపురంకు చెందిన ఓ మహిళ(40)తో వివాహేతర సంబంధం కలిగివున్నాడు. వీరిమధ్య చిన్నచిన్న గొడవలు జరిగేవి. భర్తకు విషయం తెలిస్తే నా కాపురం నాశనం అవుతుందని పదపదే ఆమె చెప్పినా వినిపించుకోని అజీమ్ ఇటీవల ఓ కేసులో జైలుకెళ్ళాడు. జైల్లో ఉన్న అజీమ్ నాలుగురోజుల క్రిందట విడుదలై వచ్చాడు. రావడంతోనే మళ్ళీ ఆ మహిళతో ఫోన్‌లో వివాహేతర సంబంధం విషయంగా మళ్ళీ కొనసాగించాలని చూశాడు. తనకు పూర్తిగా సహకరించకుంటే ఈ విషయం భర్తకు చెప్పి కాపురం నాశనం చేస్తానని బెదిరించాడు.అంతేగాక నా మాట వినకుంటే ఇద్దరు పిల్లలను చంపేస్తానని బెదిరించాడని పోలీసులు తెలిపారు.చేసేదిలేక ఆ మహిళ తల్లితో కలసి జిమ్‌వద్దకు వెళ్ళింది. దీన్ని అదనుగా తీసుకున్న నిందితుడు వెంటనే కారులో వారిద్దరినీ బలవంతంగా తీసుకుని వెళ్ళాడు. అప్పటికే అతని పరిస్థితి బాగోలేకపోవడంతో కారును వేగంగా నడిపి తిరుపతిలోని పలు వీధుల్లో నడుపుతూ పార్కింగ్‌లో ఉన్న రెండు కార్లు, ద్విచక్రవాహనాలను ఢీ కొన్నాడు. దీంతో కొంత తేరుకున్న మహిళ తన సెల్‌ఫోన్‌నుండి లోకేషన్‌ను పోలీసులకు, భర్తకు తెలియజేసింది. వెంటనే రాత్రి గస్తీలో ఉన్న అలిపిరి సిఐ రామకిశోర్, సిబ్బంది రంగంలోకి దిగి కారును వెంబడించారు. పోలీసులు రాకతో కారును వదలి పరారవుతున్న అతనిని అదుపులోకితీసుకున్నారు. కారును సీజ్ చేశారు. ఇద్దరు మహిళలను కిడ్నాపర్‌బారినుండి కాపాడారు. పోలీసుల సమయస్ఫూర్తి, సకాలంలో వేగంగా స్పందించడంతో నిందితుడు కిడ్నాప్ యత్నం బెడసికొట్టింది. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

# మెరుగైన రహదారుల కల్పనే లక్ష్యంగా భవిష్యత్తు కార్యాచరణ : మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రహదారుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతుందని రాష్ట్ర రోడ్లు. భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. రహదారుల మరమ్మతులు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, రాబోయే రోజుల్లో ఆర్ బీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 45,433 కి.మీ ఆర్ బీ శాఖ పరిధిలో రహదారులు ఉండగా.. అందులో దాదాపు 31,854 కి.మీ రహదారులకు మరమ్మతులు చేయాల్సి అవసరం ఉంది.. ప్రస్తుతం రాష్ట్రంలో మరమ్మతులు చేపట్టాల్సి ఉన్న దాదాపు 31,854 కి.మీ రోడ్లకు సంబంధించి.. ఇప్పటికే ఎన్‌డిబి, సీఆర్‌ఎఫ్ ప్లాన్ కింద రద్దు చేయబడిన రహదారులు మరమ్మతులు చేయడానికి వీలు లేకుండా దెబ్బతిన్న సీ కేటగిరీ కింద రహదారులు కలిపి మొత్తంగా 6,333 కి.మీ రోడ్లు ఉన్నాయి.. వీటిలో మరమ్మతులు చేయాల్సి ఉన్న రహదారులు 25,521 కి.మీ మేరకు ఉన్నాయి.. ఈ 25,521 కి.మీ రహదారుల్లో ప్రస్తుతం తీవ్రంగా దెబ్బతిని తక్షణం మరమ్మతులు చేయాల్సిన 5950 కి.మీ రహదారుల మరమ్మతులు చేయడానికి వివిధ డివిజన్ల నుంచి రూ. 620 కోట్ల ప్రతిపాదనలు వచ్చాయి.వాటిలో రూ. 500 కోట్లతో ఆయా మరమ్మతులు పూర్తి చేయడానికి అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసుకోవడం జరిగింది... మిగిలిన 19,571 కి.మీ రహదారులను వార్షిక మెయింటెనెన్స్ కింద అభివృద్ధి చేయాల్సి ఉంది.

# కేంద్ర 8వ వేతన సంఘాన్ని తక్షణం ఏర్పాటు చేయాలి

## - జాతీయ మహాసభల్లో ఎన్‌ఎఫ్ఐఆర్ డిమాండ్



**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 13,ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం తక్షణం 8వ కేంద్ర వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ (ఎన్‌ఎఫ్ఐఆర్) జాతీయ ప్రధాన కార్యదర్శి డా. మర్రి రాఘవయ్య, దక్షిణ మధ్య రైల్వే జోనల్ కార్యదర్శి ఎం భరణి భానుప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఇటీవల న్యూఢిల్లీలో ఎన్‌ఎఫ్ఐఆర్ 31వ జాతీయ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన రైల్వే కార్మికులనుద్దేశించి వారు మాట్లాడుతూ రైల్వేలో ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలకు స్వస్తి పలకాలని కోరారు. ఏటా పెరుగుతున్న నూతన రైలు మార్గాలు, విద్యుదీకరణ, కొత్త రైళ్లవంటి మౌలిక సదుపాయాలకు అనుగుణంగా రైల్వేలో యాక్ట్ అప్రెంటిస్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులచే వారి వారి విద్యార్హతల మేరకు సబ్‌స్టిట్యూట్‌లుగా నియమించుకుని సిబ్బందిపై పని భారాన్ని తగ్గించాలని సూచించారు. రైల్వే భద్రతా విభాగాలలో, నాన్ సేఫ్టీ కేటగిరీలలోని పోస్టులను భర్తీ చేయాలని, పోస్టుల రద్దు నిర్ణయాలను ఉపసంహరించుకోవడంతో పాటు కొత్త పోస్టుల భర్తీపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేయాలని కోరారు. ఉత్పాదకంతో కూడిన బోనస్ పైగల సీలింగ్‌ను ఎత్తివేయాలని, కోవిడ్-19నెపంతో, 2020జనవరి నుంచి 2021జూన్ వరకు స్థంభింపచేసిన మూడు విడతల కరువు భత్యాన్ని తక్షణం విడుదల చేయాలన్నారు. పాత పెన్షన్ పథకాన్ని తక్షణం పునరుద్ధాటించాలని కోరారు.

14-09Pg7exHMNWJQE 11_14-09Pg7exHMNWJQE.qxd 9/13/2025 11:57 PM Page 1






ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న దాసోజు శ్రవణ్

## కేబుల్ వైర్లు కట్‌చేస్తే ప్రభుత్వ పవర్‌ను కట్ చేస్తాం

### ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్స్ మహాధర్నా

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** కేబుల్ ఆపరేటర్ వృత్తిని దెబ్బతీస్తూ ప్రభుత్వం రాత్రికిరాత్రే కేబుల్ వైర్లు కట్ చేయించటం దుర్మార్గమని, ఇంకోసారి కేబుల్‌వైర్లు కట్‌చేస్తే ప్రభుత్వ పవర్‌ను కట్ చేస్తామని పలువురు వక్తలు హెచ్చరించారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా కేబుల్‌వైర్లను కట్ చేయటాన్ని నిరసిస్తూ ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో పెద్దఎత్తున మహాధర్నా చేపట్టారు.

ఈ ధర్నాకు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, చికోటి ప్రవీణ్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ 32 యేళ్లుగా కేబుల్ ఆపరేటర్లుగా ఐదు లక్షల మంది ఉపాధి పొందుతూ ఉంటే ఎప్పుడూ లేని సమస్య ఇప్పుడు ఎందు కొచ్చిందని ప్రశ్నించారు. కేబుల్‌వైర్లను కట్ చేయటం వెనుక రేవంత్‌రెడ్డి కుటుంబం పెద్దకుట్ర ఉందని, కేబుల్‌వైర్లు కట్‌చేసి వారి ఉపాధిని దెబ్బతీసి, తానే కేబుల్ కంపెనీ పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి, విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్‌వైర్లను కట్ చేయటం మానుకోవా లని, వెంటనే చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే కేబుల్ ఆపరేటర్లతో కలసి, ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

## సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఏర్పాటు చేయనున్న సూపర్ థర్మర్ కేంద్రానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో ఎన్టీపీసీ నిర్మించ తలపెట్టిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ)కు కేంద్రం నుంచి అనుమతి లభించింది. 2,400 మెగావాట్ల సామర్థ్యం గల టీఎసటీపీపీ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ పర్యావరణ అనుమతులు (ఈసీ) ఇస్తూ సర్క్యులర్ జారీ చేసింది. ఎనిమిది నెలల తరువాత కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రస్తుతం ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్సును ఇచ్చింది.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

## నవంబరు 2న 'మాలల రణభేరి మహాసభ'

### మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** దేశంలో మనువాద పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాల్లో భాగంగా దళితులను చమార్-నాన్ చమార్‌లుగా విభజించి, ఐక్యతను చీల్చి రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రనే ఈ వర్గీకరణ అంశమని మాల మహానాడు జాతీయ, రాష్ట్ర కమిటీలు ఆరోపించాయి. ఈ వర్గకరణను దేశంలో దళితులు స్థాపించిన పార్టీలు ఆర్‌పిఐ, బిఎస్పీ, లోక్‌జనశక్తి, దళిత ఫాంథర్స్ తదితర వ్యతిరేకిస్తున్నాయంటే మనువాద పార్టీల కుట్రలను మనం అర్థం చేసుకోవచ్చునని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య చెప్పారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు బూర్గుల వెంక టేశ్వర్లు, కొమ్మతోటి పాల్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యా, ఉద్యోగ రంగాలలో వెనుకబడ్డ కులాలకు న్యాయం జరిగేలా వారిలోని వెనుకబాటు తనాన్ని గుర్తించి ప్రస్తుత జనాభాకు అనుగుణంగా వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు సూచిస్తే, ఆ సూచనలను రాష్ట్ర ప్రభుత ్వం పట్టించుకోకుండా కేవలం ఒకే కులానికి లబ్ధి చేయాలన్న సిఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు షమీమ్ జస్టీస్ అక్తర్ కమిషన్ హడావుడిగా 2011 జనాభా ప్రకారం అన్ని రంగాలలో అభివృద్ధి చెందినవారికే రిజర్వేషన్‌లు దోచిపెట్టిందని ఆరోపించారు. మాలలకు ఇచ్చిన 5 శాతం రిజర్వేషన్‌లు దక్కకుండా రోస్టర్ పాయింట్‌లను కేటాయించి అన్ని రంగాలలో మాలలను అణిచివేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు. ఇందుకు నిరసనగా నవంబరు 2వ తేదీన లక్షలాది మంది మాలలతో 'చల్ హైదరాబాద్' పేరిట 'మాలల రణభేరి మహాసభ'ను నిర్వహిస్తున్నామని చెన్నయ్య చెప్పారు. ఈ మేరకు ఈ రణభేరికి సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు.

## ఫీజులు చెల్లించక మూతపడుతున్న కాలేజీలు

### తక్షణమే బకాయిలు విడుదల చేయాలి

### ఎంపి. ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు మూత పడుతున్నాయని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజుల బకాయిలు ఇవ్వకపోతే ఎమ్మెల్యేలు ఎంపీలను తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో అన్ని ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కాలేజీలు 17 నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు నిరవదికంగా బంద్ చేస్తామని ప్రకటించారని ఇది చాలా సీరియస్ సమస్య అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా 20 రూపాయలు కూడా విడుదల చేయకుండా అన్యాయం చేస్తుందన్నారు. ఒకవైపు సిఎం రేవంత్ రెడ్డి బీసీల అభివృద్ధికి తెలంగాణ రోల్ మోడల్ అంటూ ప్రకటనలు చేస్తూ ..ఇక్కడ పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. చదువుకునేందుకు ఫీజులు కూడా ఇవ్వని ప్రభుత్వం రేపు బి.సి రిజర్వేషన్లు 42 శాతంకు పెంచుతామంటే ఎలా నమ్ముతామని ప్రశ్నించారు. ఫీజులు చెల్లించకుండా సమస్యను నీరుగారుస్తూ ఈ స్కీమును ఎత్తివేసే కుట్ర జరుగుతుందని విమర్శించారు. ఈ స్కీము పెట్టిన తర్వాత గ్రామాల్లో వ్యవసాయ కూలీల పిల్లలు, మెడిసన్, ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీలు చదువుతున్నారు, సమాజంలో గుణాత్మకమైన మార్పు ప్రారంభమై చైల్డ్ లేబర్, అరికట్టబడిందన్నారు.

# ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి

### కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాటపట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 15 నుంచి కాలేజీల నిరవధిక బందు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ప్రైవేటు కాలేజీల యాజ మాన్యాలు, విద్యార్థుల సమస్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు యువతను నిలువునా మోసం చేశాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక ప్రైవేటు కళాశాలలు మూతపడే దుస్థితి వచ్చాయని బండి సంజయ్ అన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు తమ సర్టిఫికెట్లను కళాశాలల నుంచి తీసుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక యాజమాన్యాలు, సిబ్బంది జీతాలు లేక అవస్థలు పడుతున్నారని, తాము నమ్ముకున్న సంస్థలు కళ్లెదుటే కూలిపోతున్నాయని అన్నారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ పాలనా వైఫల్యమేనని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కనీసం గ్రూప్-1 పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయారని మండి పడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలను కోల్పోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటు కళాశాలల సమస్యలు పరిష్కరించాలని, ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులే దేశ కార్పొరేట్‌రంగ భవిష్యత్తు నేతలు

### నల్సార్‌లో జరిగిన ముగింపు సదస్సులో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ




శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో జరిగిన ముగింపు సదస్సులో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** విద్యార్థులే భారతదేశ కార్పొరేట్ రంగానికి భవిషత్ నాయకులు అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ లా యూని వర్సిటీలో ఇన్‌స్టూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ), నల్సార్ లా యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల సదస్సు ముగిసింది.

రెండు రోజుల పాటు జరిగిన చర్చల తరువాత రెండు రోజుల వార్షిక కార్యక్రమం కార్పోరేట్ గవర్నెన్స్ కాన్ఫరెన్స్-2025 (కార్పవ్ కన్ 2025) నల్సార్‌లోని సార్క్ లా హాల్‌లో ముగిసింది. ఈ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ దేశ కార్పొరేట్ భవిషత్‌ను రూపొందించటంలో కీలకమైన స్థంభాలుగ నీతి, బాధ్యత అని ఆ స్థిరత్వాన్ని స్పష్టం చేశారు. 2016లో ఇన్సాలెన్సీ అండ్ బ్యాంక్రప్సీ కోడ్ వంటి మైలురాయి సంస్కరణలో ఒకటని, ఇది నిశ్చయతను తెస్తుందని, రుణదాతల విశ్వాసాన్ని పునరుద్ధ రిస్తుందన్నారు.

అదేవిధంగా జవాబుదారీ తనంను నిర్ధారిస్తుందన్నారు. ప్రతి పౌరుడిలాగ కార్పొరేట్ పౌరులు కూడ న్యాయంగా, పారదర్శకత, సుస్థిర అభివృద్ధి ప్రకృతి సమ తుల్యం పట్ల బాధ్యతను కలిగి ఉంటుందన్నారు. స్థానిక గిరిజన సమాజాల నుంచి కూడ కార్పోరేట్ నిపుణులు పాఠాలు నేర్చుకోవాలన్నారు.

స్థానిక గిరిజన సమాజాలు ప్రకృతి వనరులను వస్తువులను మాత్రమే చూడవని, అవి ప్రకృతితో సామరస్యంగా జీవిస్థాయని అన్నారు. మనం భూమి యజమానులం కాదని మనం గుర్తించాలన్నారు. దాన్ని పంచుకోవటానికి, నిలబెట్టటానికి మేము ఇక్కడ ఉన్నాం, విద్యార్థులు, పాల్గొనే వారు నైతిక విలువలు, ఉద్దేశ్యం, ప్రతిబింబాలను వారి చర్యలలో అనుసంధానించాలని అన్నారు.

ఈ సమావేశం మిమ్మల్ని ఆలోచింపచేస్తుందని, మిమ్మల్నీ అనుభూతి చెందిస్తుందని, నేర్చుకునేలా చేస్తుందన్నారు. నేర్చుకోకుండ కూడ చేస్తుందన్నారు.

కార్పోరేట్ భవిషత్‌ను రూపొందించటంలో విద్యార్థుల పాత్రను గవర్నర్ ప్రశంసించారు. స్థిరమైన అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను గవర్నర్ తెలియజేశారు. స్థిరత్వం లేకుండ అభివృద్ధి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్సార్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు, ప్రముఖులు సిఎస్ఆర్ వెంకటరమణ, సిఎస్‌బి నరసింహన్, నల్సార్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.వాసంతి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి కెటిఆర్‌ను చూస్తే జాలేస్తుంది!

### పార్టీ ఫిరాయింపులపై ఏం మాట్లాడిన ప్రయోజనం లేదు

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మాజీ మంత్రి కెటిఆర్‌ను చూస్తే జాలేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కెటిఆర్ ఇంట్లో ఉండలేక.. ఫామ్ హౌస్‌లో కూర్చోలేక బయట గాలికి తిరగడానికి సిద్ధమయ్యాడని అన్నారు. చెల్లెలు పోరు ఒక వైపు, బావ నసుగుడు మరో వైపు, అయ్య సతాయింపు మరో వైపు కెటిఆర్ తట్టుకోలేకపోతున్నాడని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎవరి దారి వాళ్ల చూసుకుంటుండటంతో ఏం చేయాలో తెలియక జిల్లాల దారి పడుతున్నాడని అన్నారు. బిఆర్ఎస్ సచ్చిపోయిందని, నువ్వెన్ని లేపనాలు పూసినా ఉపయోగం లేదని అన్నారు. అందులో నుంచి మీ అవినీతి కంపు వాసన తప్ప ఇకొక్కటి రాదన్నారు. నువ్వెంత తిరిగినా నీకు, మీ నాయకులకు డిజిల్ ఖర్చు తప్ప ఉపయోగం లేదన్నారు. ప్రజలు మమ్మల్ని నమ్మడం మానేశారు, మీ చెత్త కబుర్లు వినిడానికి తెలంగాణ ప్రజలు అమాయకులు కాదని అన్నారు. మీరెన్ని కబుర్లు చెప్పినా మీ పదేళ్ల పాపాలను జనాలు మరిచిపోలేదని, మీ పాపం పండే మిమ్మల్ని ఫామ్ హౌస్‌లోకి విసిరేశారని అన్నారు. సోషల్ మీడియా స్టంట్ల కోసం కెటిఆర్ సభలు పెడుతున్నాడని, పదేళ్ల అవినీతి సంపాదనతో సోషల్ మీడియా పెట్టుకుని పాడే మీద ఉన్న పార్టీకి బహుబలి రేంజ్‌లో కలరింగ్ ఇస్తున్నారని, మీ సోషల్ మీడియా బిల్డప్‌లను జనం చూసి నవ్వుకుంటున్నారని అన్నారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఏ మోహం పెట్టుకుని వెళ్తున్నావు? జిల్లాకు ఏం చేశారు మీరు?మీ పదేళ్ల పాలన చూసి పాలమూరు జనం మోహం మీద ఊసి పంపించారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో, లోక్ సభ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించారు..మూడో స్థానానికి పరిమితం చేశారు..పాలమూరు రంగారెడ్డి పూర్తి చేయలేదని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను ఎక్కడిక్కడ వదిలేశారని, కుర్చీ వేసుకుని కూర్చోని ప్రాజెక్టులను పూర్తి చేస్తానని చెప్పి ఓట్లు వేయించుకుని అన్యాయం చేశారన్నారు. పదేళ్లలో చేనేత శాఖ మంత్రిగా ఉన్న కెటిఆర్ గద్వాలలో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి చేనేత కార్మికలను మోసం చేశారన్నారు. తుమ్మిల ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి సగం సగం పనులు చేసిపోయాడని, జూరాలను గాలికి వదిలేశారని అన్నారు. మా ప్రభుత్వం 120 కోట్లతో జూరాల పైన కొత్త బ్రిడ్జిని నిర్మిస్తుందన్నారు. మా పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాక మాకు ఏ పార్టీ అవసరం మాకు లేదు.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన కెటిఆర్ నోటీకొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అది మంచిది కాదన్నారు. పార్టీ ఫిరాయింపులపైన కేటీఆర్ ఏం మాట్లాడినా ఉపయోగం లేదు, జనం మమ్మల్ని క్షమించరని అన్నారు.

# గద్వాలలో టెక్స్టైల్ పార్కు ఏర్పాటు ఏమైంది?

### కెటిఆర్‌ను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మాజీ మంత్రి కెటిఆర్ గద్వాలకు ఏ ముఖం పెట్టుకుని వస్తావు అంటూ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పదేళ్ల పాటు చేనేత శాఖ మంత్రిగా ఉన్న కెటిఆర్ గద్వాలలో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి చేనేత కార్మికలను మోసం చేశాడన్నారు. శంకుస్థాపన ఫలకం చుట్టు పిచ్చి మొక్కలు మొలిచాయని, కెటిఆర్ వెళ్లి చూడాలన్నారు. తుమ్మిల ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి సగం సగం పనులు చేసిపోయారన్నారు. సరైన సౌకర్యాలు కల్పించకుండానే వంద పడకల ఆస్పత్రి రిబ్బన్ కట్ చేసి పోయాడన్నారు. 10 ఏళ్లలో 4 మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనలలో వంద పడకల ఆస్పత్రిని అన్ని సౌకర్యాలతో ప్రారంభించుకున్నామన్నారు. మా ప్రభుత్వ హయాంలో మల్లమ్మ గుంటకు సర్వే పనులు ప్రారంభమయిందన్నారు.

120 కోట్లతో జూరాల పైన కొత్త బ్రిడ్జిని నిర్మిస్తున్నామన్నారు. పదేళ్లలో నడిగడ్డ ప్రజలను మోసం చేశాడన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన స్త్రీ లింగం, పురుష లింగం అంటు కెటిఆర్ విమర్శలు చేస్తున్నాడని, టికెట్ ఇచ్చేటప్పుడు ఏ లింగమో నీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. 10 ఏళ్లలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అడ్డగోలుగా కాలరాశారు అన్నారు. నేను కాంగ్రెస్ విప్‌గా ఉన్నప్పుడు మా పార్టీ ఎమ్మెల్యేలను ఐదుగురిని, టిడిపి ఎమ్మెల్యేలను 15 మందిని బిఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. కెసిఆర్ ఫిరాయింపులపైన తానే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశానని, మీరు చేస్తే సంసారం, వేరే వాళ్లు చేస్తే వ్యభిచారమా? అంటూ ప్రశ్నించారు. కెసిఆర్ రాజకీయాలను వ్యభిచారంగా మార్చారని, నడిగడ్డకు వచ్చే అర్హత కెటిఆర్‌కు లేదన్నారు. ఇక్కడి ప్రజలు తిరగబడతారన్నారు. నడిగడ్డకు వచ్చి నువ్వు ఉద్ధరించేది ఏమీ లేదని, రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, గద్వాల జిల్లాలపైన మీ చెల్లెను చూసుకోలేవు…నీ వల్లనే బిఆర్ఎస్ మునిగిపోతుందని మీ కార్యకర్తలే అంటున్నారు. నడిగడ్డ ప్రజలు బుద్ది చెపుతారన్నారు.

# ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటేనే దేశం మనుగడ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** వికసిత భారత్, అమృత్ కాల్ అంటే కేవలం అదానీ




ఎఐబిఇఎ, ఎఐసిబిఇఎఫ్ మహాసభలో పాల్గొన్న జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాంబాబు తదితరులు

అంబానీలకే, కార్మికలోకానికి, సామాన్య ప్రజలకు కాదని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఈఎ) జాతీయ ప్రధాన కార్య దర్శి సిహెచ్.వెంకటాచలం సిహెచ్. వెంకటాచలం అన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐసిబిఈఎఫ్) ఉభయ రాష్ట్రాల 37వ మహాసభ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ యూనియన్ (సిబిఐఒయు) 13వ త్రైవార్షిక సభలు సంయుక్తంగా శుక్రవారం కాచిగూడలో జరిగాయి. ఈ మహాసభలను వెంకటాచలం ప్రారంభించి మాట్లాడారు. నేడు బ్యాంకుల్లో వివిధ రూపాల్లో రూ.250 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం ఉందని, ఇది ప్రభుత్వ బడ్జెట్ కంటే ఎక్కువ అని, ఈ ధనం అంతా సామాన్య ప్రజలదే తప్ప ప్రభుత్వానిది కాదని, ఈ డబ్బును కాపాడవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందని అన్నారు. ప్రైవేట్ బ్యాంకులన్నీ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాయని, అయినప్పటికీ పాలకులు ప్రైవేట్ బ్యాంకులను ప్రోత్సహిస్తూ దశాబ్దాల తరబడిగా ప్రజలకు అండగా ఉంటూ వారి ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికి కృషి చేస్తున్న ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి పాలక వర్గాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. వ్యవసాయం, ఉత్పత్తి రంగాలు, చిన్నతరహా పారిశ్రామిక రంగం కూడా అతలాకుతలం అవుతుందని, అయినప్పటికీ ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తూ సామాన్య ప్రజలను మభ్య పెడుతుందని విమర్శించారు. ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటేనే ఈ దేశం మనుగడ సాధ్యమోతుందని ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. బ్యాంకుల ఉద్యోగుల హక్కులు కాపాడటంలో ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. భారత బ్యాంకింగ్ సెక్టార్ ప్రధాన యూనియన్ నేతృత్వం వహిస్తున్న వెంకటాచలం బ్యాంకింగ్ సంఘాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారని అభినందించారు. ఎపిటిబిఎఫ్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షించు కోవాలని, పాలకుల కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులు ప్రభుత్వ రంగ బ్యాంక్ నిలబెట్టుకోవాలని, ఇందు కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎఐబిఈఎ సభ్యులు మరింత సంఘటితంగా పోరాడాలన్నారు.

## బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలి

### ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 30 తేదీ వరకు తెలంగాణలో జరిగే బతుకమ్మ పండుగ సంబరాలను విజయవంతం చేయాలని ఎంపి డికె అరుణ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సంస్కార భారతి తెలంగాణ మాతృ శక్తి విభాగం వారితో కలిసి బతుకమ్మ సంబరాలకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ ఈ సంవత్సరం సంస్కార భారతి తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలంతా కలిసి మెలసి బతుకమ్మను ఆడుతూ మన సంస్కృతిని చాటుదాం అని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి మాతృ శక్తి రాష్ట్ర కన్వీనర్ నెల్లుట్ల సుష్మా, సంస్కార భారతి రాష్ట్ర కార్యదర్శి భవాని, రంగోలి విభాగం కన్వీనర్ జయశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మీ ్ర, యాక్టింగ్ విభాగం రాష్ట్ర కో కన్వీనర్ స్వాతి, లావణ్య, సంతోషి, పారిజాత, శ్రీవిద్య, లావణ్య, నర్మద తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1, 2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వేలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్ అశోక్ నగర్ లైబ్రరీ, వివిధ ఇన్‌స్టిట్యూట్స్ దగ్గర రాత్రిపగలు చదువుతూ, ఉద్యోగ అవకాశాల కోసం వేచి ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వక, ఏ విధమైన స్పష్టత లేకుండా వ్యవహరిస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే వైఖరిని అవలంబిస్తుందన్నారు. నిరుద్యోగులను రోడ్డుపైకి తీసుకువచ్చి, కఠినంగా, నిరక్ష ్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. 35,000, 1,00,000 ఉద్యోగాలు ఇచ్చాం అని చెప్పడం మాత్రమే, నిజమైన లెక్కలు చూపడం లేదు. జాబ్ క్యాలెండర్ ప్రకారం, యుపిఎస్ తరహా తెలంగాణ పబ్లిక్ కమిషన్ సైతంపరీక్షలు సమయానికి నిర్వహించాలన్నారు. నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్షకు దిగకముందే, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఓటు బ్యాంకు కోసం ఒకేలా కాంగ్రెస్, బిఆర్ఎస్ శైలి

### నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఓటు బ్యాంకు కోసం బిఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ ఒకే రకంగా ప్రవర్తిస్తున్నాయని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. హిందువులన్నా, హిందూ పండగలన్నా చులకన భావంతో చూస్తున్నారని మండిపడ్డారు. శనివారం నిజామాబాద్ కమిషనరేట్‌లో సిపిని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇటీవల నవీపేటలో ఒక యువకుడు గణపతిపై కాషాయ జెండా ఎగురవేస్తే ఫోటోలో అది మసీదుపై పెట్టినట్లు వచ్చిందని దాంతో ఆ యువకుడిని ఆగమేఘాల మీద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారన్నారు. ఈ ఘటన తర్వాత అక్కడ ముస్లింలు బైక్ ర్యాలీ నిర్వహించి రబసా చేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మేము డిమాండ్ చేశాక చర్యలు తీసుకున్నారని చెప్పారు. జెండా ఎగురవేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడు రాజస్థాన్‌కు చెందిన వాడని అతడిని రాజస్థాన్ పంపాలని అంటున్నారు. మరి దేశంలోకి వచ్చిన బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి ఎందరో అక్రమంగా ప్రవేశించారు. టర్కీ నుంచి వచ్చి తరతరాలుగా ఇక్కడే ఉంటున్న కూడా వెనక్కి పంపిద్దామా కాంగ్రెస్ చెప్పాలన్నారు. తప్పు చేసిన వారిని అరెస్టు చేయాలి తప్ప మతం ఆధారంగా చర్యలు తీసుకుంటే సమాజంలో విభజన వస్తుందని హెచ్చరించారు. జిల్లాల్లో టెర్రరిస్ట్ యాక్టివిటీస్ పెరిగాయని, బోధన్ పిఎఫ్, సిమిక్ అడ్డగా మారాయని వీటి వల్ల ప్రజలు భయాందోళనలో ఉన్నారని చెప్పారు. లా అండ్ ఆర్డర్ సరిగా లేదని ఆరోపించారు. ఎన్‌జిఒల పేరుతో హిందూ అమ్మాయిలను ముస్లిం యువకులు పెళ్లి చేసుకుంటే ఆర్థికంగా సహాయం చేస్తామని అంటున్నారని ఇది లవ్ జిహాద్ అంటారన్నారు. ఈ పరిస్థితికి వస్తే ఇక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏంచేస్తుందని ప్రశ్నించారు.

## రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరత

### బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సమయానికి యూరియాను అందించడంలో విఫలమయ్యారని బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్ అన్నారు. రాష్ట్రంలో ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించడం విషయంలో భారతీయ జనతా పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. రైతులు రోజూ యూరియా కోసం కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలబడి వేచిచూసినా, ఆఖరుకు కొంతమంది ఖాళీ చేతులతోనే వెళ్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ కేబినెట్ మంత్రులు ఎప్పటికీ రైతులకు హామీలు ఇస్తూనే ఉంటారు. కానీ సూర్యాపేట్ వంటి జిల్లాల్లో రైతులు సరిపడా యూరియా పొందక ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్నా, మరోవైపు రైతులకు ఎందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ ప్రశ్నించారు.తెలంగాణలో 2024-25 రబి సీజన్ కోసం 9.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, కేంద్ర ప్రభుత్వం 12.02 లక్షల మెట్రిక్ టన్నులను పంపించిందని, ఇది అవసరానికి మించి 3 లక్షల టన్నులు ఎక్కువ అన్నారు. అయితే ఆ యూరియా ఎక్కడికి పోయిందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని, అది మాయమైందా, లేక బ్లాక్ మార్కెట్‌కి వెళ్ళిందా? అని ఎన్.వి.సుభాష్ మండిపడ్డారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పాలనలో రైతులు రాజులాగా జీవిస్తున్నారని చెబుతున్నారు.

### వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని

## కన్నకూతురినే కడతేర్చిన తల్లి

**శివ్వంపేట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని కన్నకూతురినే ఓ కసాయితల్లి హత్య చేసిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తూప్రాన్ డిఎస్పీ నరేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శభాష్‌పల్లి గ్రామానికి చెందిన బొట్టు మమతకు ఐదేళ్ల క్రితం రాయపోల్ మండల్ వడ్డేపల్లికి చెందిన భాస్కర్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు చరణ్, కూతురు తనుశ్రీ ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవ కావడంతో మమత తన పిల్లలతో తల్లిగారి ఇంటివద్దనే ఉండేది. శభాష్‌పల్లికి చెందిన ఫయాజ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండడంతో జూన్ 7న ఫయాజ్‌తో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయారు.



తనుశ్రీ (ఫైల్)

కొడుకు చరణ్‌ను పుట్టింట్లో వదిలేసి కూతురు తనుశ్రీని వెంట తీసుకొని వెళ్లింది. మమత తల్లి.. కూతురు కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. మమత, ఫయాజ్‌లను గుంటూరులో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా మమత వద్ద కూతురు లేకపోవడంతో పోలీసులు ఏం చేశా రంటూ విచారించగా తమ వివాహేతర సంబంధానికి అడ్డుగాఉందని శభాష్‌పల్లి గ్రామశివారులో చంపి పాతిపెట్టామని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో తూప్రాన్ సిఐ రంగకృష్ణ, స్థానిక ఎస్ఐ మధుకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

14-09pg10fBVf 12 VJA_14-09pg10fBVf.qxd 9/13/2025 11:40 PM Page 1



## ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో
# షూటర్ ఇషాకు స్వర్ణం



**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ నింగ్బో-2025 మహిళల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత్ షార్ప్ షూటర్ ఇషా సింగ్ బంగారు పతకం గెలుచుకుంది. దీంతో మహిళల ఎయిర్ పిస్టల్‌లో భారత్ ఇప్పుడు క్లీన్ స్వీప్ పూర్తి చేసి, నాలుగు ప్రపంచ కప్ టైటిళ్లను కైవసం చేసుకుంది. శనివారం చైనాలో జరిగిన ఈ ప్రపంచ కప్ నింగ్బోలో మహిళల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఇషా సింగ్ తన సత్తా చాటింది. ప్రపంచ కప్‌ను సవాలుతో ఆరంభించిన తర్వాత, మొదటి నాలుగు రోజుల్లో భారత్ షూటర్లు ఎవరూ ఫైనల్స్‌కు చేరుకోలేక టోర్నీ నుండి నిష్క్రమించారు. కానీ ఈషా, రిథమ్ సంగ్వాన్ ఇద్దరూ ఒకే ఈవెంట్‌లో ఫైనల్‌కు అర్హత సాధించడం ద్వారా పొడి స్పెల్‌ను అధిగమించారు. అయితే, రిథమ్ పతకాన్ని కోల్పోయి ఫైనల్‌లో ఐదవ స్థానంలో నిలిచింది. ఇషా మాత్రం దీన్ని పూర్తిగా ఉపయోగించుకుని తన సొంత ఫేవరెట్ అయిన యావో క్వియాన్క్సన్‌ను 0.1 తేడాతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫలితంగా భారత్ ఇప్పుడు 2025 ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ సర్క్యూట్‌లో మహిళల ఎయిర్ పిస్టల్‌లో క్లీన్ స్వీప్‌ను పూర్తి చేయగా, ఈ సీజన్‌లోని నాలుగు బంగారు పతకాలను గెలుచుకుంది. ఈ విభాగంలో మొదటి మూడు బంగారు పతకాలను లిమా (పెరూ), బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా) మరియు మ్యూనిచ్ (జర్మనీ) లలో వర్ధమాన తార సురుచి సింగ్ గెలుచుకున్నారు.

# హాంకాంగ్ ఓపెన్‌లో ఫైనల్‌కు సాత్విక్, చిరాగ్ జోడీ




**న్యూఢిల్లీ:** హాంకాంగ్ ఓపెన్ 2025లో చైనీస్ తైపీకి చెందిన జంటను ఓడించి భారత్ బ్యాడ్మింటన్ జోడీ టైటిల్ పోరుకు సిద్ధమైంది. శనివారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి ద్వయం చైనీస్ తైపీ జోడీ బి. లిన్-సికె చెన్‌లను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. వరుస గేమ్‌ల విజయంతో వారు ఈ టైటిల్ షాట్‌ను ముగించారు. ప్రపంచ 9వ ర్యాంక్‌లో ఉన్న ఈ జోడీ చైనీస్ తైపీకి చెందిన బింగ్‌వీ లిన్ మరియు చెన్ చెంగ్ కువాన్‌లను 2-11-7, 21-15 తేడాతో ఓడించి ఆరు సెమీఫైనల్ ఓటముల తర్వాత ఈ సీజన్‌లో తమ తొలి ఫైనల్‌కు చేరుకుంది. ఎనిమిదో సీడ్ ఇండియన్స్ జట్టు చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్ మరియు వాంగ్ చాంగ్ మరియు చైనీస్ తైపీకి చెందిన ఫాంగ్‌చిహ్ లీ మరియు ఫాంగ్‌జెన్ లీల మధ్య జరిగే మరో సెమీఫైనల్ విజేతతో తలపడనుంది. కాగా సాత్విక్, చిరాగ్ లకు ఈ ఫలితం మరొక శిఖరాగ్ర ఘర్షణకు ఒక అడుగు మాత్రమే ఉంది.




## మహిళల హాకీ ఆసియా కప్..
# జపాన్ చేతిలో భారత్ డ్రా

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఆసియా కప్-2025 జపాన్ చేతిలో భారత్ డ్రా గా ముగిసింది. హాంగ్జౌలో శనివారం జరిగిన చివరి సూపర్ 4 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు జపాన్ చేతిలో 1-1తో డ్రాగా ముగించింది. భారత మహిళల హాకీ జట్టు జపాన్‌పై అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. చైనా, కొరియాను ఓడించినా లేదా మూడు గోల్స్ కంటే తక్కువ తేడాతో ఓటమిని తప్పించుకున్నా, భారత్ మహిళల ఆసియా కప్ ఫైనల్‌కు చేరుకుంటుంది. జపాన్‌తో ఇప్పుడు జరిగిన మ్యాచ్‌లో బ్యూటీ డంగ్ డంగ్ (7వ నిముషం) ద్వారా భారత్ తొలి గోల్ చేసింది. అయితే షిహో కొబయకావా (58) జపనీస్ తరఫున గోల్‌ను సమం చేసింది. పోటీ ప్రారంభంలో భారత్ మెరుగైన ఆరంభాన్ని అందించింది. ఇషికా చౌదరి గోల్ ఫ్రేమ్‌ను తాకింది. ఆ తర్వాత జపాన్ దాడిలో కొన్ని ఎత్తుగడలను వేసింది. కానీ భారత్ బ్యూటీ డంగ్ డంగ్ (7) కొట్టడంతో వెనక్కి తగ్గింది. దీంతో ముంతాజ్ ఖాన్ షాట్‌ను నెట్‌లోకి మళ్లించి 1-0తో స్కోరును సాధించింది. భారత్ దాడిని కొనసాగించి మొదటి క్వార్టర్ చివరి క్షణాల్లో తొలి పెనాల్టీ కార్నర్‌ను సంపాదించింది. రెండవ క్వార్టర్‌లో జపాన్ సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగి మొదటి కొన్ని నిమిషాల్లోనే ముందంజలో ఉంది. జపాన్ కూడా పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ భారత్ తిరిగి ఆధిక్యంలోకి రావడం ప్రారంభించింది. మూడవ క్వార్టర్‌లో జపాన్ రక్షణకు వ్యతిరేకంగా భారతదేశం ముందుండి ఆడింది. విరామ సమయానికి భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది. చివరి క్వార్టర్‌లో జపాన్ సమం చేసే లక్ష్యంతో దాడికి దిగింది. ప్రత్యర్థులపై ఒత్తిడి తీసుకురావడానికి వరుసగా పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. చివరి నిమిషాల్లో, జపాన్ షిహో కొబయకావా (58) ద్వారా గోల్ చేసి 1-1తో ఆధిక్యాన్ని సమం చేసింది.

## సుదీర్ఘ విరామం తర్వాత..
# నేడే హై ఓల్టేజ్ మ్యాచ్
### భారత్, పాకిస్థాన్ మధ్య హోరాహోరీ

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025లో భారత్, పాకిస్తాన్ మధ్య జరగబోయే హైవోల్టేజ్ మ్యాచ్ కోసం ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తుంది. చిరకాల ప్రత్యర్థులైన ఈ రెండు జట్ల మధ్య ఈ నెల 14వ తేదీ ఆదివారం రాత్రి 8 గంటలకు దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్ జరగనుంది. టీమిండియా, పాకిస్తాన్ రెండు జట్లు గ్రూప్-ఏ లో ఉన్నాయి. ఇది ఈ రెండు జట్లకు రెండవ మ్యాచ్. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా తన మొదటి మ్యాచ్‌ను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో ఆడింది. ఆ మ్యాచ్‌లో టీం ఇండియా 9 వికెట్ల తేడాతో గెలిచింది. అలాగే పాకిస్తాన్ తొలి మ్యాచ్ ఒమన్‌తో జరిగింది. ఇందులో పాక్ 7 వికెట్లు తేడాతో గెలుపొందింది. ఇప్పుడు ఒకే గ్రూప్‌లోని ఈ రెండు బలమైన జట్లు ముఖాముఖిగా తలపడుతున్నాయి. ఆసియా కప్‌లో తొలి మ్యాచ్‌లో విజయం నమోదు చేసి జోష్‌లో ఉన్న భారత్ అదే ఊపుతో పాకిస్తాన్‌ను చిత్తు చేసే పట్టుదలతో ఉంది. యూఏఈపై భారీ తేడాతో నెగ్గి ఏకంగా +10.483 రన్ రేట్ సాధించింది. అయితే మొదటి మ్యాచ్‌లో ప్రత్యర్థి పసికూన కాబట్టి, ఆ మ్యాచ్ పెద్దగా కిక్ ఇవ్వలేదు. అయితే ఇప్పుడు జరిగే భారత్, పాక్ మధ్య హై ఓల్టేజ్ మ్యాచ్ ఉత్కంఠకలిగిస్తోంది. ఈ సారి పాక్ మ్యాచ్ కోసం ఖరారు చేసిన భారత జట్టులో ఐదుగురు యువ ఆటగాళ్లు ఉన్నారు. వీరు పాకిస్తాన్‌తో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ ఐదుగురు ఆటగాళ్ల జాబితాలో ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అభిషేక్ శర్మ, వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ సంజూ శాంసన్, జితేష్ శర్మ ఉన్నారు. వీరితో పాటు యువ సంచలనాలు తిలక్ వర్మ, రింకూ సింగ్ కూడా పాక్‌తో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. యుఏఈతో జరిగిన ఆసియా కప్‌లో మొదటి మ్యాచ్‌లో ఈ ఐదుగురు ఆటగాళ్లలో ముగ్గురికి అవకాశం లభించింది. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజూ శాంసన్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉన్నారు. ఇక పాక్‌తో జరిగే మ్యాచ్‌లో భారత ప్లేయింగ్ ఎలెవన్ బ్యాట్స్‌మెన్లుగా శుభ్ మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్) ఇక ఆల్‌రౌండర్లుగా హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, బౌలర్లుగా కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా ఉండనున్నారు. మరోపక్క పాకిస్తాన్ జట్టులో సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రర్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫకార్ జమాన్, హ్యారీస్ రౌఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ టలట్, ఖుష్దిల్ షా, మహమ్మద్ హారీస్(కీపర్), మహమ్మద్ నవాజ్, మహమ్మద్ వసీం జూనియర్, సహిబ్జాదా ఫర్హాన్, సయీమ్ అయుబ్, సల్మాన్ మిర్జా, షాహిన్ షా అఫ్రిది, సుఫ్యన్ మోఖిమ్ ఉన్నారు.







## ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్..
# ఫైనల్‌కు మీనాక్షి

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ మహిళా బాక్సర్ మీనాక్షి ఫైనల్‌కు చేరింది. లివర్‌పూల్‌లో శనివారం జరిగిన ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో మినాక్షి హుడా ఆధిపత్య ప్రదర్శన ఇచ్చింది. మాజీ ఆసియా ఛాంపియన్‌షిప్ మరియు ప్రపంచ కప్ రజత పతక విజేత అయిన మీనాక్షి, 48 కిలోల సెమీఫైనల్లో ప్రపంచ మాజీ ఛాంపియన్ రజత పతక విజేతపై 5-0 తేడాతో ఆధిపత్య విజయాన్ని నమోదు చేసింది.

జైస్మిన్ లంబోరియా, నుపుర్ షెయోరాన్ వరుసగా 57 కిలోలు, +80 కిలోల సెమీఫైనల్స్‌లో ఒమైలిన్ అల్కాల, సెయ్మా డుజ్టాస్‌లను ఓడించిన ఒక రోజు తర్వాత, మినాక్షి చివరి నాలుగు బౌట్‌లో మంగోలియాకు చెందిన ప్రపంచ రజత పతక విజేత అల్టాంట్‌సెట్సెగ్ లుట్సైఖాన్‌పై విజయం సాధించి బంగారు పతక పోటీకి చేరిన మూడవ భారతీయ మహిళగా నిలిచింది. 52 కిలోల బరువు విభాగంలో 2022 ఆసియా ఛాంపియన్‌షిప్‌ల రజత పతక విజేత, లాంగ్ రేంజర్ మినాక్షి ప్రారంభంలోనే దాడి చేసింది. బలమైన కుడి దెబ్బతో ఆల్టాంట్‌సెట్సెగ్‌ను నేలకూల్చింది. మంగోలియన్ క్రీడాకారిణి స్ట్రెయిట్ షాట్లు కొట్టడం ద్వారా తన దూకుడును ప్రదర్శించింది. కానీ మినాక్షి అద్భుతమైన కదలిక, శక్తి, ఖచ్చితత్వంతో మరో ఏకగ్రీవ రౌండ్‌ను గెలుచుకుని ఫైనల్‌కు దూసుకెళ్లింది. 24 ఏళ్ల ఈ భారతీయ క్రీడాకారిణి కజకిస్తాన్‌కు చెందిన పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత నజీమ్ కైజైబేతో టైటిల్ కోసం జరిగే పోరులో తలపడనుంది.

# ఫోన్‌పేకు ఆర్బీఐ రూ.21 లక్షల జరిమానా

**ముంబయి, సెప్టెంబరు 13:** యూపీఐ చెల్లింపుల రంగంలో అగ్రగామిగా కొనసాగుతూ, త్వరలో ఐపీఓకు రాబోతున్న ఫోన్‌పే సంస్థకు అనూహ్య పరిణామం ఎదురైంది. నిబంధనల ఉల్లంఘన కారణంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఈ సంస్థకు రూ. 21 లక్షల జరిమానా విధించింది. ప్రీపెయిడ్ పేమెంట్ సాధనాలకు (పీపీఐ) సంబంధించిన నిబంధనలను ఫోన్‌పే పాటించలేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. ముఖ్యంగా కంపెనీకి చెందిన ఎస్క్రో ఖాతాలో ఉండాల్సిన రోజువారీ నిల్వ, కస్టమర్లు, వ్యాపారులకు చెల్లించాల్సిన మొత్తం కంటే తక్కువగా ఉన్నట్లు ఆర్బీఐ తన తనిఖీల్లో గుర్తించింది. అంతేకాకుండా ఈ నిధుల కొరత విషయాన్ని తమ దృష్టికి తీసుకురావడంలో కూడా ఫోన్‌పే విఫలమైందని కేంద్ర బ్యాంకు పేర్కొంది. ఈ ఉల్లంఘనల నేపథ్యంలోనే పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్స్ చట్టం2007 కింద ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. 2023 అక్టోబర్ నుంచి 2024 డిసెంబర్ మధ్య కాలంలో ఫోన్‌పే కార్యకలాపాలపై విస్తృత స్థాయిలో ఆర్బీఐ తనిఖీలు నిర్వహించిది. నిబంధనల ఉల్లంఘనలపై ఎందుకు జరిమానా విధించకూడదో చెప్పాలంటూ కంపెనీకి నోటీసులు జారీ చేసింది. ఫోన్‌పే ఇచ్చిన సమాధానం, విచారణలో వారి వాదనలు విన్న తర్వాత ఈ నెల 10న ఈ జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అయితే, ఈ జరిమానా కేవలం నియంత్రణాపరమైన చర్య మాత్రమేనని, దీనివల్ల ఫోన్‌పే వినియోగదారుల లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండబోదని ఆర్బీఐ స్పష్టం చేసింది. కాగా, ఈ ఏడాది చివరిలో ఐపీఓకు వెళ్లేందుకు ఫోన్‌పే సన్నాహాలు చేసుకుంటోంది. ఇందుకోసం జేపీ మోర్గాన్, సిటీ గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కూడా చేసుకుంది. ఇలాంటి కీలక సమయంలో ఆర్బీఐ జరిమానా విధించడం పరిశ్రమ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక, ప్రస్తుతం దేశంలో యూపీఐ చెల్లింపుల మార్కెట్‌లో ఫోన్‌పే సుమారు 48.64 శాతం వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే.







## ఈ యేడాది టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం
# 3.2%
### క్రిసిల్‌రేటింగ్స్ అంచనా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** టోకుధరలసూచీ ద్రవ్యోల్బణం ఈ ఆర్థికసంవత్సరంలో 3.2శాతంగా ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనావేసింది. అంతకుముందు సంస్థ చూపిన 3.5 అంచనాలకంటే మరికొంత తగ్గవచ్చని తాజా నివేదికలో ప్రస్తావించింది. రిటైల్‌ద్రవ్యోల్బణం 140 బేసిస్ పాయింట్లు క్షీణత ఈ ఆర్థికసంవత్సరంలో ఉంటుందని ఫలితంగా ఎంపిసి కమిటీలో రెపోరేట్లు సడలించే అవకావం ఉందని అంచనావేసింది. ఆర్బీఐ ఈ ఏడాది 25 బేసిస్ పాయింట్లు కోత విధించే ఛాన్స్ ఉందని తెలిపింది.

తక్కువ ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల తగ్గింపు వంటివి దేశీయ డిమాండ్‌ను పెంచి ఆర్థికవ్యవస్థను గ్లోబల్ సమస్యలనుంచి బయటపడేస్తాయని క్రిసిల్ చెపుతోంది. ఖరీఫ్ సీజన్‌లో సగటుకంటే ఎక్కువ కురిసిన వర్షపాతంతో ఉద్యానవన, ఆహార ఉత్పత్తుల ప్రాంతాలకు కొంత నష్టం జరిగే అవకాశం ఉంది. అంటే పంజాబ్ లాంటి ఆహారోత్పత్తుల రాష్ట్రాలకు ఈప్రమాదం ఉంది. ఆగస్టునెల రిటైల్‌ద్రవ్యోల్బణం 2.1శాతంగా నమోదయింది. జులైలో 1.6శాతంనుంచి స్వల్పంగా పెరిగినప్పటికీ ఆర్బీఐ అంచనాలనున మించి పోలేదు. ఆహార ద్రవ్యోల్బణం మరికొంతపెరగడంతో టోకుధరలసూచీపైనా ఈప్రభావం ఉండవచ్చని క్రిసిల్ విశ్లేషించింది.




# నష్టాలను తగ్గించుకుంటున్న ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్!

**ముంబయి, సెప్టెంబరు 13:** ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్ 2025 సంవత్సరంలో 20,493 కోట్ల రాబడులు ఆర్జించిందని కంపెనీ ప్రకటించింది. ముందు ఏడాదికంటే 14శాతం రాబడులు పెంచు కోగలిగింది. దీనివల్లనికరనష్టాన్ని 37శాతం తగ్గించుకుని 1494 కోట్లకు చేరగలిగినట్లు సంస్థకంపెనీల రిజిస్ట్రారుకు నివేది కిచ్చింది. 2024లో కంపెనీ రాబడులు 21శాతం పెరిగాయి. గడచిన రెండు సంవత్సరాల్లో కూడా రాబడులు క్రమేపీ 20 శాతం పెరుగుతూ వచ్చాయని చెపుతోంది. ఫ్లిప్‌కార్ట్ అనుబంధ విభాగంగా ఉన్న ఇంటర్నెట్ సంస్థ నష్టాలనుంచి ఇపుడిపుడే అధిగమిస్తున్నట్లు వివరించింది. నిజానికి ఫ్లిప్‌కార్ట్ ఆదాయం మొత్తం మార్కెట్‌ప్లేస్ కార్యకలాపాలు, ఈకామర్స్, లాజిస్టిక్స్, వ్యాపార ప్రకటనలనుంచే ఆర్జిస్తోంది. వాణిజ్యప్రకటనలద్వారా 27శాతం వృద్ధిని సాధించి 4973 కోట్లనుంచి 6317 కోట్లకు పెంచుకోగలిగింది. రాబడులు కూడా 7751 కోట్లవరకూ చేరింది. లాజిస్టిక్స్ సేవల్లో మాత్రం తగ్గుదల నమోదయింది. 6838 కోట్లనుంచి 4224కోట్లకు పడిపోయింది. ఇక వ్యయాలపరంగా కూడా 8శాతంపెరిగాయి. 22,311 కోట్లకు చేరింది. ఉద్యోగులకు మేలుచేసే ప్రయోజనాలఖర్చులు 8శాతం తగ్గి 4748 కోట్లకు చేరాయి. ఇక మార్కెటింగ్ ఖర్చులు మాత్రం 37శాతం పెరిగి 4100 కోట్లకు చేరాయి. జులైలో ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగులకు ఇఎస్ఓపి ప్రకటించింది. 50 మిలియన్ డాలర్ల విలువైన వాటాలను బైబాక్‌చేసింది. దీనివల్ల ఏడువేల మంది ఉద్యోగులకు మేలుజరగనున్నది.

# వడ్డీరేట్లు తగ్గించిన మూడు బ్యాంకులు!

**ముంబయి, సెప్టెంబరు 13:** దేశంలో మూడు బ్యాంకులు వడ్డీరేట్లను సవరించాయి. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించగా ఐడీబీఐ కూడా ఎంసీఎల్ఆర్ సవరించింది. ఈనెల 12వ తేదీనుంచే వడ్డీరేట్లు అమలు చేస్తున్నట్లు బ్యాంకులు ప్రకటించాయి. ఎంపిక చేసిన వేర్వేరు కాలపరిమితులపై ఇది వేర్వేరుగా ఉంటుంది. ఇక్కడ లోన్ వడ్డీ రేట్లు తగ్గితే ఇప్పటికే ఫ్లోటింగ్ రేటుపై లోన్ తీసుకున్న వారు.. తమ లోన్ ఈఎంఐ తగ్గించుకోవచ్చు లేదా టెన్యూర్ తగ్గించుకోవచ్చని చెప్పొచ్చు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఎంసీఎల్ఆర్ రేట్లను 15 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. ఇక్కడ ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 10 బేసిస్ పాయింట్లు తగ్గి 7.95 శాతం నుంచి 7.85 శాతానికి చేరింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 7.95 శాతంగా ఉండగా3 నెలల ఎంసీఎల్ఆర్ 8.35 శాతం నుంచి 8.20 శాతానికి చేరింది. 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.65 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ 8.80 శాతంగా ఉంది. ఇది సెప్టెంబర్ 12 నుంచి అమల్లోకి వచ్చింది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వేర్వేరు టెన్యూర్లపై 5 బేసిస్ పాయింట్ల వరకు



ఎంసీఎల్ఆర్ తగ్గించింది. ఇప్పుడు ఇక్కడ వ్యయాధారిత సగటు వడ్డీరేటు(ఎంసిఎల్ఆర్) 8 శాతానికి తగ్గింది. ఒక నెల, 3 నెలలు, 6 నెలల ఎంసీఎల్ఆర్ వరుసగా 8.3 శాతం, 8.45 శాతం, 8.70 శాతంగా ఉన్నాయి. ఎక్కువగా కన్జూమర్ లోన్ ఏడాది ఎంసీఎల్ఆర్‌తో లింక్ అయి ఉంటుంది. ఏడాది, రెండేళ్ల ఎంసీఎల్ఆర్ 8.85 శాతంగా ఉండగా 3 ఏళ్ల ఎంసీఎల్ఆర్ 8.90 శాతంగా ఉంది. ఇది సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి రానుంది. ఐడీబీఐ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ ఓవర్‌నైట్ 8.05 శాతంగా ఉంది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 8.05 శాతం, ఒక నెల ఎంసీఎల్ఆర్ 8.20 శాతం, 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.50 శాతం, 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.70 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ 8.75 శాతం, రెండేళ్లు, మూడేళ్ల ఎంసీఎల్ఆర్ వరుసగా 9.30 శాతం, 9.70 శాతంగా ఉన్నాయి.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14